www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2018-20 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల: రూ.4.00

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66, సంచిక : 245
ఆదివారం 25-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



స్వీట్ పోయె డ్రైఫ్రూట్స్ వచ్చే

- ధరలెక్కువైనా పెరుగుతున్న ఆర్డర్లు
- పలు వ్యాధులకు పరిష్కారంగా సూచిస్తున్న డాక్టర్లు
- మధ్యతరగతి అటే
- ఎక్కడ చూసినా గిఫ్ట్ ప్యాకులుగా అవే

మారుతున్న జీవనశైలిలో భాగంగా స్వీట్స్ స్థానాన్ని ఇప్పుడు డ్రైఫ్రూట్స్ ఆక్రమించాయి. ఒకప్పుడు గిఫ్ట్ ప్యాకెట్లుగా స్వీట్స్ స్థానంలో డ్రైఫ్రూట్స్ ప్యాకులు దర్శనమిస్తున్నాయి

7 లో

Sunday Special

జిమ్నాస్టిక్స్‌లో తెలుగు తేజం



ప్రపంచకప్ టోర్నీలో హైదరాబాదీ అమ్మాయికి కాంస్యం

మెగా పోటీల్లో పతకం గెలిచిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా రికార్డు

12 లో



తిండి గోల

- రకరకాల సూక్తులు
- ఒక్కో సీజన్‌కు ఒక్కో విధానం
- ప్రస్తుతం కీటోడైట్‌పైనే చర్చోపచర్చలు
- జనంలో అనుమానాల వెల్లువ

తాను పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ప్రతి మనిషి కోరుకుంటాడు, అలాగే సంపూర్ణ ఆరోగ్యంతో ఎక్కువ బతకాలని ఆకాంక్షిస్తుంటాడు. అందుకే ఆరోగ్యంగా ఉండడానికి వీలయినన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ఉంటారు. చెడు అలవాట్లు ఉన్న వారు కూడా వాటి నుంచి తప్పించుకోవడానికి తగినన్ని ఆరోగ్య సూత్రాలను పాటిస్తూనే ఉంటారు.

7 లో

మరో భారీ మోసం

రూ.389.85 కోట్లకు వజ్రాల కంపెనీ టోపీ

- ఆర్నెల్ల కిందటే ఓరియంటల్ బ్యాంకు ఫిర్యాదు
- ఇప్పుడు కళ్లు తెరిచిన సీబీఐ



ఢిల్లీ: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన మామ ఛోక్సీలు పంజాబ్‌నేషనల్ బ్యాంకులో దాదాపు రూ. 11,400కోట్ల భారీ మోసాలకు పాల్పడిన ఉదంతం సంచలనం సృష్టిస్తుండగానే మరో వజ్రాల కంపెనీ భారీ మోసం బయటపడింది. అదే తరహాలో ఢిల్లీకి చెందిన ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాల ఎగుమతి కంపెనీ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో రూ. 389.85కోట్ల భారీ మోసానికి పాల్పడ్డట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. అనంతరం సీబీఐ ఈ కంపెనీపై కేసు నమోదు చేసింది.

ఓరియంటల్ బ్యాంకు ఈ కంపెనీపై ఆర్నెల్ల క్రితమే సీబీఐకి ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం సీబీఐ.. కంపెనీకి చెందిన డైరెక్టర్లు సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణ కుమార్ సింగ్, రవి సింగ్‌లపై కేసు నమోదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్ పేరుతో ఉన్న మరో కంపెనీపైనా సీబీఐ కేసు పెట్టింది. ఈ కంపెనీ ఓరియంటల్ బ్యాంకు నుంచి 2007 నుంచి 2012 సంవత్సరాల మధ్య పలుమార్లు రుణం పొందింది. అది మొత్తం రూ.389కోట్లు బకాయి పడింది. ఈ కంపెనీ కూడా లెటర్స్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓయూ) ద్వారా అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించిన ఓబీసీ సీబీఐని ఆశ్రయించింది.

ఎవ్వరిని వదలం...

బ్యాంకు కుంభకోణాలపై మౌనం వీడిన మోడీ



న్యూఢిల్లీ : ప్రజాధనం దుర్వినియోగం ఆమోదనీయం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణంపై

- మిగతా 2 లో

పెట్టుబడులతో ఏపీకి రండి

తయారీ రంగంలో అగ్రగామిగా రాష్ట్రం

సీఐఐ ప్రారంభ సభలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. వేదికపైన సీఎం చంద్రబాబు, కేంద్ర , రాష్ట్ర మంత్రులు, అధికారులు తదితరులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : పరిశ్రమలు నెలకొల్పేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అన్నివిధాల అనుకూలమైన రాష్ట్రమని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం సాయంత్రం విశాఖ బీచ్ రోడ్డులోని ఏపీఐఐసీ గ్రౌండ్స్‌లో జరిగిన 24వ సీఐఐ భాగస్వామ్య సదస్సును ఆయన ప్రారంభించి కీలక ఉపన్యాసం చేశారు. ప్రగతి శీలమైన సంస్కరణలు, సమర్థ పాలనతో అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు గ్లోబల్ ఇన్వెస్టర్లు విశ్వాసంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. 2.3 బిలియన్ల భారత ఆర్థిక వ్యవస్థ 10 బిలియన్ల స్థాయికి చేరుకోగలదన్నారు. దేశం తయారీ రంగంలో ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమస్థానంలో ఉందన్నారు. ఏపీలో రియల్‌టైమ్ గవర్నెన్స్ సమర్థవంతంగా ఉందని, ఆదానీ గ్రూప్ ఆధ్వర్యంలో భావనపాడు పోర్టు దేశంలోనే అత్యుత్తమ నౌకాశ్రయంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. నీరు, విద్యుత్, రవాణా వ్యవస్థలు పటిష్టంగా ఉన్నాయని, ఫైబర్ గ్రిడ్ ద్వారా కోటిన్నర లక్షల మందికి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సామర్థ్యం కలిగిందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ విప్లవాత్మక మార్పులన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ విశాఖలో మూడవసారి భాగస్వామ్య సదస్సు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. 60 దేశాల నుంచి 230 మంది, మొత్తం 2,500 మంది పారిశ్రామిక వేత్తలు పాల్గొన్న ఈ సదస్సులో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, రెనువబుల్ ఎనర్జీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ రంగాలలో ఎంఓయూలు జరగబోతున్నాయన్నారు. తొలి రోజు పర్యాటక రంగంలో ఒప్పందాలకు గాను రూ. 8 వేల కోట్లు పెట్టుబడుల ద్వారా 32 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గత మూడేళ్లుగా 1946 ఎంఓయూలు జరిగాయని, వాటి విలువ రూ. 13.54 లక్షల కోట్లుగా చెప్పారు. ఇవి సాకారం అయితే 31 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. జరిగిన ఒప్పందాలలో 59 శాతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నామని, ఇప్పుడు పరిశ్రమలు, సేవా రంగంపై దృష్టి సారించామన్నారు. కేంద్రం సహాయంతో రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్లు అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్ల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రపంచంలోనే ఐదు ఉత్తమ నగరాలలో ఒకటిగా రాజధానిని నిర్మించేందుకు అన్ని దేశాలు పర్యటించానన్నారు. గ్యాస్, ఆయిల్ నిక్షేపాలతో ఏపీ సంపన్న రాష్ట్రంగా మారడం ఖాయమన్నారు.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు మాట్లాడుతూ ఏపీ పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రమే కాక, ఉద్యోగ కల్పన రాష్ట్రం కావాలని ఆకాంక్షించారు. తూర్పు తీరంలో అతిపెద్ద ఆటో కాంపోనెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తుందన్నారు. తాను కేంద్ర మంత్రినే కాక, ఏపీ నుంచి పార్లమెంట్ ప్రతినిధిగా వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ డైరక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షులు శోభనా కామినేని, ఆదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ ఆదానీ, డీఐసీపీ కార్యదర్శి రమేష్ అభిషేక్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా

- మిగతా 2 లో

మునిపల్లె రాజు కన్నుమూత



విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు కథను సుసంపన్నం చేసిన ప్రఖ్యాత కథకుడు, రచయిత మునిపల్లె రాజు ఇకలేరు. ఏఎస్‌రావు నగర్‌లోని తన స్వగృహంలో ఆయన కన్నుమూశారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మునిపల్లె ఆయన స్వగ్రామం. బాపట్ల

- మిగతా 2 లో

బ్రేకుల్లేని ప్రమాదాలు

అనంత, నెల్లూరు, శ్రీకాకుళం టాప్



- శాఖల మధ్య లోపిస్తున్న సమన్వయం
- క్షేత్రస్థాయి పరిశీలనకు ఉమ్మడి కమిటీలు దూరం
- బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినా, నివారణ చర్యలు శూన్యం
- జనవరిలో 707 మంది దుర్మరణం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రోడ్డు ప్రమాదాల మరణాల్లో అనంతపురం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలు రాష్ట్రంలోనే టాప్‌లో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలతోపాటు మరణాల సంఖ్యను తగ్గించేందుకు చేపడుతున్న చర్యలు అంతగా ఫలితాలు ఇవ్వటంలేదు. రోడ్డు ప్రమాదాల తగ్గించే విషయంలో శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. అంతేగాకుండా తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించటంలో ఉమ్మడి కమిటీలు (జాయింట్ కమిటీలు) వైఫల్యం చెందుతున్నారు. ఒకటీ రెండు జిల్లాల్లో కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి బ్లాక్ స్పాట్స్‌ను గుర్తిస్తున్నా, నివారణ చర్యలు మాత్రం శూన్యం. దీంతో సంఖ్యా పరంగా ప్రమాదాలు తగ్గుతున్నా, మరణాలు మాత్రం క్రమంగా పెరుగుతున్నాయి. పోలీసుశాఖ చూపించే ప్రమాద మరణాల గణాంకాలల్లోనూ తప్పులు ఉంటున్నాయి. ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్ది రోజుల తర్వాత మృతి చెందితే ఆ మరణాలను

- మిగతా 2 లో



ఉద్యోగం లేదా భృతి

ఏఐవైఎఫ్ ఆధ్వర్యాన ఖాళీల భర్తీ కోసం ఉద్యమించిన యువత

కర్నూలులో లెనిన్ సహా 50 మంది అరెస్టు

విజయవాడలో పకోడీలు అమ్మి నిరసన

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు/విజయవాడ : నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని లేనిపక్షంలో నిరుద్యోగ భృతి చెల్లించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో యువత వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహించింది. ఈ ఆందోళనలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్నూలులో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు వైఎఫ్ కార్యకర్తలు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు సహా 50 మందిని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడలో యువకులు పకోడిని విక్రయించి నిరసన వ్యక్తం చేశారు. కర్నూలులో వైఎఫ్ కార్యకర్తలు సీపీఐ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకు పోయేందుకు యువకులు ప్రయత్నించడంతో పోలీసులకు ఆందోళనకారుల మధ్య తోపులాట, వాగ్వాదం

- మిగతా 11 లో

ఇదీ లోకం!



విద్యుత్ కార్మిక పోరు

ఇక ఉధృతం

- 26న కలక్టరేట్ల ముట్టడి
- జెన్‌కో ,ట్రాన్స్‌కో డిస్కంల దిగ్బంధనం...
- రౌండ్ టేబుల్ లో కార్మిక సంఘాల నిర్ణయం..
- పలు యూనియన్ల మద్దతు...



విజయవాడలో విద్యుత్ కార్మికులకు మద్దతుగా జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు. పక్కన గఫూర్, ఉమామహేశ్వరరావు తదితరులు

విశాలాంధ్ర అమరావతి : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కారమయ్యే వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం తీవ్రతరం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు చెప్పారు. విజయవాడలోని ప్రెస్ క్లబ్ లో ఆదివారం విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం

- మిగతా 2 లో

సిరియాలో కాల్పుల విరమణ

ఓటింగ్‌పై ఐరాసలో జాప్యం



వాషింగ్టన్ : సిరియాలో 30 రోజులు కాల్పుల విరమణ పాటించాలన్న డిమాండుపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ)లో ఓటింగ్ జరపడంలో జాప్యం జరుగుతోంది. గత గురువారం నుంచి ఓటింగ్ జరపడం అనేక సార్లు వాయిదాపడింది. తూర్పు ఘౌతా జిల్లాలో, సిరియాలోని మిగిలిన చోట్ల ప్రస్తుతం జరుగుతున్న మారణహోమానికి అంతంపలకడమే ఈ తీర్మానం ప్రధాన లక్ష్యం. ఓటింగ్ కోసం షెడ్యూల్ నిర్ణయించిన తరువాత మూడు దఫాలు వాయిదాపడింది. రష్యా మద్దతు కూడగట్టడంలో భద్రతా మండలి సభ్యులు విఫలంకావడంతో ఓటింగ్‌లో జాప్యం జరుగుతోందని వాషింగ్టన్‌పోస్టు తెలిపింది. భద్రమండలి శాశ్వత సభ్యునిగా రష్యాకు వీటో అధికారం ఉంది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు 11 సార్లు వీటో అధికారాన్ని రష్యా వినియోగించిందని పేర్కొంది.

వాంగ్‌తో గోఖలే 'సహకార' చర్చలు



బీజింగ్ : భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే శుక్రవారం బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమయ్యారు. డొక్లాం ప్రతిష్ఠంభన కారణంగా ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో బీట్లు వస్తుండడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా అధికారులిద్దరూ భేటీ అయ్యారు. గతంలో చైనాకు భారత రాయబారిగా పనిచేసిన ప్రస్తుత విదేశాంగ శాఖ కార్యదర్శి గోఖలే చైనా వెళ్లినట్టు భారత దౌత్యకార్యాలయం శనివారం ట్విట్టర్‌లో పేర్కొంది. ఈ విషయాన్ని చైనా విదేశాంగ శాఖ శుక్రవారం రాత్రే ప్రకటించింది. 'చైనా-భారత్ సంబంధాలను పెంపొందించేందుకు భారత అధికారులు సున్నిత అంశాలపై వివేకంగా వ్యవహరిస్తారని, చైనాతో కలిసి పనిచేస్తారని భావిస్తున్నాం' అని వాంగ్ అన్నారు. మాల్దీవుల్లో తాజా పరిణామాలతో సహా భారత్, చైనా మధ్య ఉన్న సున్నిత అంశాలనుద్దేశించి ఆయన పై విధంగా పేర్కొన్నారు. కాగా, క్వింగ్‌డావో నగరంలో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోడీ జూన్‌లో చైనాకు వెళ్లనున్నారు.

రేపట్నుంచి చైనా కమ్యూనిస్టు పార్టీ ప్లీనరీ

ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణపై అగ్రనేతల చర్చలు



బీజింగ్ : చైనాలో అధికార కమ్యూనిస్టు పార్టీ మూడ్రోజుల పాటు అగ్రనేతలతో సమావేశం కానుంది. వచ్చేనెలలో జరిగే ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కీలక అంశాలపై నాయకులు నిశితంగా చర్చించనున్నారు. గ్జి జిన్‌పింగ్ అధ్యక్షతన ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు ప్లీనరీ జరగనుంది. పార్టీ కేంద్ర కమిటీ దీన్ని నిర్వహించనున్నట్టు శనివారం పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. 204 మంది పూర్తిస్థాయి సభ్యులు, 170 ప్రత్యామ్నాయ సభ్యులతో కూడిన కేంద్ర కమిటీ.. పార్టీకి సంబంధించి నిర్ణయాధికారాన్ని కలిగివుంది. ప్లీనరీలో ఏయే అంశాలపై చర్చిస్తారు, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది ప్రకటన స్పష్టం చేయలేదు. అక్టోబరులో పార్టీ కాంగ్రెస్‌లో కీలక పదవులను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వపరమైన పదవులను ఖరారు చేయాల్సి ఉంది. ప్రధాని, మంత్రులు, సెంట్రల్ బ్యాంక్‌చీఫ్‌లు వంటి పదవుల విషయంలో పార్లమెంటు ఆమోదం తప్పనిసరి. జిన్‌పింగ్‌కు నమ్మకస్తుడిగా పరిగణించే హార్వర్డ్‌లో శిక్షణ పొందిన ఆర్థికవేత్త ల్యూహే చైనా సెంట్రల్ పీపుల్స్ బ్యాంకు తదుపరి గవర్నర్ రేసులో ముందంజలో ఉన్నట్టు సమాచారం. జిన్‌పింగ్ రాజకీయ ఆలోచనల మేరకు రాజ్యాంగాన్ని సవరించేందుకూ, కొత్తగా అవినీతి నిరోధక సంస్థను నెలకొల్పేందుకు పార్లమెంటు ఆమోదం అవసరం. మార్చి 5 నుంచి జరగబోయే పార్లమెంటు సమావేశాలు ఈ నిర్ణయాలు జరగనున్నాయి.

అమెరికా మరో దుందుడుకు చర్య

జెరూసలెంకు మారనున్న రాయబార కార్యాలయం

వాషింగ్టన్ డీసీ : జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తిస్తూ వివాదాస్పద నిర్ణయం తీసుకున్న అమెరికా మరో అడుగు ముందుకేస్తూ ఇజ్రాయెల్‌లోని తన రాయబార కార్యాలయాన్ని మార్చనున్నది. ఇప్పటివరకు టెల్ అవీవ్‌లో ఉన్న రాయబార కార్యాలయాన్ని మేలో అధికారికంగా జెరూసలెంకు తరలించనున్నట్టు అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త దౌత్య కార్యాలయాన్ని 2019లో ప్రారంభించన్నామని ప్రకటించింది, అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ వారాల తరబడి జాప్యం అనంతరం భద్రతా ప్రణాళికకు ఆమోదం తెలపడంతో ఈ ప్రకటన వెలువడినట్టు ది హిల్ తెలిపింది. "ఇజ్రాయెల్ 70వ వార్షికోత్సవం, ఈ కార్యాలయం ప్రారంభం ఏకకాలంలో జరుగుతాయి. రాయబార కార్యాలయం తొలుత అర్నోనా నైబర్‌హుడ్ ప్రాంతంలో ఉంటుంది. జెరూసలెంలోని అమెరికా కాన్సులేట్ జనరల్ గృహంగా ప్రస్తుతం వాడుతున్న అధునాతన భవనంలో ఈ కార్యాలయం పనిచేస్తుంది" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హెథర్ నౌరట్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఈ చారిత్రాత్మక చర్యను తీసుకునేందుకు మేము ఎంతో ఆసక్తితో ఉన్నాం. మేలో ప్రారంభించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం" అని ఒక ప్రకటనలో శ్వేత భవనం తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం అధికారులతో మాట్లాడుతూ, జెరూసలెంకు తరలింపు నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. శాశ్వత సదుపాయం కోసం సంపన్నులైన యూదు-అమెరికన్ల నుంచి విరాళాలు తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తిస్తున్నామని గత ఏడాది డిసెంబరు 6న ట్రంప్ ప్రకటించి వివాదానికి తెరలేపారు.

ఉత్తరకొరియాపై అమెరికా ఆంక్షలు



వాషింగ్టన్ : అమెరికా నుంచి ఉత్తరకొరియాకు ఊహించని పరిణామం ఎదురైంది. ఇప్పటి వరకు ఏ దేశం మీద విధించని అత్యంత కఠినమైన ఆంక్షలను ఉత్తరకొరియాపై విధిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తర కొరియాపై భారీగా ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. 'ఈ రోజు నేను కీలక ప్రకటన చేస్తున్నా. ఉత్తర కొరియాపై ఎవరూ ఊహించని రీతిలో అమెరికా పెద్ద ఎత్తున ఆంక్షలు విధిస్తోంది' అని ప్రకటించారు. ఖజానా శాఖ ఈ మేరకు చర్యలు ప్రారంభించిందని చెప్పారు. నౌకాయానానికి సంబంధించిన వాటితో పాటు మొత్తం 50 కంపెనీలపై ఆంక్షలు అమలు కానున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ కూతురు, వ్యక్తిగత సలహాదారు ఇవాంక ట్రంప్ కొరియా ప్రతినిధులతో భేటీ అయిన తర్వాత ఈ ప్రకటన వెలువడటం ప్రాధాన్యత సంతరించుకున్నది. గతేడాది వరుస క్షిపణి ప్రయోగాలతో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన ఉత్తరకొరియా . అమెరికా మీద క్షిపణి ప్రయోగం చేసి ఆ దేశాన్ని నాశనం చేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఉత్తర కొరియా, అమెరికా అధ్యక్షుల మధ్య తీవ్ర మాటల యుద్ధమే నడిచింది. క్షిపణి పరీక్షలతో కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌పై ఒత్తిడి పెంచేందుకే అమెరికా ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. తాజా ఆంక్షలు ఉత్తర కొరియా మిలిటరీ, అణు పరీక్షలపై తీవ్ర ప్రభావం చూపనుంది.ఇప్పటికే ఉత్తర కొరియా మీద పలు వాణిజ్య, ఆర్థికపరమైన ఆంక్షలు ఉన్నాయి. ఆ దేశం నుంచి ఎగుమతయ్యే శుద్ధి చేయబడిన పెట్రోలియం ఉత్పత్తులపై నిషేధం విధిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి గతంలో ప్రకటించింది.

అమెరికా ఆంక్షలు కాదని ఉత్తరకొరియాతో వాణిజ్య, వ్యాపార లావాదేవీలు జరపాలని చూసిన దేశాలతో తాము వ్యాపారాలను తెగదెంపులు చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఒకవేళ ఆంక్షలు విధించినప్పటికీ.. ప్యాంగ్యాంగ్‌లో ఎటువంటి మార్పు రాకపోతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు మరింత భయంకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. సముద్ర మార్గం ద్వారా ఆ దేశం చేస్తున్న వ్యాపారాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ ఆంక్షలు విధించినట్లు అమెరికా తెలిపింది. దీనిపై వైట్‌హౌస్ ప్రతినిధి సారా శాండర్స్ స్పందించారు. ఇటువంటి ఆంక్షలు పెట్టడం వల్ల ఉత్తరకొరియాలో మార్పులు వచ్చే అవకాశం ఉందని ఆమె అన్నారు.

దాడులతో దద్దరిల్లిన ఆఫ్ఘన్

20 మంది సైనికులు సహా 35 మంది మృతి

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్ శనివారం దాడులు, ఆత్మాహుతి బాంబు దాడులతో దద్దరిల్లింది. ఈ ఘటనల్లో 35 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 20 మంది సైనికులు ఉన్నారని అధికారులు తెలిపారు. పశ్చిమ ఫరాహ్ రాష్ట్రంలో సైనిక స్థావరంలోకి తాలిబాన్ తీవ్రవాదులు చొచ్చుకునిపోయి జరిపిన దాడిలో ఆఫ్ఘన్ నేషనల్ ఆర్మీ (ఏఎన్ఏ)కి చెందిన దాదాపు 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. బాలా బులుక్ జిల్లా షేఖీ బాలా కాన్స్క్ ప్రాంతంలో అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో దాడి ప్రారంభమైందనీ, ఈ దాడిలో కనీసం 20 మంది సైనికులు మృతిచెందారని ఫరాహ్ ప్రావెన్షియల్ కౌన్సిల్ అధికారి దదుల్లా క్వాని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 12 మంది తాలిబాన్ తీవ్రవాదులు కూడా మృతి చెందారని టోలో న్యూస్ ఛానెల్ తెలిపింది. "గత రాత్రి పెద్ద సంఖ్యలో తీవ్రవాదులు బాలా బులుక్ జిల్లా షేఖీ బాలా కాన్స్క్ ప్రాంతంలోని సైనిక స్థావరంపై దాడి చేశారు. దురదృష్టవశాత్తు మేము 20 మంది సైనికులను కోల్పోయాం. మరో ఇద్దరు సైనికులకు గాయాలయ్యాయి. ఆ ప్రాంతానికి మరిన్ని బలగాలను మేము పంపాం" అని క్వానీ చెప్పారు. ఈ దాడికి తామే బాధ్యులమని తాలిబాన్ తీవ్రవాదులు ప్రకటించారు. ఈ దాడి ఘటన జరగడానికి ముందు ఫరాహ్ రాష్ట్ర రాజధాని సోరే షమాల్ ప్రాంతంలో ఘర్షణలు జరిగాయని క్వాని చెప్పారు. తీవ్రవాదులతో పోరాడడంలో భద్రతా సిబ్బంది బిజీగా ఉండడంతో తాలిబాన్ తీవ్రవాదులు బాలా బ్లాక్ జిల్లాలోని సైనిక స్థావరంపై దాడి చేశారని తెలిపారు. సైనిక స్థావరంపై దాడి చేసిన తాలిబాన్ తీవ్రవాదులు పెద్ద సంఖ్యలో ఆయుధాలను కూడా పట్టుకుపోయారని ఇక్కడకు అందిన వార్తలు తెలిపాయి.

కాబూల్‌లోని దౌత్యప్రాంతం సమీపంలో ఉదయం జనసమ్మర్థంగా ఉండే సమయంలో జరిగిన ఆత్మాహుతి బాంబుదాడిలో ముగ్గురు మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయని హోం మంత్రిత్వశాఖ ప్రతినిధి నస్రత్ రహిమి ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు తెలిపారు.

శరణార్థులకు సంఘీభావం.. యూరోపియన్ పార్లమెంట్ సమర్థన

బ్రస్సెల్స్ : శరణార్థుల కోసం యూరోపియన్ యూనియన్ (ఈయూ) నిధుల్లో నుంచి కొంతభాగాన్ని వినియోగించడాన్ని యూరోపియన్ పార్లమెంటు అధ్యక్షుడు ఆంటోనియో తజానీ సమర్థించారు. ఇలా చేయడం సరైనదేనని, వారికి సంఘీభావం తెలియజేయడమేనన్నారు. శనివారం బ్రస్సెల్స్‌లో ఈయూ నేతలు అనధికారికంగా సమావేశమయ్యారు. శరణార్థులతో సహా పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం తజానీ మీడియాతో మాట్లాడుతూ.. వారిని కుటుంబంగా గౌరవించడం ప్రాదేశిక కమ్యూనిటీ సభ్యుల బాధ్యతన్నారు. ఈయూ భవిష్యత్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేటప్పుడు అక్రమ వలసలు, స్వదేశీయ, విదేశీ భద్రత, నిరుద్యోగం వంటి సవాళ్లు ఎదురవుతాయని ఈయూ పార్లమెంటు అంచనాగా తెలిపారు.

బ్రేకుల్లేని ప్రమాదాలు

(మొదటిపేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకోవటంలేదు. ఇదిలావుండగా, రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల మరణాలశాతం గణనీయంగా పెరిగింది. అనంత జిల్లా మరణాల శాతంలో ప్రథమస్థానంలో ఉండగా, నెల్లూరు రెండోస్థానంలోనూ, శ్రీకాకుళం మూడోస్థానంలో ఉన్నాయి. అనంతపురం జిల్లాల్లో గత సంవత్సరంతో పోల్చితే 43.18 శాతం మరణాలు పెరిగాయి. అలాగే నెల్లూరులో 42.86 శాతం, శ్రీకాకుళంలో 34.78 శాతం మరణాలు పెరిగాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలోనే ఈ గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. గత ఏడాది జనవరిలో, ఈ సంవత్సరం జనవరిలో జరిగిన ప్రమాదాలు, మరణాలు, గాయలపాలన వారి సంఖ్యను పోల్చితే మొత్తం మీద 4.59 శాతం మరణాలు తగ్గగా, 10.20 శాతం గాయల సంఖ్య తగ్గింది. 2017 జనవరిలో రాష్ట్రంలో 2,060 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 741 మంది మృతి చెందారు. ప్రమాదాలలో 2,461 మంది గాయాలపాలయ్యారు. అలాగే ఈ ఏడాది జనవరిలో మొత్తం 1,900 రోడ్డు ప్రమాదాలలో 2,210 మంది గాయపడగా, 707 మంది మృతి చెందారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో ప్రమాద మరణాలశాతం ఎక్కువగా ఉంది. విజయనగరం జిల్లాల్లో మాత్రం ప్రమాద మరణాల సంఖ్య 51 శాతం తగ్గగా, చిత్తూరులో 22.99 శాతం, కృష్ణాలో 25.32 శాతం, విశాఖలో 19.70 శాతం తగ్గాయి.

ప్రాణాలు తీస్తున్న వేగం

ప్రమాద మరణాలలో రాష్ట్రంలోనే మొదటి మూడుస్థానాలలో ఉన్న అనంతపురం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో జాతీయ రహదారులపైనా అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జాతీయ రహదారులపై వాహనాల వేగానికి కళ్లెం వేయటంలో అన్ని శాఖలు చేతులెత్తేశాయి. రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు పోలీసు, రవాణా, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖతోపాటు జాతీయ రహదారుల సంస్థ అధికారులు సమన్వయంతో పని చేయాలి. కాని రవాణాశాఖ అధికారులు తమ పరిధికే పరిమితం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జాతీయ రహదారులపై ఓవర్‌లోడుతో వెళ్లే లారీలు, ఇతర రవాణా వాహనాల నుంచి పెనాల్టీలనే వసూళ్లు తప్ప, రోడ్డు ప్రమాదాలపై పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలే లేవు. అలాగే తరచూ ప్రమాదాలకు కారణమైన జాతీయ, రాష్ట్ర, స్థానిక సంస్థల రహదారులకు మరమ్మతులు చేయటంలో ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇక తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలు, పెద్ద ప్రమాద ప్రదేశాలను ఆయా శాఖల ఉమ్మడి తనిఖీ కమిటీలు స్వయంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. ప్రమాద ప్రదేశాలను (బ్లాక స్పాట్స్) గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉండగా, అలా జరగటంలేదనే విషయం రోడ్డు భద్రత కమిటీ సమావేశంలోనే వెల్లడైనట్లు సమాచారం. ఇదిలావుండగా, జిల్లాస్థాయిలో ఒకటీ రెండు జిల్లాల్లో మినహా రోడ్డు భద్రతా కమిటీల సమావేశాలే జరగటంలేదు. దీంతో పలు జిల్లాల్లో ప్రమాదాలను అదుపు చేయటం సాధ్యపడటంలేదనే వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి.

రోడ్లపై వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు పోలీసు, రవాణాశాఖల వద్ద స్పీడ్ గన్‌లు ఉన్నప్పటికీ, వాటిని సరిగా వినియోగించటంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు ప్రత్యేకంగా రూ.10 కోట్లను కేటాయించింది. ఈ నెల నుంచే అన్ని జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలపై పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. మరి ఈ ఆదేశాలు ఏ మేరకు పని చేస్తాయో వేచి చూడాల్సిందే.

2017, 2018 జనవరిలో జరిగిన ప్రమాదాలు, మరణాలు, గాయాలపాలైన వారి వివరాలు

జిల్లా పేరు	జనవరి 2017			జనవరి 2018		
	ప్రమాదాలు	మరణాలు	గాయాలు	ప్రమాదాలు	మరణాలు	గాయాల
శ్రీకాకుళం	95	23	154	71	31	84
విజయనగరం	116	43	129	95	21	171
విశాఖపట్నం	206	66	256	176	53	168
తూర్పు గోదావరి	221	71	259	223	64	247
పశ్చిమ గోదావరి	160	51	159	158	60	216
కృష్ణా	258	79	292	246	59	255
గుంటూరు	210	88	216	206	79	203
ప్రకాశం	101	40	117	137	49	142
నెల్లూరు	118	35	128	122	50	140
కర్నూలు	163	55	227	114	58	146
కడప	139	59	178	109	53	146
అనంతపురం	113	44	175	111	63	119
చిత్తూరు	160	87	171	132	67	173
మొత్తం	**2,060**	**741**	**2,461**	**1,900**	**707**	**2,210**

ఇక ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. కార్మిక సంఘలతో పాటుగా ఇతర ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, రెగ్యులర్ ఉద్యోగ సంఘాల నాయకులు తమ సంపూర్ణ మద్దతు తెలియచేశాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ అత్యవసర సర్వీసుల ఉద్యోగులు ఆందోళన బాట పడితే చంద్రబాబు ప్రభుత్వం నిరంకుశ ధోరణిలో వ్యవహరించటం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 26 వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా పికెటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థకి కొమ్ము కాస్తూ కార్మికులను విస్మరిస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంట్రాక్టు వ్యవస్థని ప్రారంభించిందే చంద్రబాబుని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవటం శోచనీయమన్నారు. యాజమాన్యాల రాతపూర్వక హామీతో ఈ నెల 20 వరకు కార్మికులు తమ సమ్మె వాయిదా వేసుకున్నారని అన్నారు. కార్మికుల ఇబ్బందులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు చంద్రబాబుని కలిస్తే బెదిరింపు ధోరణిలో మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 20 సంవత్సరాలగా కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు. .అనంతరం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫుర్ మాట్లాడుతూ రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు చీకట్లో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 26 వ తేదీన జరిగే కలక్టరేట్ల ముట్టడికి తమ సంపూర్ణ మద్దతు తెలియ చేస్తున్నామని అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడికి నేటికి సరైన న్యాయం జరగటం లేదని విమర్శించారు. తక్షణమే కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించి , దశల వారీగా క్రమబధికరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఆందోళన చేస్తున్న చంద్రబాబుకి చీమ కుట్టినట్టైనా లేకపోవటం నియంత పోకడలకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రికి విద్యుత్ కార్మికుల సమస్యలు విన్నవించేందుకు వెళ్ళితే నిరాశతో వెనుదిరగాల్సి వచ్చిందని వాపోయారు.కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపని పక్షంలో నిరవధిక దిగ్బంధన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.అనంతరం పలు యూనియన్ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలియ చేస్తామని చెప్పారు. టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన కార్మికుల హామీలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేసారు.26 వ తేదీన జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల కలక్టరేట్ల దిగ్బందనం కార్యక్రమంలో తాము సైతం బాగస్వామ్యులుగా నిలిచి వారితో కలిసి ఉద్యమిస్తామని చెప్పారు. ప్రాణత్యాగలు చేస్తూ విధులు నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికులు సరిహద్దుల్లో కావాలి కాస్తున్న జవాన్లు తో సమానమని కొనియాడారు. సర్కారు మెడలు వంచి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తామని అన్నారు.204 కోట్ల రూపాయలు అదనపు బడ్జెట్ కేటాయిస్తే కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించవచ్చని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో లేని పక్షంలో ఉద్యమం ఉద ృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొలారి ,ఏఐయూటిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్ , అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య ,అంగన్ వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బారావమ్మా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు స్వరూపరాణి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహారావు, ఆటో ట్రాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్వీ నర్సింహారావు,నాంచారయ్య, కొటేశ్వరరావు ,రామారావు, డిహెచ్ పిఎస్ నాయకులు రాయప్ప తదితరులు పాల్గొన్నారు..

మునిపల్లె రాజు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

తాలూకా గరికపాడు గ్రామంలో 1925లో ఆయన జన్మించారు. తండ్రి హనుమంతరావు, తల్లి శారదమ్మ. చిన్నప్పటి నుంచి కథా సాహిత్యంపై మక్కువ పెంచుకున్న రాజు 1943 నుంచి 1983 వరకు భారత ప్రభుత్వ రక్షణ శాఖలోని ఇంజనీరింగ్ సర్వీసులో సర్వేయర్‌గా పనిచేశారు. అస్తిత్వనదం ఆవలి తీరాన, దివోస్వప్నాలతో ముఖాముఖి, పుష్పాలు - ప్రేమికులు - పశువులు, మునిపల్లె రాజు కథలు తదితర కథా సంకలనాలు వెలువరించారు. అలసిపోయినవాడి అరణ్యకాలు, వేరొక ఆకాశం వేరెన్నో నక్షత్రాలు కవితా సంపుటాలు ప్రచురించారు. ఆయనను ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. తెలుగులో మేజిక్ రియలిజంలో మొదటగా రాసిన రచయిత మునిపల్లె రాజు. ఆయన మూఢాచారాలకు వ్యతిరేకి, అభ్యుదయవాది, తాత్వికుడు, లోకాన్ని కాచివడబోసిన లోకజ్ఞుడు, బహుముఖ వ్యూహాత్మకమైన కథా కథనదక్షుడు. సోషల్ రియాలిటీ, సోషల్ ఫిలాసఫీ మొదలుకొని మేజిక్ రియలిజమ్ వరకు, మార్క్సిస్టు భావజాలం దగ్గర నుంచి మానవ జీవితాలను శాసించే సూత్రాల వరకు అన్నింటినీ తన కథలలో ప్రతిభావంతంగా ప్రయోగించి మెప్పించిన ఏకైక కథారచయిత. ఆయన రచనలు ఒక లయాత్మకమైన జీవన సంగీతాన్ని కలిగి ఉంటాయి. రాజు 'పూజారి' నవల ఆధారంగా బీఎన్‌రెడ్డి 'పూజాఫలం' చలనచిత్రాన్ని కళాత్మకంగా తెరకెక్కించారు. అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, జమున ప్రధాన పాత్రలు పోషించారు. ఆయన సాహితీ కృషికి గుర్తింపుగా నూతలపాటి గంగాధరం సాహితీ సత్కారం, జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్ పురస్కారం, రావి శాస్త్రి మెమోరియల్ లిటరరీ ట్రస్ట్ పురస్కారం, పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం, ఇంకా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను అందుకున్నారు.

అరసం సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : నిండైన మానవత్వమే ధ్యేయంగా, మూఢాచారాలకు వ్యతిరేకంగా, అభ్యుదయవాదిగా, విలక్షణ శైలితో కథా రచన చేసిన మునిపల్లె రాజు మృతికి అభ్యుదయ రచయితల సంఘం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించింది.

అరసంతో సుదీర్ఘ అనుబంధం కలిగిన మునిపల్లె రాజు మార్క్సిస్టు భావజాలం నుంచి మానవజీవితాలను శాసించే సూత్రాలను తన కథల్లో ప్రతిభావంతంగా చిత్రించి మెప్పించారని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. సుదీర్ఘ సాహితీ కృషికి గుర్తింపుగా 1994లో పులుపుల వెంకట శివయ్య సాహితీ పురస్కారాన్ని, నూతలపాటి గంగాధరం సాహితీ పురస్కారం, జ్యేష్ఠ ట్రస్టు, రావిశాస్త్రి మెమోరియల్ ట్రస్టు పురస్కారం వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారన్నారు. అరసం గుంటూరు జిల్లా శాఖ ఈతరం కోసం కథాస్రవంతి శీర్షికన వీరి కథలను ప్రచురించిందని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎం.ఆర్.ఆనంద్, కార్యదర్శి కె.శరత్, చెరుకుమల్లి సింగా తెలిపారు. గుంటూరు జిల్లా బాపట్ల తాలుకాలోని గరికపాడు గ్రామంలో 16-03-1925న జన్మించి, తెనాలిలో విద్యార్థిగా ఉండగానే రచనా వ్యాసాంగం ప్రారంభించిన మునిపల్లె రాజు 1943 నుంచి 1983 వరకు రక్షణ శాఖలో పనిచేశారు. 'మేజిక్ రియలిజం'ను ప్రతిబింబించిన వీరి కథలకు (దివో స్వప్నాలతో ముఖాముఖి) కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

ఏపీకి రండి

(మొదటిపేజీ తరువాయి)

ఆటోమోటివ్ కాంపెనెంట్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చర్స్, రాష్ట్ర ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డుల మధ్య అవగాహన ఒప్పందాలను ఉప రాష్ట్రపతి సమక్షంలో జరిపారు. అనంతరం లూలూ గ్రూప్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ఉప రాష్ట్రపతి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పి.అశోకగజపతిరాజు, రాష్ట్ర మంత్రులు చినరాజప్ప, నారా లోకేష్, గంటా శ్రీనివాసరావు, అమర్‌నాథ్ రెడ్డి, ఎంపీలు హరిబాబు, అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, టూరిజం కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎవ్వరిని వదలం...

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మాట్లాడుతూ'ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై ఈ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ఇది సుస్పష్టం. అలాంటి వారిపై చర్యలు కొనసాగుతాయి' అని ఎకనామిక్స్ టైమ్స్ నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ వేదికగా స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని పేర్కొన్నారు. పీఎన్‌బీ ముంబయి శాఖలో 1.77 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 11,400 కోట్ల) మేర మోసం వెలుగుచూసింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, మరో ఆభరణాల కంపెనీ ఈ మేరకు మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు బ్యాంకు వర్గాలు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ఫిర్యాదు చేశాయి.

నెల మూలవేతనం

తెలంగాణ రెవెన్యూ ఉద్యోగులకు ప్రోత్సాహకం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రెవెన్యూ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. దీనివల్ల 35,749 మంది ఉద్యోగులు లబ్ధిపొందనున్నారు. క్లిష్టమైన భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా పూర్తి చేసిన రెవెన్యూ శాఖ ఉద్యోగులకు నెల మూలవేతనాన్ని అందివ్వాలని చంద్రశేఖరరావు నిర్ణయించారు. 10,809 మంది రెవెన్యూ ఉద్యోగులు, 24,410 మంది వీఏఓలు, 530 మంది సర్వే విభాగం ఉద్యోగులకు ఒక నెల మూలవేతనాన్ని బోనస్‌గా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేవలం వంద రోజుల వ్యవధిలోనే రెవెన్యూ ఉద్యోగులు రేయింబవళ్లు పనిచేసి భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అభినందించారు. విధి నిర్వహణ పట్ల ఇంతటి చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన ఉద్యోగులుండటం రాష్ట్రప్రజలు, రైతుల అదృష్టంగా అభివర్ణించారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం, కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై ప్రగతిభవన్‌లో శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు జీఆర్ రెడ్డి, సీనియర్ అధికారులు ఎస్.నర్సింగరావు, రాజేశ్వర్ తివారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 80 ఏళ్లుగా భూరికార్డుల నిర్వహణ సరిగా లేదని, భూమి క్రయవిక్రయాలు, యాజమాన్యంలో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. దీంతో భూరికార్డులు గందరగోళంగా మారాయని, రాష్ట్రంలో పంట పెట్టుబడి పథకం అమలు చేసేందుకు ఏ భూమికి ఎవరు యజమానో కచ్చితంగా తెలియాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. దీంతో భూ రికార్డులను సరిచేసి పూర్తి పారదర్శకంగా పథకం అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కేవలం వంద రోజుల్లోనే రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో తిరిగి, రైతులతో మాట్లాడి భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత తెచ్చారని సీఎం తెలిపారు. సొంత భూములున్న రైతులతో పాటు అసైన్డ్‌దారుల విషయంలోనూ స్పష్టత వచ్చిందన్నారు.

రాష్ట్రంలోని థియేటర్లలోనూ మార్చి 2న సినిమా ప్రదర్శనల నిలిపివేత

చలనచిత్ర పరిశ్రమ సంస్థ చైర్మన్ అంబికా కృష్ణ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : డిజిటల్ ప్రొవైడర్ల చార్జీల భారానికి నిరసనగా దక్షిణాది రాష్ట్రాలలో మార్చి రెండో తేదీ నుంచి జరగనున్న సినిమా థియేటర్ల బంద్‌లో భాగంగా రాష్ట్రంలోని సినిమా థియేటర్లలో ప్రదర్శనలు నిలిపి వేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అంబికా కృష్ణ చెప్పారు. డిజిటల్ ప్రొవైడర్లు ఒక్కో థియేటర్‌కు వసూలు చేస్తున్న రూ.27 వేల చార్జీలు నిర్మాతలకు భారంగా మారాయన్నారు. విజయవాడలోని ఎన్‌టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబికా కృష్ణ మాట్లాడారు. యూఎఫ్‌ఓ, క్యూబ్ సంస్థలలో ఒప్పందం చేసుకున్న రెండు వేల థియేటర్లలోనూ ప్రదర్శనలను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. డిజిటల్ సినిమా ప్రొవైడర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు మధ్య జరుగుతున్న చర్చలలో చైర్మన్ హోదాలోనే పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు అనాలోచితంగా చేసుకున్న ఒప్పందల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సినిమా థియేటర్లలో కేంద్ర, రాష్ట్ర ప్రకటనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వటంలేదన్నారు. యూఎఫ్‌ఓ, క్యూబ్ డిజిటల్ సినిమా ప్రొవైడర్లు ఆయా సినిమా థియేటర్లలో 20 నిమిషాలపాటు ప్రైవేటు ప్రకటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇదిలావుండగా, రాష్ట్రంలో తడ నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్మించే చిన్న సినిమా నిర్మాతలకు రూ.10 లక్షల వరకు ప్రోత్సాహం ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే చిన్న సినిమాలను నిర్మించాలన్నారు. పెద్ద సినిమాలలో కూడా కనీసం ఒక షెడ్యూల్‌ను రాష్ట్రంలో చిత్రీకరించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు సినిమా హీరోలను కలిసి కోరినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సినిమా పరిశ్రమ ఏర్పాటుకు సహకరించాలని సీఎంను కోరామన్నారు. తడ ప్రాంతంలో ఏవీఎం సంస్థ ఆధ్వర్యంలో 24 ఎకరాల స్థలంలో స్టూడియో ఏర్పాటుకు చొరవ చూపుతున్నట్లు అంబికా కృష్ణ తెలియజేశారు.

ప్రజారోగ్యం-పర్యావరణ సమతుల్యమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజారోగ్యంతోపాటు పర్యావరణ సమతుల్యమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కేదారేశ్వరపేటలోని కార్పొరేషన్ ఆఫీసులో గ్రీన్ అవార్డులపై శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులకు సమావేశ వివరాలను వెల్లడించారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనాన్ని వృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఇందుకోసం ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించి పచ్చదనం పెంపొందించుటకు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అవార్డులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ అవార్డులను 8 విభాగాలుగా విభజించామన్నారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యానవనాలు పెంచేవారు, పబ్లిక్ మరియు ప్రైవేట్ పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ప్రాంగణాలు, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్, టెర్రేస్ గార్డెన్స్, వ్యక్తులు, ఎన్జీవోలు, పురాతన చెట్లు, వృక్ష సముదాయాలు సంరక్షించేవాళ్లు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధరఖాస్తు ఫారాలను కార్పొరేషన్ వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ గ్రీన్ అవార్డ్స్ యాప్ ద్వారా, ఈ-మెయిల్ లేదా పోస్టు ద్వారా పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7997650835 నెంబర్‌కు ఆఫీసు పనివేళల్లో ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. గ్రీన్ అవార్డులకు పూర్తిచేసిన దరఖాస్తులు ఈనెల 28లోగా తమకు చేరాలని తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవం ఏప్రిల్‌లో సీఎం చేతుల మీదుగా జరుగనున్నట్లు వివరించారు.

పర్యాటకానికి రూ.8 వేల కోట్ల పెట్టుబడులు

భాగస్వామ్య సదస్సులో తొలిరోజు 56 సంస్థలతో ఎంవోయూలు



విశాలాంధ్ర-విశాఖ సిటీ : విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో తొలి రోజు పర్యాటక రంగంలో 56 సంస్థలతో రూ.8 వేల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగాయి. ఈ మేరకు శనివారం ఉదయం సెషన్-1లో భాగంగా స్ట్రాటజీస్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టూరిజం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సర్వీసెస్ ఇన్ ఎమర్జింగ్ టూరిస్ట్ ఆఫ్ ఏపీ అనే అంశంపై ప్లీనరీ సదస్సు నిర్వహించారు. సదస్సులో రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎంఓయూలు కుదుర్చుకున్న ప్రతి సంస్థ తమ యూనిట్ల స్థాపనకు ఏ అవరోధాలు లేకుండా చూసేలా ఒక సమన్వయ అధికారిని నియమిస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమతో పాటు పర్యాటక రంగానికి కావాల్సిన అనుమతులన్నీ ఆన్‌లైన్‌లో 21 రోజుల్లోనే ఇస్తున్నామని ఆయన వివరించారు.

దేశీయ పర్యాటకంలో ఉత్తరప్రదేశ్, తమిళనాడు తరువాత ఏపీ మూడవ స్థానంలో ఉందన్నారు. ఆధ్యాత్మిక టూరిజంలో అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 25 వేల వసతి సదుపాయాలు అవసరముండగా, ప్రస్తుతం 9,300 మాత్రమే అందుబాటులో ఉన్నాయని, రానున్న ఐదేళ్లలో 17 వేల వసతి సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. ఈ ప్యానెల్ సదస్సులో పాల్గొన్న సభ్యులు వారి వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఎస్ బ్యాంకు ప్రతినిధి నిఖిల్ సోప్నీ మాట్లాడుతూ పర్యాటక ప్రాజెక్టులు విజయవంతంగా ఫలితాలు అందించాలంటే కేంద్ర ప్రభుత్వం రూ.15 కోట్లు దాటిన ప్రాజెక్టును ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించాలన్నారు. మహీంద్ర హాలిడేస్ ప్రతినిధి మోనేష్ విజ్ మాట్లాడుతూ పర్యాటక ప్రాజెక్టులు తొందరగా నెలకొల్పాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉండాలన్నారు. హాలీడేస్ ఐక్యూ సీఈఓ హరినాయర్ మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టులతో పాటు అమరావతి రాజధానిని కూడా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎస్ఎల్ గ్రూప్ ప్రతినిధి రాజీవ్ దుగ్గల్ మాట్లాడుతూ పర్యాటకరంగంలో ప్రైవేట్ సెక్టార్ ముందుకు రావాలంటే ప్రోత్సాహకంగా పెట్టుబడి భద్రత కల్పించాలన్నారు. ఓయె రూమ్స్ అధినేత తన్మయ రాజవంశీ మాట్లాడుతూ పర్యాటకరంగం అభివృద్ధిలో భాగంగా ఆయా ప్రాంతాలలో విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జూంకార్ సీఈఓ గ్రేగ్ మోరవ్ మాట్లాడుతూ ఏపీకి వచ్చే పర్యాటకులలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు 25 శాతం మంది ఉన్నారని ఈ సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఐఐ ప్రతినిధి పి.వి.నరసింహరావు మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో ఒప్పందాలు కుదిరాక పర్యాటక ప్రాజెక్టులను మనుగడలోకి తీసుకురావడంలో ఉన్న అవరోధాలు గుర్తించి, వాటి తొలగింపునకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఓయూలు చేసుకున్న కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. టూరిజం శాఖా మంత్రి భూమా అఖిలప్రియ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ రంగంలో రూ.15 వేల కోట్లు


ఏపీలో ఆటోమొబైల్ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని వక్తలు పేర్కొన్నారు. తొలిరోజు భాగస్వామ్య సదస్సులో సెషన్-2 క్రింద ఆటోమొబైల్ రంగం మార్పులు, ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం అనే సెమినార్‌లో ప్యానెల్ సభ్యులు తమ అభిప్రాయాలు తెలిపారు. బంగ్లాదేశ్ ప్రతినిధి అబ్దుల్ మత్లాహ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్య రహిత ఎలక్ట్రికల్, సోలార్ సహాయంతో తయారయ్యే వాహనాలు, వాటి విడి భాగాలను 95 శాతం భారత్ నుంచే పొందుతున్నా మన్నారు. వాటి నిర్వహణకుగాను కావలసిన చార్జింగ్ కేంద్రాలను నెలకొల్పాల్సి ఉందన్నారు. ఇతర వక్తలు మాట్లాడుతూ భారత్‌లో 7 శాతం వృద్ధి రేటు కేవలం ఆటోమొబైల్ రంగం నుంచే సాధ్యపడుతుందన్నారు. ఎలక్ట్రిక్, సోలార్‌తో నడిచే వాహనాలు, పరికరాలు, ప్యానల్స్ తయారీని ప్రోత్సహించాల్సి ఉందని, పెట్రోల్ బంకులలో సైతం బ్యాటరీ చార్జింగ్ యంత్రాలు పెద్ద ఎత్తున నెలకొల్పాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆటోమొబైల్ రంగంలో 15 పారిశ్రామిక సంస్థలు 15,224 కోట్ల రూపాయలు పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ మేరకు 57,368 మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, కమిషనర్ సిద్దార్థ్ జైన్, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సెషన్ వక్తలు ప్రహ్లాదరావు, నిర్మలా మిండా, మనోహర్ భట్, సురేష్ చెట్టియార్, నిషాంత్ ఆర్యా పాల్గొనగా మోడరేటర్‌గా విష్ణు మాథూర్ వ్యవహరించారు. పారిశ్రామిక వేత్తలు చేతన్, ప్రసాద్, కె.సి.ఎం.జి. వెంకటరమణ, ధీరజ్‌మోహన్, కృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

6న చలో ఢిల్లీ తరలిరండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకోసం, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా మార్చి 6న ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన "చలో ఢిల్లీ" కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి అన్నివర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అందరూ ముక్తకంఠంతో నినదించాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్లుగా మాయమాటలతో మోసం చేస్తున్న బీజేపీ కపట నాటకాలపై సమరానికి ఆంధ్రులంతా ఐక్యంగా కదలాలన్నారు. ప్రత్యేక తరగతి హోదా సాధించే వరకూ ఏకోన్ముఖంగా వరుస కార్యక్రమాలు, ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. ఇందుకు ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాలతోపాటు వివిధ వాపార, వాణిజ్య సంఘాలన్నీ ప్రత్యేక హోదా సాధన కోసం నడుంకట్టాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 ఏళ్ళు ఇస్తామన్న బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేసిందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేవలం ఏడాదికి జిల్లాకు రు.50 కోట్లు చొప్పున ముష్టి వేశారన్నారు. విశాఖ రైల్వే జోన్ ఊసే లేదన్నారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు గాలికొదిలేసారన్నారు. పోలవరం నిర్మాణం విషయంలో, విభజన హామీల అమలు విషయంలో కేంద్రం ఏపీకి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రకటించిన జాతీయ విద్యా సంస్థలకు కేంద్రం రూ. 421 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. బీజేపీ నేతలు ఇంకా మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించి, నయవంచనకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించడం ఖాయమని హెచ్చరించారు. ఏపీకి న్యాయం జరిగే వరకు ఐక్య ఉద్యమాలు సాగాలన్నారు. మార్చి 6న జరిగే చలో ఢిల్లీకి తరలిరావాలని, ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని రామకృష్ణ కోరారు.

ఉద్యోగ భద్రత కల్పిస్తా : జగన్



విశాలాంధ్ర-కనిగిరి : కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ, విద్యుత్‌శాఖ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు తాను మద్దతు ఇస్తున్నానని అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పిస్తానని వైసీపీఅధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన బహిరంగసభలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుసైతం తెలుగుదేశం ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. పశ్చిమ ప్రాంత ప్రధాన నీటి వనరు అయిన వెలుగొండ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఫ్లోరిన్, కిడ్నీ బాధితులను తాను ఆదుకొని అధికారంలోకి రాగానే వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితుల్లో వారి ఆవేదనలు తెలుసుకొని వారిని అన్ని విధాలా ఆదుకుంటానన్నారు. నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పనపై చంద్రబాబు ఇచ్చిన హామీ బూటకమయ్యాయన్నారు. ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు షేక్‌బుజ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి సానికొమ్ము రంగనాయకులరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ఏం సాధించారు

టీడీపీకి వైసీపీ సూటిప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగేళ్లుగా ఏం అభివృద్ధి చేశారో చెప్పే ధైర్యం లేక టీడీపీ నాయకులు ప్రతిపక్షంపై విమర్శలు చేస్తున్నారని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ మండిపడ్డారు. జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు వస్తున్న ఆదరణను చూసి టీడీపీ నాయకులు భయపడుతున్నారన్నారు. లోటస్‌పాండ్‌లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పద్మజ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంతలో పశువుల్లా అమ్ముడుపోయిన పశు సంవర్ధక శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డికి జగన్‌ను విమర్శించే స్థాయి లేదని ధ్వజమెత్తారు. దళితులను కించపరిచేలా మాట్లాడిన ఆదినారాయణ రెడ్డికి బుద్ధి చెప్పడానికి దళితులంతా కంకణం కట్టుకొని ఉన్నారన్నారు. చంద్రబాబు తన అసమర్ధ పాలనను కప్పిపుచ్చుకోవడానికి మంత్రులను ఉసిగొల్పి జగన్‌పై ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా కోసం జగన్ ఎంపీలతో రాజీనామాలు, కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధపడ్డారన్నారు. హోదా ఉద్యమాన్ని అణగదొక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు మాట మార్చి హోదా సంజీవిని అంటూ కొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. చంద్రబాబు వైఖరి చూస్తుంటే పక్క రాష్ట్ర ఎమ్మెల్యేకి అభివృద్ధి కోసం రూ.50 లక్షలు ఇస్తుంటే ఓటుకు నోటు కేసు పెట్టారంటారేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

ప్రత్యేక హోదాపై మాకు ముడిపెట్టొద్దు

కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు వ్యాఖ్యలు



విశాలాంధ్ర-విశాఖపట్నం : 'నేను టీడీపీ మనిషినైనా ఎన్‌డీఏలో భాగస్వామిని. కేంద్రంలో కేవలం టీడీపీ మైనర్ పార్టనర్ మాత్రమే. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నారు. అక్కడ టీడీపీ మంత్రులు ఇద్దరు.. ఇక్కడ బీజేపీ తరపున ఇద్దరు మంత్రులున్నారు. ఇక్కడున్న వారు రాష్ట్ర ఇంట్రెస్ట్‌పై పని చేస్తారు. అక్కడ ఉన్న మేమిద్దరం అక్కడి ఇంట్రస్ట్‌పై పని చేస్తాం. అందువల్ల ప్రత్యేక హోదాపై మాకు ముడిపెట్టి అడగొద్దు' అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతి రాజు అన్నారు. శనివారం విశాఖలో ప్రారంభమైన పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు(సీఐఐ)లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా విమానయాన రంగంలో కార్గో సర్వీసును అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అందుకే భోగాపురం ఎయిర్‌పోర్టుకు కూడా కొత్తగా రీటెండర్ పిలిచామన్నారు. ప్రారంభంలోనే కార్గోను కలిపే టెండర్ ఎందుకు పిలవలేదన్న ప్రశ్నకు అశోక్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. 'నేను టెండర్లు పిలిచే గుమస్తాను కాదు.. తొలి సారి టెండర్‌లో కార్గో సర్వీసును ఎందుకు చేర్చలేదో రాష్ట్ర ప్రభుత్వాన్ని అడగండి' అని వ్యాఖ్యానించారు. ఎయిర్‌పోర్టులను కేవలం ప్యాసింజర్ల కోసమే ఇంతకాలం వినియోగించారు. కార్గో సర్వీసు ఉంటేనే ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. అప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయన్నారు.

జీఎస్‌టీతో పెట్టుబడులు ఆగిపోయాయి

జీఎస్‌టీ అమలు తర్వాత ఏ రాష్ట్రంలోనూ పెట్టుబడులకు అనుకూలంగా లేవని కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు అన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలకు అనుగుణంగానే పెట్టుబడులు వస్తాయన్నారు. హోదా గురించి తనను అడిగితే కన్ఫ్యూజన్ అవుతుంది. హోదా ఉన్న రాష్ట్రాలకు లేని రాష్ట్రాలకు రాయితీల్లో 30 శాతమే తేడా ఉంటుందన్నారు. హోదా ఉంటే 90 శాతం గ్రాంట్స్, 10 రుణంగానూ, లేని రాష్ట్రాల్లో 60 శాతం గ్రాంట్స్‌గానూ, 40 శాతం రుణంగానూ వస్తాయన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుదారులను ఆకర్షించడంలో మెరుగ్గా ఉందన్నారు. 'ఈ వేదికలో బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజి ప్రకటించే వీలు లేదు. ఇది కేవలం పెట్టుబడిదారుల సదస్సు. ప్రభుత్వ ప్రకటనలు చేయడానికి వేరే వేదికలుంటాయి. దయచేసి కన్ఫ్యూజన్ చేయకండి' అని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

హోదా ఇస్తామని మోసం

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని, మోసపోయిన టీడీపీ పోరు మొదలు పెట్టిందని ఎస్సీ కార్పొరేషన్, చైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. విశాఖలో శనివారం జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి శత్రువులతో స్నేహం చేస్తూ పోరాడుతూ రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. కేంద్రం సహాయం ఉన్నా లేకున్నా రాష్ట్రాన్ని నడిపించగల ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విభజన హామీలలో ఉన్న రైల్వే జోన్, రాజధాని నిర్మాణం, పోలవరం, లోటు బడ్జెట్ పూడ్చడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. జగన్ కేసుల కోసం కేంద్రంతో స్నేహం చేస్తుంటే బాబు రాష్ట్ర ప్రయోజనాల కోసం స్నేహం చేస్తున్నారన్నారు. హోదా కోసం తమ పోరాటం ఆగదని, ఇప్పటికే తమ కేంద్ర మంత్రులు ఢిల్లీలో పోరాడుతున్నారని, మిత్రత్వంలో ఉండి విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రం దాటవేత ధోరణి ప్రదర్శిస్తుందన్నారు.

హోదా, విభజన హామీలను తక్షణమే నెరవేర్చాలి

- మార్చి 4న విశాఖ బీచ్‌లో క్యాండిల్ ర్యాలీ
- అఖిల పక్ష సమావేశంలో కొణతాల



విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : ఒక్క ఓటు, మూడు రాష్ట్రాల నినాదంతో కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బీజేపీ పభుత్వం పనిచేస్తోందని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ ఆరోపించారు. శనివారం విజయనగరం పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన అఖిలపక్ష పార్టీల నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొణతాల మాట్లాడుతూ తినడానికి తిండిలేక ఏపీ రాష్ట్ర ప్రజలు అలమటిస్తుంటే బీజేపీ నేతలు అడ్డదిడ్డంగా మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టు అంటూ కొత్త నినాదాన్ని తీసుకువస్తున్నారన్నారు. జెండాలను ప్రక్కన పెట్టి ప్రత్యేక హోదాకై జరుగుతున్న పోరాటంలో అన్ని రంగాలు, రాజకీయ, ప్రజాసంఘాలు ముందుకు రావాలని కోరారు. రాయలసీమలో హైకోర్టు, ఉత్తరాంధ్రకు హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటుచేయాలని ఎనాటినుండో డిమాండ్ ఉందన్నారు. 2017 జూన్‌తో ఏ రాష్ట్రానికి కూడా ప్రత్యేక రాయితీలు ఇవ్వకూడదని నిర్ణయించామని చెప్పిన ప్రధానమంత్రి తరువాత కూడా కొన్ని రాష్ట్రలకు కొనసాగించడం దేనికి సంకేతమన్నారు. రాయగడ కేంద్రంగా ఒడిశాకు రైల్వేజోన్ కేటాయించడం ద్వారా విశాఖకి జోన్ ఏర్పాటుకు దారి సుగుమమైందని, విశాఖకు తక్షణమే రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజలను విడదీసే విధంగా బీజేపీ మొసలి కన్నీరు కారుస్తూ ఏపీ ప్రజలను మోసంచేస్తోందని విరుచుకుపడ్డారు. అలాగే పార్లమెంట్‌లో వచ్చే సమావేశాలలో తెలుగు వాడి వాణి వినిపించాల్సిన బాధ్యత ఉన్నందున, 184 నిబంధన ప్రకారం చర్చజరగాలని, ఆ తరువాత అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టాలని, ఆ తరువాతే ఆఖరి అస్త్రంగా ఎంపీలు రాజీనామా చేయాలని కొణతాల సూచించారు. ప్రత్యేక ప్యాకేజీకై ఢిల్లీకి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానిస్తే ఎట్టి పరిస్థితిల్లోనూ పోకూడదని కొణతాల సూచించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను తక్షణమే కల్పించాలని కోరుతూ తాము నిర్వహిస్తున్న పోరాటాల్లో భాగంగా మార్చి 4న విశాఖ బీచ్‌లో సాయంత్రం కొవ్వత్తుల ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా కన్వీనర్ పి.కామేశ్వరరావు మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టు కేటాయించాలని కొత్తనాటకానికి తెరతీస్తున్న బీజేపీ, ప్రజలను పక్కదారి మళ్లించి, ప్రత్యేక హోదాను పక్కన పెట్టేందుకు కుట్రపన్నుతున్నారన్నారు. హోదా ఖచ్చితంగా ఆంధ్రుల హక్కు అని, దాని సాధనకోసమే ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో గత మూడున్నరేళ్లుగా అలుపెరుగని పోరాటాన్ని సీపీఐ ఆధ్వర్యంలో సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, వైకాపా నాయకులు చనుమల్ల వెంకటరమణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు యడ్ల ఆదిరాజు, సీపీఎం నేత పి.రమణమ్మ, టీడీపీ నేత మమ్ముల తిరుపతిరావు, జనసేన నాయకులు త్యాడ రామకృష్ణ, ఏసిపి నేత రామానాయుడు తదితరులు మాట్లాడారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

భాగస్వామ్య సదస్సు ఖర్చులు రూ. 7.20 కోట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విశాఖపట్నంలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 7.20 కోట్లను విడుదల చేసింది. ఈమేరకు పాలన పంమైన ఆమోదం తెలియచేస్తూ పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి సోలొమన్ ఆరోకియరాజ్ వేర్వేరుగా మూడు జీవోలను శనివారం విడుదల చేశారు. వీవీఐపీలు, ప్రతినిధులు, విదేశీ అతిథులకు వసతి, రవాణా, భోజన సదుపాయం, సాంస్కృతిక కార్యక్రమాలు, హోర్డింగ్‌లతో ప్రచారం, తాత్కాలికంగా విద్యుద్దీపాలతో ఆయా ప్రాంతాల అలంకరణ తదితరాల కోసం రూ. 3.43 కోట్లను మంజూరు చేశారు. ఏపీ పెవిలియన్‌లో భోజనంతో పాటు ఇతర ఖర్చుల కోసం రూ. 2.03 కోట్లను కేటాయించారు. ఇంకా ప్రతినిధులకు అందచేసే సదస్సు కిట్లు, సీఎం బహుమతులు, ఎంఓయూ ఫోల్డర్లు, పేపర్లకోసం రూ. 1.74 కోట్లను మంజూరు చేశారు.

కేంద్ర బడ్జెట్ సవరించి ఏపీని ఆదుకోండి

ప్రధానికి పీసీసీ అధ్యక్షుడు రఘువీరా లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కేంద్రబడ్జెట్‌ను సవరించి తక్షణమే ఏపీకి న్యాయం చేసేలా నిధుల కేటాయింపు చేయాలని భారత ప్రధాని నరేంద్ర మోడీకి పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి శనివారం లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వవస్థీకరణ బిల్లు-2014ను పార్లమెంటులో ఆమోదింపజేయడంలో నాటి యూపీఏ ప్రభుత్వానికి భారతీయజనతాపార్టీ సంపూర్ణమద్దతు ఇచ్చిన విషయం మీకు గుర్తుచేస్తున్నాము. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా, నాటి ప్రధాని డా॥మన్మోహన్‌సింగ్ పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు, విభజన బిల్లులోని అన్ని అంశాల అమలుకు సంపూర్ణ బాధ్యత తీసుకుంటుందని, కాంగ్రెస్ (యుపిఎ) చేసినదానికన్నా ఎక్కువే చేస్తామని 2014 ఎన్నికల సందర్భంలో పార్లమెంటు లోపల, బయటా మీ పార్టీ (బాజాపా) చేసిన వాగ్దానాల, హామీల చరిత్ర కూడా మీకు తెలియంది కాదు. ఈ నేపధ్యంలో కేంద్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యతతో అమలు చేయాల్సిన అంశాలకు సంబంధించి ప్రతి బడ్జెట్ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యతలు ఇస్తారని ఆశించిన రాష్ట్రప్రజలకు మీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీవ్ర నిరాశను మిగిల్చింది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు, చేసిన చట్టాలు అమలు కాకపోవడం చూస్తున్న ఏపీ ప్రజలు మొదటిసారి భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థమీద, భారత సమాఖ్య వ్యవస్థమీద అవిశ్వాసాన్ని వ్యక్తంచేసే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొంటున్నాయని చెప్పడానికి విచారిస్తున్నాము. మీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల పూర్తి నిర్లక్ష్యం, వివక్ష ప్రదర్శిస్తుందనే భావన ఏర్పడుతోంది. ముఖ్యంగా ఇటీవల ప్రవేశపెట్టిన 5 వ బడ్జెట్‌లో కూడా ఆంధ్రప్రదేశ్ ప్రాధామ్యాలకు తగిన నిధులు కేటాయింపులు లేకపోవడంతో 5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పార్లమెంటులో ఇచ్చిన హామీలు, ముఖ్యంగా ప్రత్యేక తరగతి హెూదా అమలు విషయంలో ఎలాంటి రాజీలేకుండా అమలు కావాల్సిందేనని రాష్ట్ర ప్రజలు ఏకోన్ముఖంగా నినదిస్తున్నారు. అందువల్ల సమస్య తీవ్రతను గమనించి 2018 మార్చి నెలలో ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్‌లో సవరణలు తీసుకువచ్చి ఏపీకి న్యాయం జరిగేవిధంగా నిధులు కేటాయింపులు చేయాలని రఘువీరారెడ్డి ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

పారిశ్రామిక రాజధానిగా విశాఖ

- రాయితీలు లేకపోయినా పెట్టుబడులు వస్తున్నాయి
- బీజేపీ, టీడీపీ మిత్రపక్షంగా కొనసాగుతాయి
- విశాఖ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.హరిబాబు

విశాలాంధ్ర-విశాఖ : భారతదేశంలో మొదటిసారిగా విశాఖలో మూడు సార్లు వరుసగా పెట్టుబడుల సదస్సులు జరగడం రికార్డని, ఏపీకి ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖ పారిశ్రామిక రాజధానిగా మారుతుందని విశాఖ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.హరిబాబు అన్నారు. విశాఖలో శనివారం జరిగిన పెట్టుబడుల సదస్సులో ఎంపీ చివరగా విలేకరులతో మాట్లాడుతూ సహజ వనరులు, మానవ వనరులు పుష్కలంగా ఉన్న విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు దేశవిదేశాలకు చెందిన వారు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక రాయితీలు లేకపోయినా లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా ఉంటేనే రాయితీలు వస్తాయని, దాని వల్ల పెట్టుబడులు పెరుగుతాయని ఉన్న అపోహ అవాస్తవమని అర్థమవుతుందన్నారు. ఆకర్షణీయ నగరంగా విశాఖ విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని, దీని వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. పెట్టుబడుల సదస్సులో లక్షల కోట్లు ఒప్పందాలు జరుగుతున్నప్పటికీ అన్ని పూర్తి స్థాయిలో జరుగుతాయని చెప్పలేమన్నారు. 15 శాతం గ్రౌండ్ అయితే సదస్సు విజయవంతమైనట్లేనని పేర్కొన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతో తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్నంత కాలం రాష్ట్రంలో కూడా రెండు పార్టీలు కలిసే కొనసాగుతాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేంద్రప్రభుత్వ రాష్ట్రానికి రావల్సిన అన్ని నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల పెట్టుబడులకు రూ.250 కోట్లు విడుదల చేసిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విశాఖకు పేరు ప్రఖ్యాతలు రావాలంటే ఇక్కడ ఆ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

సంపాదకీయం

మోడీ పాలన స్కాముల పుట్ట

అవినీతి రహిత పాలన అందిస్తానన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాటల్లోని డొల్లతనం బట్టబయలైంది. నల్లధనం పోగుపడటానికి, ఉగ్రవాదులకు నిధులు సమకూరడానికి పెద్దనోట్లు దోహదపడుతున్నాయని, కాబట్టి వాటిని అరికట్టడానికి, నల్లధనాన్ని వెలికి తీయడానికి పెద్దనోట్లు రద్దు చేస్తున్నట్లు అందరినీ నమ్మించిన మోడీ ఆ తరువాత అంతకుమించిన పెద్దనోటు రూ.2 వేలు చలామణిలోకి తెచ్చి, నల్లధనాన్ని తేలికగా కూడబెట్టుకోడానికి నల్లకుబేరులకు అవకాశం కల్పించారు. ఇప్పుడు విపణిలో రెండువేల నోటు నలుసైపోయింది. అథోజగత్తులోకి వెళ్లిపోయింది. భారతీయ రిజర్వుబ్యాంకు (ఆర్‌బీఐ) కొత్తగా ముద్రించిన రూ.10, రూ.5 నోట్లు నాసిరకంగా ఉండటంతో, నకిలీనోట్లు చలామణిలోకి రావడానికి వీలు కల్పించినట్లయింది. ఇటీవల బహిర్గతమైన రూ.15000 కోట్ల మేర (అనధికారికంగా సుమారు రూ.25 వేల కోట్లు) రెండు కొత్త కుంభకోణాలు వెలుగు చూడటంతో ఒకదాని తరువాత మరో కుంభకోణంలో పరోక్ష ప్రమేయం కలిగి ఉండటం, కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారులతో కుమ్మక్కై, వారి ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేయడం ద్వారానే మోడీ ప్రభుత్వం మనుగడ సాగించగలుగుతున్నట్లు కనిపిస్తోంది. ఒక పెద్ద కుంభకోణాన్ని మరుగుపర్చడానికి మరో కుంభకోణాన్ని ఉపయోగించుకోడానికి మోడీ సర్కారు సంకోచించడంలేదు. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ, ఆయన మామ మెహుల్ ఛోక్సీ విషయంలో ప్రధానికి సంబంధించి జరుగుతున్నదదే. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో నీరవ్‌మోడీ రూ.11,400 కోట్లకు పాల్పడిన భారీ మోసం సంచలనం సృష్టిస్తుండగానే, మరో వజ్రాల కంపెనీ భారీ మోసం శనివారం బయటపడింది. ఢిల్లీకి చెందిన ద్వారకాదాస్ సేఠ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాల ఎగుమతి కంపెనీ ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్‌లో రూ.389.85 కోట్ల భారీ మోసానికి పాల్పడ్డట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. నీరవ్‌మోడీ, మెహుల్ ఛోక్సీ పీఎన్‌బీని రూ.11,400 కోట్లమేర మోసగించి దేశం విడిచి విదేశాలకు పారిపోయినట్లు ఇప్పటివరకు లభ్యమైన సమాచారం ప్రకారం తెలుస్తోంది. అయితే, వారి ఆచూకీ గురించి 'అధికారికంగా' ప్రభుత్వానికి ఎట్టి సమాచారం లేదు. నీరవ్ మోడీ బెదిరింపు ప్రకటనలు వార్తాపత్రికల్లో వస్తున్నాయనుకోండీ.. తన మోసానికి సంబంధించిన వివరాలు తన బ్రాండు, వ్యాపార ప్రతిష్టను దెబ్బతీశాయని, అందుచేత మోసాల ద్వారా పీఎన్‌బీ నుండి తీసుకున్న కోట్లాది రూపాయలు తిరిగి చెల్లించనని నీరవ్ మోడీ ప్రకటించాడు. మరో పక్క మొత్తం నిందను బ్యాంకు మేనేజ్‌మెంటు, సిబ్బందిపై నెట్టివేసేందుకు కుంభకోణాన్ని దర్యాప్తు చేస్తున్న ప్రభుత్వ సంస్థలు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణంలోని నేరగాళ్లందరూ అంతిమంగా 'రక్షించబడ తారని' ఇప్పటికే స్పష్టమైపోయింది. కుంభకోణాలు వెల్లడికావడంతోనే, అవి గత ప్రభుత్వ కాలంలోనే మొదలయ్యాయని, వాటిని మోడీ ప్రభుత్వం బహిర్గతపరిచిందన్న ప్రచారాన్ని మొదట ఉపయోగించారు. అయితే, నరేంద్ర మోడీ గత రెండేళ్ల పాలనలో ఎల్‌ఓయు (లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్)ల జారీ, డబ్బు లూటీ జరిగిందని వెనువెంటనే బహిర్గతమైంది. ఈ నాటకాన్ని బహిర్గతం చేయాలని నిర్ణయించిన తరువాత వాస్తవ నేరగాళ్లు, నీరవ్ మోడీ, ఛోక్సీ కుటుంబాలకు సమాచారం చేరవేయడం మాత్రమేగాక, వారు దేశం విడిచి పారిపోవడానికి సహాయం చేశారు. ఇటువంటి వ్యవహారాల్లో మోడీ ప్రభుత్వం తగినంత అనుభవాన్నే గడించింది. లిక్కర్‌కింగ్ విజయ్‌మాల్యా బ్యాంకుల నుండి రూ.9వేల కోట్లు దోచుకొని విదేశాలకు పారిపోవడానికి మోడీ ప్రభుత్వం సహాయం చేసింది. ఆయన్ని ఇప్పటికీ తిరిగి దేశానికి రప్పించడం సాధ్యం కాలేదు. అంతకుముందు ఐపీఎల్ కుంభకోణానికి పాల్పడిన లలిత్ మోడీ విషయంలో కూడా ఇలాగే జరిగింది. లలిత్‌మోడీ దేశం విడిచి పారిపోవడానికి రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరారాజే, విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ సహాయపడినట్లు వాళ్ల పేర్లు ప్రస్తావించబడ్డాయి. లలిత్ మోడీ రూ.3 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డాడు. నీరవ్ మోడీ, మెహుల్ భాయ్‌లను కాపాడేందుకు, కాన్పూర్‌కి చెందిన పెన్నుల తయారీ కంపెనీ యజమాని విక్రమ్ కొఠారి కుంభకోణం వెల్లడైంది. ఈ కుంభకోణాలను బహిర్గతపర్చడం ద్వారా దేన్ని మరుగుపర్చాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నది ప్రశ్న. స్వయంగా ప్రధానమంత్రే చిక్కుకొన్నట్లుగా ఆరోపించబడుతున్న అతిపెద్ద కుంభకోణం నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే అన్నది సుస్పష్టం. రూ.60 వేల కోట్లకు పైగా రాఫెల్ కుంభకోణం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. గత ప్రభుత్వం విమానం ధరను రూ.5 వేల కోట్లుగా విమాన ఒప్పందంలో దాదాపు ఖరారు చేసింది. నరేంద్ర మోడీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన ఏడాదిలోపే ఫ్రాన్స్ వెళ్లి, గత ప్రభుత్వం సంప్రదింపుల ద్వారా ఖరారు చేసిన ధరలకన్నా మూడురెట్లు ఎక్కువ ధరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో విమానాల కొనుగోలును అనిల్ అంబానీ నెలకొల్పిన కంపెనీకి ఇచ్చారు. విమాన కొనుగోలు ధరను పార్లమెంటుకు చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా లేనటువంటి అతిపెద్ద కుంభకోణమిది. పీఎన్‌బీ కుంభకోణంతో ప్రజల జ్ఞాపకం నుండి రాఫెల్ ఒప్పందం తుడిచివేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ జిత్తులనే కుంభకోణాలకు పాల్పడినవారు గతంలోనూ ఉపయోగించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా బిర్లా సహారా గ్రూపుల నుండి ప్రధానమంత్రి డబ్బు తీసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, అవకతవకలకు పాల్పడి వాటిని కప్పిపుచ్చారు. అలాగే కేవలం 50 వేలు పెట్టుబడి పెట్టి 16 వేల శాతం లాభం ఆర్జించిన బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జేషా గురించి కూడా ఎవరూ మాట్లాడటంలేదు. పాలకులు నిసిగ్గుగా అధికారాన్ని దుర్వినియోగపర్చి, న్యాయవ్యవస్థతో సహా వివిధ పాలనా విభాగాలను తమకు అనుకూలంగా మలచుకొంటున్నారు. అందుకే ప్రతి ఒక్కరు ప్రజాకోర్టును ఆశ్రయించాలి. మోడీ ప్రభుత్వం దాదాపు నాలుగేళ్ల పాలనలో వెలుగుచూసిన వివిధ కుంభకోణాలు.. భారీ మోసాలు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన అవినీతి మోడీ ప్రభుత్వం అవినీతి రహితం కాదని రూఢిపరుస్తోంది.

చురక

కొద్దిమంది కుబేరుల
గుప్పిట్లో జీడీపీ
శ్రమజీవుల పొట్టగొట్టి
స్వాహాచేసే క్రమేపీ

అభివృద్ధి అందకుండ
అంతరాల పురులు విప్పి
అవనిపైన అద్భుతంగా
అసమానత కురులు కప్పి

– వేల్పుల నారాయణ

విజ్ఞానం

భవిష్యత్తు సౌరశక్తిదే
భాగం 4

ఖనిజ ఇంధనాలు - పెట్రోలియం ఉత్పత్తులు


మర్ల విజయ కుమార్

బొగ్గు తరువాత మన ఆర్థిక వ్యవస్థ శక్తి అవసరాలకు పెట్రోలియమ్ ఉత్పత్తులు అత్యంత కీలకమైనవి. మన రవాణా రంగం మొత్తంగా నేడు పెట్రోలియమ్ ఇంధనాలతోనే నడుస్తున్నది. పైగా, పరిశ్రమలకు, ఎమర్జన్సీ డీజిల్ సెట్లకు, వంటగ్యాసుగానూ మరి ఇతర అవసరాలకు పెట్రోలియమ్ ఇంధనాలు వాడబడుతున్నాయి. కాని మన దేశ అవసరాలను తీర్చగలిగిన స్థాయిలో మనకు పెట్రోలియమ్ నిల్వలు లేవు. ఆకారణంచేత మన పెట్రోలియమ్ ఇంధనాల వాడకంలో 75% విదేశాలనుండి దిగుమతి చేసుకోవలసి వస్తూన్నది. సాలుకు దాదాపు 6 లక్షల కోట్లరూపాయల విలువైన విదేశీమారక ద్రవ్యాన్ని మనం ఈ పెట్రోలియమ్ దిగుమతులకోసం ఖర్చుచేయవలసి వస్తూన్నది. "ఇంత ఖర్చు చేసి, పెట్రోలియమ్ ఉత్పత్తులను దిగుమతిచేసుకుని, వాటి వాడకం వలన పర్యావరణ కాలుష్యాన్ని భరించే బదులుగా, మనం సౌర శక్తి వినియోగాన్ని పెంచి, అనతి కాలంలో పెట్రోలియమ్ వాడనవసరంలేని విధంగా మార్పులు చేసుకోవచ్చును కదా?" అనే ఆలోచన మన అందరికీ కలగటం సహజమే. కాని ఆవిధంగా మార్పుజరగటానికి అనేక సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉన్నాయి. అది అనుకున్నంత 'ఈజీ ఏమీ కాదు'. ఈ విషయం గురించి ముందుముందు మనం చర్చిద్దాం.

భూమి పొరలలోకి లక్షల సంవత్సరాలుగా చేరిన జీవపదార్థం పెట్రోలియమ్ గా మారుతుంది. ఆ పెట్రోలియమ్ ను భూగర్భం నుండి వెలికి తీయటం అత్యంత ఖర్చుతో కూడుకున్నపని. భూ ఉపరితలం పైననే కాకుండా, సముద్రంలోకూడా ఈ పెట్రోలియమ్ నిక్షేపాలు కనుగొనబడ్డాయి. దాదాపు మూడు, నాలుగు కిలోమీటర్ల లోతుకు డ్రిల్లింగ్ జరిపి, ఆ పెట్రోలియమ్ ను వెలికి తీస్తారు. అదే సముద్రంలో అయితే, ఆఫ్ షోర్ రిగ్గులను ఉపయోగించి, పెట్రోలియమ్ ను వెలికి తీసి, సముద్రం అడుగునుండి సమీప తీరానికి పైపులైనులు వేసి, తీరానికి రవాణాచేసి, అక్కడ రెఫైనరీలలో ఈ పెట్రోలియమ్ ఖనిజ నూనెలను శుద్ధిచేసి, అనేక రకాల పెట్రోలియమ్ ఉత్పత్తులను క్రాకింగ్ పద్ధతిద్వారా వేరుచేస్తారు. ఆక్టేన్ నెంబరును బట్టి వివిధ పెట్రోలియమ్ ఉత్పత్తులను వేరుచేస్తారు. ఇంధనం చిక్కనైన కొద్దీ, దాని ఆక్టేన్ నంబరు తగ్గిపోతుంది. డీజిల్ ఆయిల్ చిక్కనైనది. భారీవాహనాల ఇంజన్లను నడపటానికి ఇది వాడబడుతుంది. దానికంటే పలుచనైనది, పెట్రోల్ కూడా రవాణా రంగంలో మనం వాడుతుంటాము. కిరసనాయిల్ వంటకు వాడబడుతుంది. దానికంటే ఎక్కువగా శుద్ధి చేయబడిన ఎయిరో ఫ్యూయల్ విమానాల జెట్ ఇంజిన్లలో వాడుతారు. చిక్కటి నూనెలను ఇంజిన్లలో లూబ్రికెంట్ గా వాడుతారు. ఆక్టేన్ నంబరు ఎక్కువగా కలిగిన అతితేలికైన పెట్రోలియమ్ ఉత్పత్తులను పెర్ ఫ్యూములలో, ప్లాస్టిక్ తయారీకి, పోలీ వీనయిల్ పదార్థాల తయారీకి వాడుతుంటారు. ఆకారణంచేత, మన ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన ఈ పెట్రోలియమ్ ఉత్పత్తులపై ఆధార పడకుండా కొంతవరకైనా ఇతర ఇంధనాలను వాడటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరొక ముఖ్యమైన విషయమేమిటంటే, భూమి నుండి వెలికి తీసిన ఈ పెట్రోలియమ్ లో అనేక రకాల ఇతర లవణాలు, ప్రమాదకారమైన రసాయన పదార్థాలు కలిసి ఉంటాయి. వాటిని రెఫైనరీలలో వేరుచేస్తారు. ఆవిధంగా, ఈపెట్రోల్ ఉత్పత్తులను ఇంజన్లలో వాడటం కారణంగా ప్రమాదకర కాలుష్య పదార్థాలు విడుదల కాకుండా అరికట్ట వచ్చును. అయినా మనం సాలుకు 2900 కోట్ల లీటర్ల పెట్రోలును, 9000 కోట్ల లీటర్ల డీజల్ ను వాడుతున్నాము. ఈకారణంచేత, పెద్దమోతాదులో కాలుష్య కారక విషపదార్థాలు పర్యావరణంలోకి విడుదల అవుతున్నాయి. ముఖ్యంగా కార్లు, ఇతర మోటారు వాహనాలు అధికంగా వాడే మన నగరాలలో ఈ పర్యావరణ కాలుష్య ప్రమాదం తీవ్రరూపం దాల్చింది. ప్రపంచంలోనే మనం పెట్రోలియమ్ వాడకంలో 2030 నాటికి మూడవ స్థానంలోకి చేరుకుంటామని నిపుణుల అంచనా.

భూగర్భంలో పెట్రోలియమ్ నూనెలతోబాటు గ్యాసుకూడా విడుదల అయి, రాతిపొరలలోని పగుళ్ళలో చిక్కుకుని ఉంటుంది. ఈగ్యాసును సహజవాయువుగా వ్యవహరిస్తారు. పెట్రోలియమ్ నూనెలకంటే, ఈ సహజవాయువులో కాలుష్య పదార్థాలు తక్కువగా ఉంటాయి. పైగా ఈ గ్యాసు నిక్షేపాలు మనదేశంలో అధికంగా ఉన్నట్లుగా అంచనాలు చెప్తున్నాయి. ఈ సహజవాయువు వెలికితీతకోసం ప్రయత్నాలు గత ఇరవై ఏళ్ళలోనే ఎక్కువస్థాయిలో ప్రారంభమయ్యాయి. గ్యాసు బావులనుండి, పైపు లైన్ల ద్వారా ఈ గ్యాసును రెఫైనరీలకు రవాణాచేసి, అక్కడ శుద్ధిచేసి, చల్లబరచి, ద్రవరూపంలోకి మార్చి, వాడకందారులకు అందిస్తారు. ఈగ్యాసునే వంట గ్యాసుగా కూడా వాడుతుంటారు. ఈ ఏడు మన గ్యాసు అవసరాలలో సగం వరకూ విదేశాలనుండి దిగుమతి చేసుకోవలసి వచ్చింది. దీనికి అయిన ఖర్చు దాదాపు 60,000 కోట్ల రూపాయలు. మన దేశ గ్యాసు అవసరాలు ఈనాడు దాదాపు 15 కోట్ల మెట్రిక్ టన్నులుగా ఉన్నది. అయితే, అంతర్జాతీయ మార్కెట్ లో సహజ వాయువు ధర గణనీయంగా పడిపోవటంతో, దేశీయంగా ఆగ్యాసును ఉత్పత్తి చేయటం ప్రస్తుతానికి లాభకరంగాలేదు. రవాణా అవసరాలకోసం, ముఖ్యంగా నగరాలలో పెట్రోల్, డీజిల్ కు బదులుగా, గ్యాసును వాడితే, పర్యావరణ కాలుష్యాన్ని చాలావరకూ తగ్గించవచ్చును. కొద్దిపాటి మార్పులతో ఈ గ్యాసును విద్యుత్తు ఉత్పత్తికోసం గ్యాస్ టర్బైన్లలో వాడతారు. విద్యుత్తు ఉత్పత్తికి వాడే గ్యాస్ టర్బైన్లలో సామర్థ్యం 30-40 శాతానికి మించదు. అంటే, గ్యాస్ లో 100 యూనిట్ల శక్తి ఉంటే, అందులో 30-40 శాతం మాత్రమే మనకు విద్యుత్తు శక్తిగా ఉపయోగంలోకి వస్తోంది. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలలో బొగ్గు నిల్వలు, వేల టన్నుల బొగ్గును గుండచేసే భారీ పరికరాలు, పెద్ద బాయిలర్ల అవసరముంటుంది. కాని గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలలో, బాయిలర్ అవసరం లేకుండా, టర్బైన్ లోనే గ్యాస్ ను కాల్చవచ్చును. అందుచేత బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకంటే తక్కువ స్థలంలో, తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఈ గ్యాస్ టర్బైన్ విద్యుత్ కేంద్రాలను నెలకొల్పవచ్చును. ఈ గ్యాస్ టర్బైన్లలో మండిన తరువాత విడుదలయ్యే పొగలో ఉండే హానికారక వాయువులను, రసాయనాలను ఫిల్టరు చేసి, బయటికి వదులుతారు. పైగా, బొగ్గులో వలే, గ్యాసుకు బూడిద విడుదల కాదు. అయితే, ఈ గ్యాస్ టర్బైన్లలో బయటికి వెళ్ళే వేడి వాయువులు దాదాపు 300 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉంటాయి. ఆ విధంగా నష్టపోయే శక్తిని, ఒక రికవరీ బాయిలర్ ఉపయోగించి, కొద్దిమోతాదులో గ్యాసును మండించి, అధిక ఉష్ణోగ్రత, ఒత్తిడి వద్ద ఆవిరిని తయారుచేసి, ఒక స్టీమ్ టర్బైన్ ను గాని నడిపితే, మొత్తం పవర్ ప్లాంటు యొక్క సామర్థ్యం 50 నుండి 55 శాతానికి పెంచవచ్చును. వీటినే కంబైన్డ్ సైకిల్ పవర్ ప్లాంటులుగా



వ్యవహరిస్తారు. మన దేశంలో నెలకొల్పే గ్యాస్ టర్బైన్ పవర్ ప్లాంటులు తప్పనిసరిగా కంబైన్డ్ సైకిల్ పవర్ ప్లాంటులు అయిఉండేటట్లుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఒక బొగ్గు ఆధారిత పవర్ ప్లాంటును విశ్రాంత స్థితి నుండి పూర్తి సామర్థ్యానికి తీసుకురావటానికి 2, 3 రోజులు పడుతుంది. కాని గ్యాస్ టర్బైన్లను కొద్ది నిముషాలలో స్టార్ట్ చేసి, అరగంటలోపే పూర్తి సామర్థ్యానికి తేవచ్చును. ఆకారణంచేత, మొత్తం అత్యధిక డిమాండు లో 70 శాతం కనిష్ట డిమాండుగా రోజంతా ఉన్నప్పుడు, బొగ్గు ఆధారిత పవర్ ప్లాంటులను ఆ డిమాండు వద్ద ఉత్పత్తి చేయించి, అధిక డిమాండు ఉండే సమయాలలో, అంటే, ఉదాహరణకు సాయంత్రం 5 నుండి రాత్రి పదివరకూ గ్యాస్ టర్బైన్లతో అధిక డిమాండును సప్లై చేయటంద్వారా, పీక్ లోడును సమర్థవంతంగా అందించవచ్చును. ఈవిధంగా, ఏ పవర్ ప్లాంటునుండి ఎంత ఉత్పత్తి చేయాలో పవర్ కంట్రోల్ సెంటరు నిర్ణయిస్తుంది. మన దేశంలో విద్యుత్ ఉత్పత్తికంటే రోజులో చాలా సమయాల్లో డిమాండు అధికంగా ఉన్నకారణంచేత, అనేక ఫ్యాక్టరీలు, కాలనీలు తమ స్వంత డీజల్ సెట్లను ఏర్పాటుచేసుకుని, పవర్ సప్లై లేనప్పుడు, డీజిల్ పై నడుపుతుంటారు. అయితే ఈ డీజిల్ జనరేటర్ల కారణంగా విడుదల అయ్యే కాలుష్య కారక పదార్థాలు ఎక్కువే. పైగా డీజిల్ తో నడిచే జనరేటర్ తో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు, గ్రిడ్ పవర్ కన్న దాదాపు 3, 4 రెట్లు అధికం. ఇక జెట్రోఫా వంటి మొక్కలనుండి డీజిల్ ను పోలిన నూనెలు ఉత్పత్తిచేసి, డీజల్ కు బదులుగా వాడవచ్చును. దీనినే బయోడీజిల్ గా వ్యవహరిస్తారు. అయితే, ఎక్కువ భూములు ఈ జెట్రోఫాకు వాడితే, ఆహారోత్పత్తికి ఉపయోగ పడే భూముల విస్తీర్ణం తగ్గిపోతుంది. ప్రస్తుతానికి, పంటలకు పనికిరాని బీడుభూములలోనే ఈ జెట్రోఫా మొక్కలను పెంచటం శ్రేయస్కరం. అట్లానే, మొక్కజొన్న నుండి ఉత్పత్తి అయ్యే మిథనాల్ ను పెట్రోల్ కు బదులుగా ఉపయోగించవచ్చును గాని, పెద్ద స్థాయిలో మొక్కజొన్న పంటలను మిథనాల్ కోసం వాడితే, ఆహారోత్పత్తి తగ్గిపోతుంది. అందుచేత బయో డీజిల్, బయో పెట్రోల్ ప్రతిపాదనలు అంత శ్రేయస్కరం కాదు. దీర్ఘకాలిక అవసరాలకోసం మనం ఇతర వనరులను ఉపయోగించవలసి ఉన్నది.

మన దేశంలోని క్రిష్ణా గోదావరి, కావేరీ, మహానది బేసిన్ లలో తగిన మోతాదులో షేల్ గ్యాస్ నిక్షేపాలు కనుగొనబడ్డాయి. మిగతా ఖనిజ నూనె, గేస్ లతో పోలిస్తే, షేల్ గేస్ నిల్వలు విస్తారంగా ఉన్నాయి. భూగర్భంలోని సున్నపు రాతిలో బంధింపబడిన గ్యాస్‌ను షేల్ గేస్ అని సంభోదిస్తారు. అయితే వందల మీటర్ల లోతులో ఉన్న ఈ షేల్ గ్యాస్ ను వెలికితీయటం బహు కష్టమైనది, ఖరీదైనది. ఇందుకోసం, భూగర్భంలోకి మొదటగా నిలువునా, ఆ తరువాత సమాంతరంగా రంధ్రాలు చేసి, వాటిలోకి 'ఫ్రేకింగ్' అనే పద్ధతి ద్వారా హై ప్రెషర్ లో నీటిని లవణాలతో కలిపి లోనికి పంపుతారు. తద్వారా, సున్నపురాతి పొరలలో పగుళ్ళు స ృష్టించి, ఆ పగుళ్ళద్వారా లోన ఉన్న గేస్ ను వెలికి తీస్తారు. ప్రస్తుతం, అమెరికా, కెనడా దేశాలు మాత్రమే లాభదాయకమైన పద్ధతిలో షేల్ గ్యాస్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. మనదేశం అమెరికానుండి షేల్ గేస్ ను దిగుమతి చేసుకుంటోంది. అమెరికాకు చెందిన ఇ.ఐ.ఏ సంస్థ అంచనాల ప్రకారం, భారత్ లో 96 లక్షల కోట్ల ఘనపుటడుగుల మేరకు వెలికి తీయగలిగిన నిల్వలు ఉన్నాయి. ఈ గ్యాస్ భారత దేశంలోని గ్యాస్ పవర్ ప్లాంట్లకు 26 ఏళ్ళపాటు ఇంధాన్ని అందించగలదు. మిగతా ఇంధన వనరులైన పెట్రోలియుమ్, బొగ్గులతో పోలిస్తే, షేల్ గేస్ వల్ల పర్యావరణంపై ఎక్కువ ప్రతికూల ప్రభావం ఉంటుందని అనేక పరిశోధనలలో వెల్లడయ్యింది. వెలికి తీయబడే షేల్ గేస్ లో 86% మీథేన్ వాయువే. జల వనరుల కాలుష్యం కారణంగా, నీరు వాడకానికి పనికి రాకుండా పోతుంది. భూకాలుష్యం కారణంగా వ్యవసాయం సాధ్యంకాదు. వెరసి మిగతా అన్ని పెట్రోలియమ్, బొగ్గు ఇంధన వనరులకన్నా షేల్ గేస్ ఎక్కువ ప్రమాదకారి. ఆ కారణంచేత, షేల్ గ్యాసు విషయంలో మనం జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నది. అదేవిధంగా, మన దేశ తూర్పు తీరాన బంగాళాఖాతంలో అపారమైన మీథేన్ నిల్వలు ఉన్నట్లుగా కనుగొనబడింది. ఆ మీథేన్ ను గాని వినియోగిస్తే, మన దేశ శక్తిఅవసరాలను రానున్న 3, 4 వందల ఏళ్ళలో ఈ వనరు తీర్చగలదు. సముద్రంలో మరణించిన ప్లాంక్టన్ అనే నాచు, జంతువులు సముద్ర గర్భానికి చేరి, వాటిలోని జీవపదార్థం అచ్చటి అత్యంత అధిక ఒత్తిడికారణంగా మీథేన్ వాయువుగా మారుతుంది కాని, ఆ వత్తిడి మూలాన అది గడ్డకట్టి మేథేన్ ఐసుగా మారిపోతుంది. ఈ మేథేన్ ఐసు వనరులను వెలికితీసే టెక్నాలజీని మన శాస్త్రజ్ఞులు స్వంతంగా రూపొందించారు. ప్రపంచం మొత్తంలోనే అతికొద్ది దేశాలకే ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నది. కాని అంత పెద్ద మొత్తాలలో పర్యావరణానికి అత్యంత హానికారకమైన మీథేన్ వాయువును వెలికితీస్తే, సీసా నుండి భూతాన్ని బయటికి తీసినట్లే! అందుచేతనే, పర్యావరణంపై ఈ గ్యాసు వెలికితీత ప్రభావాన్ని మన శాస్త్రజ్ఞులు అన్ని కోణాలనుండీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఆ కారణంచేత, మేథేన్ ఐసు, షేల్ గ్యాసు విషయంలో మనం జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నది. అంతకు ముందు వ్యాసంలో వివరించినట్లుగా, బొగ్గునుగాని, పెట్రోలియమ్ ఉత్పత్తులను గాని బాయిలర్లలోనూ, ఇంజిన్లలోనూ కాల్చటం బదులుగా అత్యంత ఎక్కువ సామర్థ్యంతో మీథేన్ వాయువు నుండి డైరెక్టుగా విద్యుత్తును ఉత్పత్తిచేయగలిగిన ఫ్యూయల్ సెల్స్ రానున్న సమీప భవిష్యత్తులో విస్త ృతంగా వాడకంలోకి వస్తేనే, ఈ పెట్రోలియం ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చును. పెట్రోలియమ్ నుండేకాక, బొగ్గునుండి, గడ్డి నుండి, వ్యర్థ జలాలనుండి కూడా మనం మీథేన్ ను ఉత్పత్తి చేయవచ్చును కావున, ఆమేరకు పెట్రోలియమ్ ఇంధనాల వాడకం తగ్గుతుంది. ఈ ఫ్యూయల్ సెల్స్ సామర్థ్యం 90 శాతం వరకూ ఉండే కారణాన, వాటినుండి వ ృధాగా పోయే శక్తి చాలాతక్కువ. ఇక భూ ఉపరితల రవాణాకు పెట్రోల్, డీజల్ వాడకాన్ని తగ్గించాలంటే, మనం విద్యుత్ వాహనాలను వాడుకలోకి పెద్ద ఎత్తున తేవలసి ఉన్నది. అయితే, బ్యాటరీల సామర్థ్యం తక్కువగా ఉన్న కారణాన, ఒక సారి ఛార్జ్ చేస్తే, కారు 60, 70 కిలోమీటర్లకు మించి నడవలేదు. బ్యాటరీ కెపాసిటీ పెంచాలంటే ఖర్చు ఎక్కువ అవుతుంది. చిన్న సైజులో ఫ్యూయల్ సెల్స్ ను గాని అభివ ృద్ధి చేయగలిగితే, ఒక గ్యాస్ సిలిండరుతో వేయి కిలోమీటర్ల వరకూ కార్లను నడిపే వీలు కలుగుతుంది. ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అదే విధంగా హైడ్రోజన్ వాయువును చవుకగా తయారుచేసి, నిల్వచేయగలిగిన టెక్నాలజీలపై కూడా పరిశోధనలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో అన్నిరకాల వ్యర్థజీవ పదార్థాలనుండి, ఖనిజ వనరులనుండీ మీథేన్ ను తయారుచేసి, ఫ్యూయల్ సెల్స్ లో వాడి, పర్యావరణానికి ఏవిధమైన హాని జరగని పద్ధతిలో వినియోగించే టెక్నాలజీలు అందుబాటులోకి వస్తాయి. ఇక పెట్రోల్, డీజిల్ కు బదులుగా, హైడ్రోజన్ తో నడిచే వాహనాలు సర్వసాధారణమవుతాయి. భవిషత్తు పూర్తిగా అంధకార బంధురం కానక్కర లేదు. సరయిన పద్ధతిలో సాంకేతిక పరిజ్ఞానాన్నికొందరి లాభం కోసం కాకుండా, మొత్తం సమాజ శ్రేయస్సుకు వినియోగిస్తే, భవిష్యత్తు సురక్షితం, సుఖప్రదం అవుతుంది.

(5వ భాగం వచ్చేఆదివారం)

- వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు. సెల్ : 09848933545

'ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని తరిమికొడదాం'

కేఎస్ రెడ్డి

క్యాన్సర్ వ్యాధి నివారణ నిమిత్తం 2000 సంవత్సరాంలో పారిస్‌లో మొదటి శిఖరాగ్ర సమావేశం నిర్వహింపబడింది. 2020 నాటికి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు సంఖ్య 20 మిలియన్లకు చేరగలదని అంచనా ప్రతీ సంవత్సరం క్యాన్సర్ వ్యాధితో సుమారు 8 మిలియన్ల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 12 శాతం మంది క్యాన్సర్ వ్యాధి వల్ల మరణిస్తున్నారు. 2005 సం॥లో 7.6 మిలియన్ల మంది ఈ వ్యాధివల్ల మరణించారని అంచనా. రాబోయే పది సంవత్సరాలలో 84 మిలియన్ల మంది ఈ వ్యాధి వల్ల మరణించే అవకాశం వుందని ప్రపంచ ఆరోగ్యసంస్థవెల్లడించింది. 2006 నుంచి 2015 వరకు ప్రతీ సంవత్సరం క్యాన్సర్ వల్ల సంభవించే మరణాలను రెండు శాతం చొప్పున నిరోధించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ప్రపంచంలో ఈ వ్యాధి వల్ల మరణించే వారిలో



70 శాతం రోగులు అతి తక్కువ లేదా మధ్యరకమైన జాతీయాదాయం కల్గిన దేశాలకు చెందిన వారేనని డబ్ల్యూ.హెచ్.ఓ అంచనా. ఆస్ట్రేలియాలో 'క్యాన్సర్ కౌన్సిల్ ఫండ్'కు యధాశక్తి విరాళాలను సమర్పించి, క్యాన్సర్ గూర్చిన పరిశోధలకు తోడ్పడుతంది. వ్యాధిగ్రస్తులకు ధైర్యాన్ని కల్గించడానికి ప్రయత్నిస్తారు. హిబ్రూ యూనివర్సిటీ ఆఫ్ జెరూసాలెం శాస్త్రవేత్తలు క్యాన్సర్ పెరుగుదల వ్యాప్తిని నిరోధించే ప్రోటీన్, మాలిగ్నెంట్ క్యాన్సర్ కణాలను శరీరంలో ఒక భాగం నుంచి మరోభాగానికి వ్యాప్తిచెంకుండా నిరోధిస్తుంది. మన దేశంలో ప్రతీయేటా 8 లక్షల మంది క్యాన్సర్ రోగులు కొత్తగా నమోదు అవుతున్నారు. వాతావరణ కాలుష్యం, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం, క్యాన్సర్ కారకాలుగా నిలుస్తున్నాయి. గొంతు క్యాన్సర్, రక్త క్యాన్సర్, మూత్రపిండాల క్యాన్సర్, చర్మ క్యాన్సర్‌లు, మహిళలకు గర్భాశయ క్యాన్సర్, బ్రెస్టు క్యాన్సర్‌లు సంక్రమిస్తున్నాయి. నిల్వ ఉన్న ఆహారం, చెడిపోయిన మాంసాహారం తీసుకోవడం వల్ల కూడా క్యాన్సర్ సంభవిస్తుంది. రోజురోజుకీ ప్రతీ గ్రామంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూ వుంటుంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు తమ వ్యాది తగ్గడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కీమోథెరపీ, రేడియేషన్ చికిత్స అందుబాటులో వుంది. క్యాన్సర్‌ను నివారించే డ్రగ్స్ రసాయనాల ధరలు మామూలు ప్రజలకు అందుబాటులో లేవు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌ను పూర్తిగా తగ్గించే మందులు కనుగొనబడలేదు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే మందులతో నయం అవుతుంది. వ్యాధి ముదిరితే మందులు వాడినా మృత్యువు నుండి తప్పించుకోలేకపోతున్నారు. హైదరాబాద్, బెంగుళూర్, ముంబాయి చెన్నై ఢిల్లీ నగరాలలోని కార్పొరేట్ ఆస్పత్రులలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతూనే వుంటుంది. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో క్యాన్సర్ నివారణ మందులు లభ్యంకావడం లేదు. క్యాన్సర్ వ్యాధిని తగ్గించే 'అంకాలజీ' వైద్యులు తక్కువగా వున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో అంకాలజీ వైద్యులు లేకపోవడం వల్ల ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులలో వీరికి డిమాండ్ అధికంగా వుంది. క్యాన్సర్ వ్యాధి సోకిన రోగులు మానసికంగా కృంగిపోతున్నారు. ఒక వైపు మందులు వాడినా మృత్యువుకి దగ్గర అవుతున్నామనే భావన వారి మనస్సులో గూడుకట్టుకొని వుంటుంది. క్యాన్సర్ వ్యాధిని మన దేశం నుంచి తరిమికొడదాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా క్యాన్సర్ రోగులకు అధునాతన వైద్యం అందించేందుకు కృషిచేయాలి. ఆరోగ్యశ్రీ పథకంలో క్యాన్సర్ వ్యాధిని చేర్చాలి. ప్రజలు కూడా మంచి ఆహారపు అలవాట్లను కలిగివుండాలి. ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా వుండాలి.



తొలి, మలి తరం కమ్యూనిస్టు నేతల కుటుంబ సభ్యులు ముఖ్యంగా వారి భాగస్వామ్యులు సిద్ధాంత పరిజ్ఞానం లేకపోయినా నిబద్ధ కమ్యూనిస్టు కార్యకర్తలుగానే జీవించారు. అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ భర్తలకు అన్ని విధాలా చేదోడువాదోడుగా నిలిచారు. మేం సైతం అంటూ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించారు. అటువంటి వారిలో రావులపల్లి చెంచయ్య సతీమణి రమణమ్మ ఒకరు. నిత్యం ఉద్యమ కార్యకర్తలకు, నేతలకు ఏ సమయంలో ఎందరు వచ్చినా తనకున్నదానిలోనే ఆప్యాయంగా వండి వడ్డించడంలో ఆమె ఎంతో సంతృప్తి చెందేవారు. ఒక సాధారణ గృహిణి సైతం సమాజాభివృద్ధికి ఏ విధంగా ఉపయోగపడవచ్చో నిరూపించిన ఆదర్శమూర్తి ఆమె. ఆనాటి ఉద్యమ వాతావరణం, నేతల నిరాడంబరత, వారి మధ్య ఆమె మెలిగిన తీరు, కమ్యూనిస్టు పార్టీలో ఆమె కృషి తదితర అంశాలు ఈ ఆదివారం 'బతుకు'లో ఆమె మాటల్లోనే...

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
25 ఫిబ్రవరి 2018



నా పుస్తెలతాడు సైతం అమ్మేశారు!

నిబద్ధ ఉద్యమ కార్యకర్త రావులపల్లి రమణమ్మ

మాది సాధారణ రైతు కుటుంబం. గుంటూరు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ళ మా స్వంత గ్రామం. తల్లిదండ్రులు వీరవల్లి ముసలయ్య, పిచ్చమ్మ. వారికి మొత్తం 8 మంది సంతానం. ఇద్దరు అమ్మాయిలు. నలుగురు అబ్బాయిలు. అమ్మాయిల్లో నేను చిన్నదానిని. స్వగ్రామంలోనే 5వ తరగతి వరకు చదివాను. చదువు అంటే పెద్ద ఇష్టం లేదు. దీంతో అదే స్కూలులో 7వ తరగతి వరకూ ఉన్నా బడి మానేశాను. అయితే నాకు 14వ ఏటనే 1948లో ముడివెముల గ్రామానికి చెందిన రావులపల్లి చెంచయ్యతో పెళ్లి చేశారు. ఆయనది కమ్యూనిస్టు కుటుంబం.. ఆయన లెక్కల టీచర్‌గా పనిచేసేవారు. మా పెళ్లయిన కొద్దికాలానికే కమ్యూనిస్టులపై ప్రభుత్వం నిషేధాజ్ఞలు ప్రారంభమయ్యాయి. దీంతో అండర్‌గ్రౌండ్‌లో ఉండే కమ్యూనిస్టు నాయకులకు నా భర్త కొరియర్‌గా వ్యవహరించేవారు. మాలకొండ అడవుల్లో ఎక్కువగా నాయకులు తలదాచుకునేవారు. వారికి సరకులు,



కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు డి.రాజాతో..

ఇతరత్రా అవసరమైన వస్తువులు కొనుగోలు చేసి అందజేసేవారు. ఇందుకోసం పెళ్లప్పుడు నాకిచ్చిన బంగారు ఆభరణాలన్నీ అమ్మేయాల్సి వచ్చింది. చివరకు ఓసారి పుస్తెల తాడు కూడా అమ్మేశారు. మాకు అప్పట్లో రెండు పాడి గేదెలుండేవి. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇంటి ఖర్చులకు ఉపయోగించేదానిని.

బాలింతగా నటించి 'గుజ్జుల' బైటపడ్డారు

నాకు పెళ్లయిన కొత్తల్లో మర్చిపోలేని సంఘటన ఒకటి జరిగింది. అది నిర్బంధం కాలం. గ్రామాల్లో పోలీసుల దాడులు పెరిగాయి. కమ్యూనిస్టు నాయకులు ఎక్కడ కనపడ్డా అరెస్ట్ చేసి తీవ్రంగా హింసించేవారు. కొన్ని సందర్భాల్లో ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపేవారు. మా ఇంట్లో కొంతకాలం తలదాచుకొని బయటకు వెళ్లిన పార్టీ నాయకుడు కాకుమాను వెంకటేశ్వర్లును కాల్చిచంపారు. పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్న ఆ సమయంలోనే కమ్యూనిస్టుపార్టీలో పెద్ద నాయకుల్లో ఒకరైన గుజ్జుల యలమందారెడ్డి మా ఇంటికి వచ్చారు. ఈ విషయాన్ని పసిగట్టిన పోలీసులు కొద్దిసేపటికే గ్రామాన్ని చుట్టుముట్టారు. ఇళ్లపై దాడులు ప్రారంభించారు. ఈ విషయం మా ఇంట్లో అందరికీ తెల్సింది. అయితే గుజ్జుల బయటకెళ్లి తప్పించుకునే అవకాశాల్లేవు. గడప దాటితే పోలీసులకు దొరికినట్లే. అప్పటికే మా ఆయనను కమ్యూనిస్టు పార్టీ కొరియర్‌గా అనుమానిస్తున్న పోలీసులు మా ఇంటికి కూడా వచ్చారు. అప్పుడు తొలికాన్పయి బాలింతగా ఉన్న నేను పక్కింటికి వెళ్లగా, ఇంట్లోనే ఉన్న గుజ్జుల యలమందారెడ్డి చీరకప్పుకొని నా బిడ్డ వద్ద బాలింతగా నటించి తప్పించుకున్నారు. దానికి కృతజ్ఞతగా ఆయన నా కూతురుకి 'భారతి' అని నామకరణం చేశారు.

200 ఓట్లతో ఓడిపోవడం బాధేసింది

1953 ఎన్నికల సందర్భంగా పార్టీ ఆదేశాల మేరకు టీచర్ పోస్టుకు చెంచయ్య రాజీనామా చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుండి పోటీ చేయాలని పార్టీ టికెట్ ఇచ్చింది. కేవలం 200 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోవడం నాకు కొంచెం బాధ అనిపించింది. అయితే నైతిక విజయం మాదే. ఎందుకంటే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎస్.వెంకటయ్య అన్నివిధాలా బలవంతుడు. గెలుపు కోసం ఆయన ఎంత ఖర్చు పెట్టినా, ప్రజాభిమానం మా వైపు ఉండడంతో చెంచయ్య గట్టి పోటీ ఇచ్చారు. ఇది నాకు ఎంతో ఆనందం కల్గించింది. ఆ ఎన్నికల్లో అయిన ఖర్చు కేవలం రూ.8వేల రూపాయలు మాత్రమే.

నేను, మా పిల్లలు ఏనాడూ మంచాలపై పడుకోలేదు

శాసనసభ ఎన్నికల తర్వాత పూర్తిగా కమ్యూనిస్టు ఉద్యమాలపై చెంచయ్య దృష్టి సారించడంతో ఇంటికి జనం రాకపోకలు మరింత పెరిగాయి. నాయకులు కూడా ఆ ప్రాంతంలో ఏ ఉద్యమాల్లో పాల్గొన్నా రాత్రికి మా ఇంటికే వచ్చేవారు. ప్రతి రోజూ కనీసం నల్గురైనా మా ఇంట విడిది చేసేవారు. ఏనాడూ నేను గాని, నా పిల్లలు కాని మంచాల మీద పడుకున్నట్లు గుర్తు లేదు. ఇంట్లో ఉన్న నాలుగు మంచాలు అతిథులకు వేసి, మేం అంతా కింద పడుకునేవాళ్లం. వారికి భోజనాలు, టీలు, టిఫిన్లు నేనే చేసేదానిని. అయినా అలసట ఉండేది కాదు. పైగా ఇంకా బాగా ఎక్కువ రకాల కూరలు చేసి పెట్టలేకపోయానని బాధపడే దానిని.

బట్టలుతికితే సీఆర్ బాధపడ్డారు

కమ్యూనిస్టుపార్టీలో ఆనాడు పెద్దనాయకులుగా ఉన్న వారంతా దాదాపు నా చేతి వంట రుచి చూసినవాళ్లే. చంద్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, నీలం రాజశేఖర్ రెడ్డి, గుజ్జుల యలమందారెడ్డి, సరళాదేవి తదితర అనేకమంది నేతలు తరచూ మా ఇంటికి వచ్చేవారు. భూపోరాటంలో పాల్గొనడం కోసం ఒకసారి చంద్ర రాజేశ్వరరావు గారు మూడు రోజులు మా ఇంటి వద్దే ఉన్నారు. ఒక్క జత బట్టలతోనే వచ్చారు. దీంతో సీఆర్ అన్నం తిని ఇంటిముందు ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో ఆయన బట్టలు శుభ్రంగా ఉతికాను. అది గమనించిన సీఆర్ మాకు అన్నం వండి పెట్టడమే ఎక్కువ. ఎందుకు ఆమెతో బట్టలు ఉతికిస్తున్నావు? అని బాధపడుతూ చెంచయ్యపై కోప్పడ్డారు. ఆ తర్వాత ఎప్పుడూ నాకు ఆయన ఆ అవకాశం ఇవ్వలేదు. ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా గమనించడమేగాక, తన వల్ల ఏ ఒక్కరూ ఇబ్బందిపడకూడదని భావించే మహానేత చంద్ర రాజేశ్వరరావుగారు.



పిల్లలందరికీ పార్టీ వివాహాలే

నాకు మొత్తం 8 మంది సంతానం. నలుగురు అమ్మాయిలు. నలుగురు అబ్బాయిలు. వారి పేర్లు వరుసగా భారతి, బాబురావు, లక్ష్మీరాజ్యం, రవీంద్రనాథ్, కృష్ణకుమారి, కృష్ణారావు, అరుణ, రమేష్ చంద్ర. వారందరికీ పార్టీ పెళ్లిళ్లే చేశాం. వారంతా వివిధ రూపాల్లో పార్టీకే సేవలందిస్తున్నారు. తొలికాన్పుగా పుట్టిన భారతి తన 8వ ఏటనే ధనుర్వాతంతో చనిపోయింది. బాబురావు విశాలాంధ్రలో రిపోర్టర్‌గా, బుక్‌హౌస్ మేనేజర్‌గా చాలాకాలం పనిచేశారు. లక్ష్మీరాజ్యం మహిళా సమాఖ్య ఉద్యమాల్లో ఇప్పటికీ చురుగ్గా పనిచేస్తుంది. ఆమె భర్త గాలి సుబ్బరాయుడు ఎస్టీయూ నేతగా పనిచేస్తున్నారు. రవీంద్రనాథ్ ప్రస్తుతం ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఉన్నారు. కృష్ణకుమారి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ బలోపేతానికి సహకరిస్తున్నారు. అరుణ.. వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తూ మహిళా సమాఖ్య ఉద్యమానికి ఊతమిస్తున్నారు. చివరివాడైన రమేష్ చంద్ర ప్రధానమంత్రి కార్యాలయంలో (పీఎంఓ) పనిచేస్తున్నారు. ఎవరు ఏ స్థాయిలో పనిచేస్తున్నా నా పిల్లలంతా కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరిస్తుండడం నాకు చెప్పలేనంత ఆనందం కల్గిస్తుంది.



పదవులకు ఆశపడలేదు

ఉన్నదాంతో సర్దుకోవడం, సంతృప్తి చెందడం తప్ప నాకు ఏదో కావాలన్న ఆశ ఉండేది కాదు. అలాగే నా భర్తకి కూడా. పార్టీ కోసం పనిచేయాలన్న ఆరాటం తప్ప పదవుల పట్ల ఏమాత్రం ఆసక్తి చూపేవారు కాదు. పార్టీ ఆదేశాల మేరకు 1953 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ ఎన్నికల్లో కేవలం 200 ఓట్లతో ఓడిపోయిన చెంచయ్య, తర్వాత ఎన్నికల్లో మళ్లీ పార్టీ టిక్కెట్ ఇస్తానన్నా వద్దని, పూలసుబ్బయ్యను బలపర్చారు. నా కంటే ఆయన అభ్యర్థి అయితే బావుంటుందని సూచించారు. శ్రేయోభిలాషులు చాలా మంది ఈసారి మీరైతే గెలుపు ఖాయమని ఎంత నచ్చజెప్పినా వినలేదు. మనమంతా సుబ్బయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని చెప్పి ఆ వాదనకు తెరదించారు. అలాగే టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. కుటుంబం పెద్దది. పోషణ కష్టమవుతుండడంతో మరో ఉద్యోగానికి ప్రయత్నం చేశారు. ఇఎల్‌డబ్ల్యూ పోస్టు వచ్చింది. అయితే అది కూడా కొంతకాలమే చేశారు. నీ లాంటి నాయకుడు ఉద్యోగం చేస్తే పార్టీ ఎలా నడుస్తుందని కమ్యూనిస్టుపార్టీ అగ్ర నాయకులు ప్రశ్నించడంతో దానికీ రాజీనామా చేశారు. తర్వాత పార్టీ కోసమే తన జీవితాంతం పనిచేశారు. మా కుటుంబానికున్న ప్రజాభిమానాన్ని చూసి 2004 ఎన్నికల్లో వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్న మా అమ్మాయి అరుణకు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తానని కబురు చేసింది. కాని మేం తిరస్కరించాం. అలాగే తొలిసారి 53 ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేసే సందర్భంలో టీచర్ పోస్టుకు రాజీనామా చేసినప్పుడు, అనారోగ్య కారణాల రీత్యా అని రాస్తే తర్వాత పెన్షన్ వస్తుందని చాలా మంది శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. కుటుంబం పెద్దది, ఆర్థికంగా ఇబ్బందిపడతావు, తొందరపడొద్దంటూ ఒప్పించాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాని చెంచయ్యగారు మాత్రం ససేమిరా దానికి ఒప్పుకోలేదు. ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే రాజీనామా చేస్తున్నట్లు దానిలో స్పష్టంగా పేర్కొన్నారు.

ఎన్నో చరిత్రాత్మక ఉద్యమాలు

మా ప్రాంతంలో అనేక చరిత్రాత్మక ఉద్యమాలు జరిగాయి. దీంతో ఉదయం నుండి సాయంత్రం వరకు టీలు, టిఫిన్లు, భోజనాలు, వచ్చే పోయేవారికి మర్యాదలు, పలకరింపులతో నాకు ఒక్క నిముషం కూడా ఖాళీ ఉండేది కాదు. అయినా ప్రజా ఉద్యమాల సందడితో ఎంత పనిచేసినా అలసట అనిపించేది కాదు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ కార్మికుల యూనియన్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శిగా చెంచయ్య పనిచేశారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత చాలామందికి ప్రత్యామ్నాయం చూపకుండా అన్యాయంగా పనిలోనుండి తీసేస్తే దాదాపు 40 రోజులపాటు ఆమరణ దీక్ష చేసి విజయం సాధించారు. అయితే దీక్ష ముగియగానే ఒకేసారి పాయసం కడుపునిండా తినడంతో తట్టుకోలేక భాస్కర్ పిళ్ళె, రామిరెడ్డి అనే ఇద్దరు కార్మిక నాయకులు చనిపోవడంతో ఆనందం ఎంతో సేపు నిలవలేదు. అయ్యగానిపాలెం భూపోరాటం చాలా పెద్ద ఉద్యమం. దాదాపు 1300 ఎకరాల ఈనాం భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ సాగిందా ఆ పోరాటం. అప్పుడు చెంచయ్య బీకేఎంయూ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ భూపోరాటంలో పాల్గొన్న నాయకులందరిపై అనేక కేసులు పెట్టారు. ఉద్యమాన్ని నీరుగార్చడం కోసం చెంచయ్యను మర్డర్ కేసులో కూడా ఇరికించారు.అలాగే పలకల పరిశ్రమలో ఆనాడు బానిస విధానం ఉండేది. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం నడిచింది. నాగార్జున సాగర్ కుడి కాలువ పొడిగింపు, వెలుగొండ ప్రాజెక్టు సాధన కోసం సాగిన పోరాటాలూ సాధారణమైనవేమీ కాదు. మర్రి సుబ్బరాయుడు, పూల సుబ్బయ్య, బి.వి.వెంకటేశ్వర్లు, ప్రస్తుతం పార్టీ నాయకులుగా పనిచేస్తున్న అందె నాసరయ్య, కేవీపీ ప్రసాద్, చెన్నయ్య, కృష్ణగౌడ్, డి.శ్రీను తదితరులనేకమంది నాయకులు ఆయన తీర్చిదిద్దినవారే.

పూలసుబ్బయ్య పేరుతో ప్రాజెక్టు

మార్కాపురంలో చేసిన భూపోరాట ఫలితంగా దాదాపు 2వేల మంది పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. తర్వాత వారందరికీ ఇళ్లు కూడా కట్టారు. అదే సమయంలో పూలసుబ్బయ్య మరణించడంతో ఆ కాలనీకి ఆయన పేరును ప్రతిపాదించారు. ఆ కాలనీని కమ్యూనిస్టుపార్టీ అగ్రనాయకులు చంద్ర రాజేశ్వరరావు ప్రారంభించారు. వెలుగొండ ప్రాజెక్టుకి కూడా పూల సుబ్బయ్య పేరు పెట్టించాలని చెంచయ్య గట్టి ప్రయత్నం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతోపాటు, నాటి ముఖ్యమంత్రిగా వున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా దానికి సానుకూలంగా స్పందించి అంగీకరించారు.



కుమారుడు రవీంద్రనాథ్‌తో...

ఆ సంఘటన మర్చిపోలేను

రాష్ట్రంలో 1992 తర్వాత సారా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో అందరితోపాటు పోలీసులు నన్ను కూడా అరెస్ట్ చేసి స్టేషన్‌కి తీసుకెళ్ళారు. నేను అప్పుడు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మేము అంతా స్టేషన్‌లో కూర్చొని వుండగా ఎస్‌ఐ అప్పుడే బయటనుండి వచ్చారు. మమ్మల్ని స్టేషన్‌లో చూసి షాకయ్యారు. వెంటనే కానిస్టేబుల్స్‌పై సీరియస్ అవుతూ రమణమ్మగారిని ఎందుకు తీసుకొచ్చారు ? ఆమె ఎవరనుకున్నావు? ఈవిషయం జనానికి తెలిస్తే స్టేషన్ తగులబెడతారు? వారు చేసే ఉద్యమాలు వారికోసం కాదు, ప్రజల కోసం అనే విషయం తెల్సుకోండి. తక్షణమే వారిని ఇంటివద్ద దించి రండి? అంటూ వారిని ఆదేశించారు. వాహనం ఇచ్చి మరీ ఇంటి దగ్గర దించి వెళ్లారు. ఎస్‌ఐ అలా మాట్లాడడం నన్ను ఆశ్చర్యపర్చింది. అది నా గొప్ప కాదని తెలుసు. అధికారుల్లో సైతం కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ఎంత గౌరవభావం ఉందో ప్రత్యక్షంగా చూసి ఆనందపడ్డాను.

ప్రజలతో మమేకం కావాలి

నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ వారితో మమేకమైన నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు. ఎవరికి వారే ఆ నాయకుడ్ని తమ కుటుంబసభ్యుడిగా భావిస్తారు. అటువంటివారి కోసం ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడతారు. నాకు కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల పెద్ద అవగాహన లేదుగాని, ఒక ప్రజా నాయకుడికి ఖచ్చితంగా ఉండాల్సిన ప్రాథమిక లక్షణం ఇదే. నాకు జీవితం నేర్పిన ప్రత్యక్ష అనుభవం కూడా ఇదే. పాతతరం కమ్యూనిస్టుపార్టీ నాయకులంతా దాదాపు అలాగే ఉండేవారు. అందువల్లే స్వాతంత్ర్యం తర్వాత ఇప్పటివరకు ఏనాడూ అధికారంలో లేకపోయినా ప్రజలు కమ్యూనిస్టుపార్టీనే అంటిపెట్టుకొని ఉండగల్గుతున్నారు.

- చావా రవి, విజయవాడ.







డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

పగడాల పేరులా మెరుస్తున్న చింతబొట్ట నొకదాన్ని అప్రయత్నంగా నోటిలో వేసుకున్నా పుల్లపుల్లగా తియ్య తియ్యగా నోటికి తగిలేసరికి - చిన్నతనపు తెలంగాణా రోజులు జ్ఞప్తికొచ్చాయి. చింతగింజల పలుకులతో సంగడి కాచుకుని - చింతబొట్టు నంజుకుని - ఆకలి తీర్చుకొనేవాళ్ళం - ఇంటిల్లి పాదిన్ని, చిరిగిన లుంగీ, వీపులేని ఛోలీ - ఈవేళ అమ్మ వేసుకుంటే రేపు నేను వాటిని వేసుకునేదాన్ని, అవి యెవరు వేసుకుంటే వాళ్ళం యింట్లో ఖైదు కూచోవలసిందే. వీధిలోకి వెళితే మానభంగం అయేది. ఆముదాలు కాచి - దీపపు సెమ్మా పెట్టుకునే వాళ్ళం అమావాస్య రాత్రిళ్ళకి. జన్మానికో శివరాత్రిలాగు ఎప్పడేనా ఏ ఇరుగు పొరుగువాళ్ళో కూరగాయలిస్తే ఆముదపు నూనెతోనే తిరగమోత - ఆముదపునూనే తలకి. చెన్నపట్నం చేరుకుని పదేళ్ళవుతూంది. అదో ప్రపంచం! ఇదో ప్రపంచం! కొత్త జన్మ, కొత్త తల్లిదండ్రులు, కొత్త తోబుట్టువులు, కొత్త హృదయంలో విప్లవ జ్వాల, మనసులో నూతనసృష్టి రభస.

(నిన్నటి సంచిక తరువాయి)

పేగుల్లో కొత్త ప్రపంచపు ప్రసవవేదన, ఉడుకురక్తంలో జీవశక్తిలీల! ఈ కొత్త ప్రపంచంలో జన్మించడమే - ఒక అగ్ని పరీక్ష. ఈ విప్లవయుగంలో మనగలగడమే ఒక విప్లవసాధకం... ఈ కొత్తసృష్టి నా ప్రతాపంకాదు. నా కృషి ఫలితంకాదు. నా చెమట నుండి నిగ్గుతేలిందికాదు. నా కాయకష్టం చేత తీర్చి దిద్దినదికాదు. విప్లవోద్యమం యొక్క అరుణరేఖలని అమ్మ చూపించింది.... ఇంగ్లండు బొగ్గుగనుల పాతాళలోకంలో - క్లయిడు కార్ఖానాల్లో సలసలమరిగే ఇనుపమూసల దేదీప్య మానకాంతుల్లో - ప్యారిస్ రినాల్డు మోటారు కార్మికుల కళ్ళ క్రాంతుల్లో - నాజీ బెర్లిను రహస్యపు సొరంగాల్లో విధ్వంసకుల చేతుల్లో మెరిసే తుపాకుల తళుకుల్లో - జినోవా వుప్పుగాలికి పాతరవూరి ముడతలు పడిన బెస్తలముఖాల్లో - అంతర్జాతీయ భక్తుల రక్తంతో ప్రవించిన బార్సిలోనా, మాడ్రీడ్ సందుగొందుల్లో - లాంకషైర్‌మిల్లు స్త్రీల ఆకలి ఆవేదనల్లో - అంతర్లీనమైన విప్లవ తపోదీక్షని అమ్మ నాకు చూపించింది!

"...విప్లవ వేదన జైళ్ళలో వినిపించదు....నూతన సృష్టిరభస ఆశ్రమాల్లో సంభవించదు...కొత్త ప్రపంచం వర్కింగుకమిటీల చర్చల్లో జన్మించదు!" అంది అమ్మ రాయవేలూరునుంచి రాగానే...

కిందనుంచి! "సుభా! సుభా!" అని మాలతి పిలుపు వినిపించింది. దబ్బున దాబాదిగి కిందకెళ్ళా. "కాళ్ళూ చేతులూ తోడేస్తున్నాయే; నడుము లాగేస్తుందే! పొత్తికడుపు చీల్చుకుపోతూందే! ప్రాణం పోతూందే సుభా!" అని మాలతి మూలుగుతూంది. "ప్లేన్ల చప్పుడికి గాభరాపడుతున్నావు. నేనుండగా నీకేం భయంలేదె మాలతీ! చూడు, మాత్రలు మరో నాలుగు మింగి - యీ వేడి వేడి కోకో ఓ గుక్కెడు తాగమ్మ" అని మళ్ళీ మందిచ్చాను. మాత్రలు మింగిందో లేదో - మాలతికి నిద్రపట్టిపోయింది. మళ్ళీ తెలివొచ్చేసరికి మాలతికి నొప్పులు ఎక్కడ ప్రారంభం అవుతాయో అని నాకు భయం పట్టుకుని పీకేస్తూంది. ఏం చేయను? పెద్ద దొరసాని బంగాళాకి ఖబురుచేద్దాం అని టెలిఫోను తీసేసరికి - టెలిఫోను పలకలేదు.

చప్పున నా చేతిసంచీ తీసుకుని - చెప్పులు తొడుక్కుని - వీధిలోకెళ్ళి వీధి గుమ్మం తాళం వేసుకుని బయలుదేరా - ఎలాగైనా దగ్గిరున్న వైద్యుణ్ణెవర్నైనా తీసుకువద్దాం అని .... ఇంతట్లో మళ్ళీ - జామ్ జామ్ - జామ్ అని ఏరోప్లేన్ల శబ్దం! జామ్ - జామ్ అన్న ధ్వని మిన్ను ముట్టుతూంది. రోడ్డంతా జనంతో కిక్కిరిసిపోయింది. ఆడ-మగ-పిల్లా జల్లా-ముసలి ముతక- చంటి వెంటి కుంటి గుడ్డి గొప్ప బీద - విశాఖ పట్నంలో వున్న లక్ష ప్రజలు-కాలికి బుద్ధి చెబుతున్నారు. సొంత కార్లువున్న ధనికులు సొంతకార్లలోనూ, అద్దెకార్లు దొరికినవాళ్ళు అద్దెకార్లలోనూ-అధికార్లు గవర్నమెంటు జీపుల్లోనూ- సామాన్యులు జట్కాలు, పెట్టిబళ్ళూ, గూడుబళ్ళలోనూ-పాటకజనం పోతులు పూన్చిన పొణక బళ్ళలోనూ- మూటలతో నిండిన రిక్షాలోనూ.. నడిచినవాళ్ళూ నడుస్తున్నారు. సంసారాలు నెత్తిన బెట్టుకుని ఒకచేత పసిపాప - ఒక చంకకళ్ళు విడవని గుడ్డ



...గోలీలలో-నడుమువంగి కాళ్ళూ చేతులూ ఆడని ముసలి ముద్దలు...గాడిదెల మీద - బట్టలమూటలు - కర్రలమోపులు - చేటలు, చీపుళ్ళు, కుండలు - పేదల పెన్నిధుల - సన్న కారుల సంసారాలు - నికృష్టజీవుల నిధినిక్షేపాలు, అలగాజనాల ఆస్తి సౌభాగ్యాలు...!

కోలాహలం, రణగొణ ధ్వని, కేకలు, తిట్లు, ఏడ్పులు, హెచ్చరింపులు. శాపనార్థాలు, ప్రార్థనలు, రంకెలు, సకిలింపులు, మెరుపులు, ఉరుములు, బీభత్సం...అందరికీ ఒకటే ఆవేశం, అందరికీ ఒకటే పిరికితనం, అందరికి ఒకటే భయం, అందరికీ ఒకటే బెంగ. 'జపాను వాడి శాపం తగిలింది - ఈ పట్నానికి ... ఈ వూరు వదిలి పారిపోదాం! జపానువాడు వూరిమీద అగ్నిబాంబులు కురిపిస్తున్నాడు. ఈ వూరు నుంచి ప్రాణాలతో బైటపడదాం... జపానువాడు మన వూరిమీద చిచ్చుల పిడుగులు పడేస్తున్నాడు - పదండి పారిపోదాం!.. 'ఎక్కడికైనా సరే! ఈ నరకకూపంలో మాత్రం వద్దు! బతికుంటే - బలుసాకు కూర తిని బతకొచ్చు! చీకటి పడితే జపాను రాక్షసి మళ్ళీ వస్తాడు - మనల్నందరినీ కబళించేస్తాడు! అంధకారంలో వాడి అర్థాంగి మృత్యుదేవత అనంతశయ్యనుంచి నిప్పులు చెరుగుతుంది. రావణాసురుడి కాష్టంమీద ఎగురుతూ, వాళ్ళిద్దరూ అగ్గితలంబ్రాలు పోసుకుంటారు - భూమిమీద దిగి, మనవి మారణ హోమం చేస్తారు! అమావాస్య చీకటిలో జపాను పెనుభూతం మందు కాష్టంమీద ఎగురుతూ అగ్ని బరాటాలు వర్షిస్తుంది!'....ఒకటే కేక 'పదండి - పదండి' - ఒకటే గోదు-'సాగండి! ముందుకు నడవండి!' ....ఊరంతకి ఒక్కపట్టాన వెర్రెత్తింది. ముందూ వెనకా మూటల్ని పేర్చి సైకిళ్ళని నడిపించుకుని పోతున్నారు. తోపుడు బండిలో చంటిపిల్లల్ని గుడ్డల మూటల్ని - తట్టల దొంతర్లనీ, కిరసన్నూనె సీసాలని, మట్టి పొయ్యినీ ఇనుప కుంపటినీ, బీటలువేసిన గోదద్దాన్నీ. ఆడితంబొడితం అమర్చుకుని,అంగలార్చుకుంటూ యీ పడుచు అమ్మాయి బండిని తోసుకుంటూంది. ఈ ముక్కిడి మూకలో ఆమెను ఆదుకుని దారిచ్చే వారెవరు? ఆమె పెనిమిటెక్కడ? తల్లిదండ్రులెక్కడ? ఒంటరిగా ఎక్కడికి పోతూంది? వూరి పొలిమేర చేరేలోపునే యీ మూకలో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై ఆ చంటిపిల్ల చచ్చిపోతుందేమో? ఆమెపై జాలిగొనే వారెవరు? 'అబ్బా! అమ్మా!' అని యేడుస్తే వినే వాడెవడు? అసలు వినబడుతుందా? ఇది మనుష్యుల మూక కాదు - జీవచ్ఛవాలతో నిండిన శ్మశానం. మానవత్వం కోల్పోయిన వల్లకాటి జనం...

'జూం జూం జూం-ఒ-ఒ-!' 'జపానువాడు స్టీమర్లని ముంచేశాడు - శవాలు వూళ్ళోకి కొట్టుకొస్తున్నాయి!' 'జపాన్ వాడు హార్బరుని కూల్చేశాడు. సముద్రం పొంగిపోతూంది!'.... 'జపానువాడు పవరు హౌసుని పేల్చేశాడు - మనుష్యులు కాలి పోతున్నారు!' '...జపానువాడు నేనూ టాంకులని బాంబు చేశాడు. వూరంతా మండిపోతూంది!..' ఎంత నిజం? ఎంత అబద్ధం? అడిగేవాడెవడు-చెప్పేవాడెవడు? భయోత్పాతంతో ఒకరినొకరు తోసుకుంటున్నారు. వెనకవారు ముందువారిని - ముందువారు వారి పైవారిని-వెనకచేతులు ముందువీపులనీ - ముందు చేతులు వెనుకభుజాలనీ, ఒక అడుగు ముందుకు పోయినా పోవడమే - యీ పిశాచాల బారినుంచి - యీ పెనుభూతాల పీడనుంచి - యీ రాక్షసుల రక్తదాహం నుంచి - యీ నరకా సురుల నరవేటనుంచి!... మోటార్లు 'హాంక్ - హాంక్ - బుంయ్ - బుంయ్' అని అరుస్తున్నాయి. ఆ చప్పుడు వినేవాడెవడు? విన్నా లెక్క చేసేవాడువడు? రైలింజను గర్జించినా తప్పుకునే వాడు లేదు. అడుగుతీసి అడుగు పెట్టడానికి అవకాశం లేదు - చీమలబారులో చీమనడకే! ముందుచీమ నడుస్తేనే వెనుకచీమ నడిచేది! ఆ తోపుడులో-ఆ కోలాహలంలో-ఆ ముష్టి యుద్ధంలో -మూటలు దొర్లుతున్నాయి. ఇరుసులు విరుగుతున్నాయి. చక్రాలు చితికిపోతున్నాయి. గుర్రాలు యెద్దులు కూలబడు తున్నాయి. మనుష్యుల కాళ్ళు తొట్రుపడుతున్నాయి. ఒకరి కాళ్ళలో ఒకరు పడుతున్నారు. పందులు బళ్ళక్రిందపడి చస్తు న్నాయి. పోతులు బెదరి మోటార్లను ఢీకొంటున్నాయి. లారీలు మనుష్యులు-బళ్ళు -జీవాలు-కార్లు-నడవడంలేదు. ప్రవాహంలో తేలికొట్టుకుపోతున్నాయి. భయపిశాచం వాటిని ఈడ్చుకు పోతూంది. అదిగో, ఆ చీమలబారులో పెద్ద కండ చీమ! ప్రవాహంలో మధ్య గడ్డిమేటు! జనసమూహాన్ని చీలుస్తూ పెద్ద మిలిటరీ లారీ. లోపలవున్న ఆఫీసర్లు ఆదరా బాదరా కిక్కిరిసి కూచున్నారు. పిప్పళ్ళ బస్తాల్లాగు కూరుకుపోయున్నారు. తెల్ల ఆఫీసర్లు, నల్ల ఆఫీసర్లు. ఖాకీ తెలుపు, నీలిరంగు, కుళ్ళాయిలు. పాగాలు, టోపీలు, పంట్లాలు, లాగులు, పరికిణీలు, గెడ్డాలు, మీసాలు, జడలు, గిరిజాలు, బోడిగుళ్ళు, క్రాపింగులు, మెరు స్తున్న బొత్తాములు, తోలు పటకాలు, తూటాలు పట్టీలు, భుజ కీర్తులపై నక్షత్రాలు, జల్తారు కిరీటాలు, పురుషులు - స్త్రీలు... యుద్ధవీరులు, వీరనారీమణులు...అదిగో! మరొక మిలటరీ కారు. సామాన్య లారీ కాదు. రోల్సు రాయిస్! కారులో తెల్ల మిలటరీ పారా ఒక్కడే కూర్చున్నాడు. అతను ధరించిన టోపీ అంచుచుట్టూ ఎర్రటి జరీపట్టీ. కోటు కాలరుపై జల్తారు తీగె. భుజకీర్తులపై బంగారు లాంఛనాలు. మోటారు బంపరుపై ఎర్రరంగు మైపూత. మైపూత మీద మూడు నక్షత్రాలు! ఓహో - మూడునక్షత్రాల జనరల్‌గారు జపానువాడికి వెన్నుచూపిస్తున్నారు! వందిమాగధుల ముందు నడువగా-చోబుదార్లు రాస్తాను ఖాళీచేయగా - అంగరక్షకులు జయభేరీ మ్రోగించుతుండగా - మూడు నక్షత్రాల జనరల్‌గారు తోక ముడుచుకొని వెనక్కి వేంచేస్తున్నారు! అక్కడ మలయా- సింగపూరు-బర్మాలో జపాను వాడిని చూడగానే తెల్లవాళ్ళు పఠించిన మంత్రాన్నే-ఇక్కడ జపానువాడిని చూడకుండానే పఠిస్తున్నారే! ఏడు ప్రాణాలని చంపిన బంట్రోతుకి తన ప్రాణం తీపైనట్టు - మూడు నక్షత్రాల జనరల్ గారికి మాత్రం వారి ప్రాణం తీపికాదా?...

ఆ ప్రళయ ప్రవాహంలో-జనరల్‌గారి రోల్సురాయిస్సూ - వేలం పేట ఎడ్లబండి-బురుజుపేట గూడుబండి - కురుపాలెం మార్కెట్టు పెట్టిబండి-మిలిటరీ ట్రక్కు-పోలీసులారి-మునిసి పాలిటీ చెత్తబండి-విమానదళంవారి జీపు..

- ఇంకా వుంది.

నీరవ్ మోడీ మోసం రూ.17,600 కోట్లు !

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో వెలుగు చూసిన కుంభకోణం నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ (ఐ.టి.) శాఖ రూపొందించిన నివేదిక సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు ఈ బ్యాంకుకు జరిగిన మోసం విలువ రూ.11,400 కోట్లుగా భావిస్తుండగా, ఐ.టి.శాఖ మాత్రం ఇది రూ.17,600 కోట్లకు చేరవచ్చని అంచనా వేస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆభరణాల వ్యాపారి నీరవ్ మోడీకి, అతని మేనమామ మెహుల్ ఛోక్సీకి కలిపి గత ఏదాది మార్చి వరకు బ్యాంకులు ఇంత మొత్తాన్ని రుణాలు, హామీలుగా జారీచేశాయని ఐ.టి.వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో నమోదైన కేసులకు సంబంధించి ఇప్పటివరకు ముగ్గురిని సీబీఐ అరెస్టు చేసింది. నీరవ్ మోడీ గ్రూపునకు చెందిన 29 ఆస్తులు, 105 బ్యాంకు ఖాతాలను ఇప్పటివరకు స్తంభింపజేసినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. రూ.11,300 కోట్ల కుంభకోణం మొత్తం 2017-18లోనే జరిగిందని సీబీఐ తన రెండు ఎఫ్ఐఆర్‌లలో పేర్కొనడం విశేషం. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న నీరవ్ మోడీ ఆచూకీ తెలుసుకునేందుకు సీబీఐ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్‌నుంచి లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. జమ్మూ సహా 21 ప్రదేశాల్లో జరిగిన తాజా సోదాల్లో మరో రూ.25 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలను సీజ్ చేశామని, దీంతో జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ రూ.5,674 కోట్లకు చేరిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వర్గాలు ఢిల్లీలో తెలియజేశాయి. నీరవ్, మెహుల్‌కు సంబంధించిన 200 నకిలీ కంపెనీలు, బినామీ ఆస్తులపై ఈడీ వరుసగా నాలుగో రోజు ఈనెల 18వ తేదీన తనిఖీలు నిర్వహించింది. ఈ కేసులో నీరవ్ మోడీకి చెందిన ఫైవ్‌స్టార్ డైమండ్ కంపెనీ ప్రసిడెంట్ (ఫైనాన్స్) విపుల్ అంబానీని సీబీఐ ఈనెల 20న అరెస్టు చేసింది. నీరవ్, ఛోక్సీలకు సంబంధించిన మరో రూ.100 కోట్ల ఆస్తులను ఈడీ ఈనెల 22న జప్తు చేసింది.

ఇరాన్‌తో 9 ఒప్పందాలు

ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహాని భారత్ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య కీలక అంశాలపై 9 ఒప్పందాలు కుదిరాయి. ఈనెల 15న రౌహాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమయ్యారు. అంతకు ముందు రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న రౌహానికి సాదర స్వాగతం లభించింది. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతో రౌహాని సమావేశమయ్యారు. విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ కూడా రౌహానితో చర్చలు జరిపారు.

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

రోటామాక్ కుంభకోణం రూ.3,695 కోట్లు.. అధినేత అరెస్టు

రోటామాక్ (పెన్నుల తయారీ సంస్థ) అధినేత విక్రం కొఠారీ ఏడు బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ. 3,695 కోట్లు రుణం తీసుకుని ఎగవేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. మొదట ఈ సంస్థ రూ.800 కోట్ల రుణాలు తీసుకుని ఎగవేసినట్లు భావించారు. ఎగుమతుల కోసమని ఈ రుణం తీసుకుని ముందుగా దారి మళ్లించినట్లు, తరువాత షెల్ కంపెనీల ద్వారా స్వంత ఖాతాల్లోకి మార్చిడి చేసుకున్నట్లు కూడా సీబీఐ దర్యాప్తులో తేలింది. ఈ మేరకు సీబీఐతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాయి. విక్రం కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌లను సీబీఐ అధికారులు ఈనెల 22న అరెస్టు చేశారు.

మావోయిస్టుల కాల్పుల్లో నలుగురి మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో ఈనెల 18న మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకర పోరు జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు సహా నలుగురు మృతిచెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మరోవైపు ఈ ఘటనలో 20 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు ప్రకటించారు. సంఘటన స్థలంలో ఒక మావోయిస్టు మృతదేహం మాత్రమే లభ్యమైంది.

భారత్‌లో కెనడా ప్రధాని పర్యటన

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కుటుంబ సభ్యులతో కలిసి వారం రోజుల పర్యటనకు ఈనెల 17న మన దేశం చేరుకున్నారు. ఈనెల 18న కుటుంబ సమేతంగా ఆయన ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించారు. 19న గుజరాత్‌లో పర్యటించి, సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. ఈనెల 21న పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లోని స్వర్ణదేవాలయాన్ని సందర్శించుకున్నారు. ఈనెల 23న జస్టిన్ ట్రూడో ప్రధాని నరేంద్రమోడీతో ఢిల్లీలో రెండుగంటల పాటు సమావేశమయ్యారు. వివిధ రంగాలకు సంబంధించి ఆరు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

కమల్ కొత్తపార్టీ ప్రారంభం


ప్రముఖ సినీనటుడు కమల్ హాసన్ తమిళనాడులోని మధురై వేదికగా ఈనెల 21న కొత్తపార్టీని ప్రారంభించారు. పార్టీ పేరును 'మక్కల్ నీది మయ్యమ్'గా ప్రకటించి, పతాకాన్నీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన అభిమానులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అగ్ని-2 పరీక్ష విజయవంతం



అణ్వస్త్ర సామర్థ్యమున్న మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-2ను భారత్ ఈనెల 20న విజయవంతంగా పరీక్షించింది. 2 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణిని ఒడిశా తీరానికి చేరువలోని అబ్దుల్ కలాం దీవిలోని సమీకృత పరీక్ష వేదిక (ఐటీఆర్) నుంచి ప్రయోగించారు. ఈ క్షిపణిని ఇప్పటికే సైన్యానికి అప్పగించారు.

పీఎఫ్ వడ్డీరేటు 8.55 శాతానికి కుదింపు



ఉద్యోగుల భవిష్యనిధి (ప్రావిడెంట్ ఫండ్)పై వడ్డీరేటును 2017-18 సంవత్సరానికి గాను 8.55 శాతానికి తగ్గిస్తూ ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. ఈపీఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాత్మక వ్యవస్థ అయిన కేంద్ర ధర్మకర్తల బోర్డు (సీబీటీ) ఈనెల 21న సమావేశమై ఈమేరకు నిర్ణయం తీసుకుంది. అనంతరం కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ గాంగ్వర్ విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని తెలియజేశారు.



హైదరాబాద్‌లో ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు

26వ ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు ఈనెల 19న హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భారతీయుల సాధికారతలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తోందని ప్రధాని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఏర్పాటైన ఈ సదస్సును తెలంగాణ ప్రభుత్వం, నాస్కామ్, విట్సా ఏర్పాటు చేశాయి. ఈనెల 20న సదస్సు నుద్దేశించి మానవరూప (హ్యూమనాయిడ్) రోబో సోఫియా ప్రసంగించింది. ప్రపంచంలో ప్రాంతాలన్నీ సమానమేనని, ఒక దేశం ఎక్కువ, మరో దేశం తక్కువ కాదని పేర్కొంది.

హెచ్1బీ వీసాల జారీ కఠినతరం



హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియను మరింత కఠినతరం చేస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం తక్షణం అమలులోకి రానుంది. మూడోపార్టీ సైట్‌లో తమ ఉద్యోగులతో పనిచేయించడానికి హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేసే కంపెనీలకు ఇక పత్రాల పని ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగిని నియమించుకున్న కంపెనీ.. తన సేవలు అందించేందుకు వేరే సంస్థకు ఆ వ్యక్తిని పంపిస్తే ఆ మరో సంస్థ థర్డ్ పార్టీ సైట్ అవుతుంది. ఏప్రిల్ 2 నుంచి హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కఠిన నిబంధనలు అమలులోకి రావడం గమనార్హం. తాజా నిబంధనలు భారత ఐటీ సంస్థలు, వాటి ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఇరాన్‌లో విమానం కూలి 66 మంది మృతి

ఇరాన్‌కు చెందిన ప్రయాణికుల విమానం ఈనెల 18న కూలిపోయిన ఘటనలో 66 మంది మరణించారు. అసెమాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం రాజధాని టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి 500 కిలోమీటర్ల దూరంలోని జాగ్రోస్ పర్వత శ్రేణిలోని దెనా పర్వతంపై కూలిపోయింది. ఈ విమానంలో ఒక చిన్నారి సహా 60 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు.

అంతర్జాతీయ వార్తలు


సిరియాలో వైమానిక దాడులు.. 200 మంది పౌరులు మృత్యువాత

పౌరుల ప్రాణాలను లెక్కచేయకుండా సిరియా ప్రభుత్వం వైమానిక దాడులను కొనసాగిస్తోంది. దేశంలోని తూర్పు ఘౌటా ప్రాంతంలో ఈనెల 20న కూడా బాంబుల వర్షం కురిపించింది. ఈనెల 18 నుంచి జరుగుతున్న దాడుల్లో 57 మంది చిన్నారులు సహా 200 మందికి పైగా పౌరులు మరణించినట్లు సిరియా మానవహక్కుల సంస్థ తెలిపింది. ఈనెల 20వ తేదీన జరిగిన దాడుల్లోనే 127 మంది మృత్యువాత పడ్డారు.

కేంద్రంపై అవిశ్వాసానికి సిద్ధమే : జగన్

కేంద్రప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. ప్రకాశంజిల్లా కందుకూరులో ఈనెల 18న జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, అవిశ్వాసం పెట్టేందుకు సరిపడా ఎంపీల బలం తమకు లేనందున తెలుగుదేశం పార్టీ సహా మిగిలిన పార్టీలు కలసి వచ్చేలా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చర్చించాలని సూచించారు. టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టినా తాము మద్దతిస్తామని ఆయన ప్రకటించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 19న స్పందిస్తూ, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు సాధించేందుకు ఆఖరి అస్త్రం అవిశ్వాస తీర్మానం కావాలని, ముందు పార్లమెంట్‌లో మనవంతు ప్రయత్నం చేయాలని అన్నారు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే విషయంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు.

హాస్యనటుడు గుండు హనుమంతరావు కన్నుమూత



హాస్యనటుడు గుండు హనుమంతరావు (61) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 19న హైదరాబాద్‌లో తన స్వగృహంలో మరణించారు. విజయవాడలో జన్మించిన ఆయన మూడు దశాబ్దాలుగా 400కు పైగా సినిమాలు, టీవీ సీరియల్స్‌లో నటించారు.

రాష్ట్ర వార్తలు

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు ఒక విడత డీఏ

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు ఒక విడత కరవు భత్యాన్ని మంజూరు చేస్తూ మంత్రివర్గం ఈనెల 21న నిర్ణయించింది. 2017 జనవరి ఒకటో తేదీ నుంచి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఏప్రిల్ ఒకటో తేదీన తీసుకునే మార్చినెల జీతానికి ఒక విడత కరవు భత్యాన్ని కలిపి అందిస్తారు.

కియా కార్ల పరిశ్రమ రూపకల్పన ప్రక్రియ ప్రారంభం

అనంతపురం జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి గ్రామంలో కియా కార్ల పరిశ్రమ రూపకల్పన ప్రక్రియ (ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ సెరిమనీ) ఈనెల 22న ప్రారంభమైంది. కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈవో హాన్-వూ పార్క్, సీఎం చంద్రబాబునాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ నమూనా చిత్రపటాన్ని ప్రారంభించారు.



ఫెదరర్ మళ్లీ నెంబర్ వన్

స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ టెన్నిస్ ఆటగాడు రోజర్ ఫెదరర్ మళ్లీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. టెన్నిస్ చరిత్రలో ఈ ఘనత సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. దీంతో అతడి చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్ రెండోస్థానానికి పడిపోయాడు. ఏబీఎన్ ఆమ్రో ప్రపంచ టోర్నీలో ఈనెల 16న సెమీస్‌కు చేరుకోవడం ద్వారా ఫెదరర్ ఈ ఘనతను సాధించాడు. ఈనెల 18న జరిగిన ఫైనల్‌లో ఫెదరర్ విజయం సాధించి తన కెరీర్‌లో 97వ టైటిల్ సాధించాడు.

తొలి టీ20లో భారత్, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం



దక్షిణాఫ్రికాతో జోహనెస్‌బర్గ్‌లో ఈనెల 18న జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా జట్టు 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు, దక్షిణాఫ్రికా జట్టు తొమ్మిది వికెట్లకు 170 పరుగులు చేశాయి. సెంచూరియన్‌లో ఈనెల 21వ తేదీన జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట భారత్ నాలుగు వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా 18.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

క్రీడా వార్తలు

మూడో టీ 20లో భారత్ మహిళల జట్టు ఓటమి



జోహనెస్‌బర్గ్‌లో ఈనెల 18న జరిగిన మహిళల మూడో టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు భారత్ జట్టును 5 వికెట్ల తేడాతో ఓడించింది. భారత్ జట్టు 17.5 ఓవర్లలో 133 పరుగులకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా జట్టు 19 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. సెంచూరియన్‌లో ఈనెల 21న జరగాల్సిన నాలుగో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

ఏడో నిజాం కుమారుడి కన్నుమూత

తెలంగాణ వార్తలు

ఏడో నిజాం కుమారుడు నవాబ్ ఫజల్ జహ బహదూర్ (72) ఈనెల 18న హైదరాబాద్ కింగ్ కోఠిలోని తన నివాసంలో కన్నుమూశారు. హైదరాబాద్ స్టేట్ చివరి పాలకుడైన ఏడో నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్, సాహెబ్ జీలా బేగం దంపతులకు 1946 ఫిబ్రవరి 29న జన్మించారు. ఫజల్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.



తిండి గోల

Sunday Special



విశాలాంధ్ర, జనరల్ డెస్క్: తాను పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ప్రతి మనిషి కోరుకుంటాడు, అలాగే సంపూర్ణ ఆరోగ్యంతో ఎక్కువ బతకాలని ఆకాంక్షిస్తుంటాడు. అందుకే ఆరోగ్యంగా ఉండడానికి వీలయినన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ఉంటారు. చెడు అలవాట్లు ఉన్న వారు కూడా వాటి నుంచి తప్పించుకోవడానికి తగినన్ని ఆరోగ్య సూత్రాలను పాటిస్తూనే ఉంటారు. ఈ మధ్య కాలంలో మనిషికి ఆరోగ్యం మీద శ్రద్ధ మరీ ఎక్కువైపోయింది. మరి ఇంతటి అవగాహన రావడంలో మీడియా పాత్ర చాల ఎక్కువ. మనం ఇప్పుడు ఏ పత్రిక తిరగేసినా, ఏ టీవీ ఛానల్ చూసినా ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ప్రజలు బాగా చదువుతున్నారు, చూస్తున్నారు కాబట్టి అటువంటి శీర్షికలు కూడా ఎక్కువైపోయాయి. ఇదంతా బాగానే ఉంది కాని ఆరోగ్యంగా ఉండదానికి ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి చిట్కాలు పాటించాలనే విషయంలోనే గందరగోళం ఉంది. ఒకరు చెప్పిన దానికి, మరొకరు చెబుతున్నదానికి పొంతన ఉండడం లేదు. ముఖ్యంగా బీపీలు, మధుమేహం ఎక్కువై పోతూనే ఉన్నాయి. అలాంటి వారు ఎవరు ఏం చేబితే అది పాటించేస్తున్నారు. దానివల్ల లాభనష్టాలు విష యం ఆలోచించడం లేదు. ఈ ట్రెండ్ ఇప్పటి నుంచి కాదు పాత కాలం నుంచి ఉంది.

1980 దశకంలో ఓ మహానుభావుడు ఆయిల్‌పుల్లింగ్ పేరుతో ఒక వైద్య విధానం ప్రాచుర్యంలోకి తేవడంతో జనం వేలంవెర్రిగా ఆచరించారు. అప్పట్లో ఎవరు చూసినా నోట్లో చెంచాడు ఆయిల్ పోసుకొని నోటితో వ్యాయామం చేయడం కన్పించేది, ఆతర్వాత ఒకాయన మంచి నీళ్ల వైద్యం ప్రచారంలోకి తెచ్చారు. పొట్ట రోగాల పుట్ట అది శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం, అందుకు ఉదయాన్నే లీటర్లకు లీటర్లు నీళ్లు తాగి లెట్రిన్‌లోని వెళ్లి కడుపు శుభ్రం చేసుకోమంటే అప్పట్లో అదో వేలంవెర్రిగా మారింది. ఆరోజుల్లో ఉదయాన్నే ఎవరింటికి వెళ్లినా లీటర్లకు లీటర్లు నీళ్లు తాగి హడావుడిగా అటూఇటూ నడిచే వాళ్లు కన్పించేవారు. ఆ తర్వాత ఆ రాజు గారే పచ్చి కూరగాయలు వైద్యం మొదలు పెట్టారు. ఈ కార్యక్రమాన్ని టీవీల వాళ్లు ప్రసారంచేశారు. ఈ ఆరోగ్య కార్యక్రమాన్ని పాటించి అనారోగ్యం పాలయ్యా రని, ముఖ్యంగా గ్యాస్ ట్రబుల్‌తో ఇబ్బంది పడ్డారని వార్తలు వచ్చాయి. ఒకాయన కోర్టుకెళ్లి ఉత్తర్వులు తెస్తేగాని ఈ కార్యక్రమం ఆగలేదు. ఇప్పటికీ ఆయన ప్రకృతి వైద్యశాలలో ఉండే వారికి ఇదే ఆహారం. కోడిగుడ్డు మాంసాహారమా? శాఖాహారమా అన్నది అటుం చితే గుడ్డు వెర్రీగుడ్ అని అందరూ అంటారు. ఇంతకంటే మంచి పోషకాహారం లేదని అంటారు. అటువంటిది గుడ్డు ఉన్న పరిం రాల్లోకి దేవతలే రారని టీవీల్లో ప్రవచనలు చేసే ఓ పెద్దాయన ఇటీవల సలహాలిస్తున్నారు. ఇప్పు డెమో కిటో డైట్ సీజన్. కొవ్వుకు కొవ్వుతోనే చెక్ పెట్టాలన్న ఈ విధానంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. టీవీ వాళ్లయితే రోజులకు రోజులు చర్చా గోష్టులు నిర్వహిస్తున్నాయి.

ఊబకాయం ఆరోగ్యానికి గుదిబండలాంటిది. ఆ బరువును తగ్గించుకోవటానికి రకర కాల విధాలున్నా అందులో ఏదిశ్రేయస్కరమన్న విషయమై చర్చలు జరుగుతునే ఉన్నాయి. అలాగే మధుమేహం, బీపీ వంటివి ప్రపంచ మానవాళిలో ఎక్కువ మంది ఎదుర్కోంటున్న సమస్య. వీటిని బతికినంత కాలం మందులు వాడటం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని వైద్యనిపుణులు అంటారు. మరి ఇటువంటి రోగాలు కేవలం ఆహార విధానం మార్చుకొని, అంతా కేవలం కొవ్వుతినడం వల్లనే మటుమాయమవుతాయన్న వాదన విన్పిస్తుండడంతో ప్రజల్లో దీనిపై అమితాసక్తి పెరిగింది. నిజానికి ఈ ఆహారవిధానం కొత్తేమీ కాదని వైద్య నిపుణులు అంటున్నప్పటికీ ప్రజలు ఈ ఆహార విధనంపై మక్కువ చూపుతున్నారు. ఈ తరహా ఆహార మంచిదేనా? దీనితో బరువు తగ్గే మాట నిజమేనా... దీని వల్ల ఇతరత్రా ఎటువంటి సమస్యలు ఉండవా అన్నది అందరి ముందున్న ప్రశ్న. ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిన, అమెరిన్ వైద్యుల సంఘానికి ప్రముఖప్రపంచ వ్యాప్తంగా పేరు పొందిన అమెరికా వైద్యుల సంఘం ప్రచురించే ప్రతిష్టా కరమైన పత్రిక 'జమా'లో ... ఊబకాయంపై ఒక సంచికకీ కీటో డైట్ ఆహార విధానంపై వ్యాసం ప్రచురించింది, ఇటీవల బరువు తగ్గడానికి టైప్-2 మధుమేహాన్ని ప్రపంచ వ్యాప్తంగా కిటో 'జెనిక్ డైట్‌పై జరిగిన, జరుగుతున్న పరిశోధనలు, ఆ పరిశోధనల్లో తేలిన అంశాలు ఆ వ్యాసంలో ప్రస్తావించింది. అయితే ఇటు వంటి ఆహారం తీసుకునేవాళ్లు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. మన రాష్ట్రంలో కూడా ఈ ఆహార విధానంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీపీ, సుగర్, ఊబకాయం ఉన్నవాళ్లు ఎలాగూ డాక్టర్లతో టచ్‌లోనే ఉంటారు కాబట్టి వారి సలహా తీసుకోకుండా ఈ విధానాన్ని పాటించవద్దని డాక్టర్లు చెబుతున్నారు. ఊబకాయం, అలాగే కీటో డైట్‌పై రాష్ట్రంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామకృష్ణకూడా ఈ ఆహార నియమాలను ప్రారంభించే ముందు తనను తప్పని సరిగా సంప్రదించాలని అంటున్నారు కాబట్టి అటువంటి వాళ్లకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. ఏది ఏమైనా ఆరోగ్యానికి ఏమి తినాలి, ఏమి తినకూడదు, ఏది మంచి, అది మంచిదని ఒక ళ్లంటే, ఇది మంచిదని మరొకళ్లు అంటూ జనాన్ని మాత్రం తికమక పెట్టేస్తున్న మాట నిజం.

స్వీట్ పోయె
డ్రైఫ్రూట్స్ వచ్చే



విశాలాంధ్ర, జనరల్ డెస్క్ : మన సమాజంలో స్వీట్స్ శుభానికి, సంతోషానికి సంకేతం. అందుకే న్యూఇయర్, పుట్టినరోజు, పెళ్లిరోజు.. ఇలా ఏ శుభకార్యమైనా, స్వీట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అటువంటిది మారుతున్న జీవనశైలిలో భాగంగా స్వీట్స్ స్థానాన్ని ఇప్పుడు డ్రైఫ్రూట్స్ ఆక్రమించాయి. ఒకప్పుడు గిఫ్ట్ ప్యాకెట్లుగా స్వీట్స్ స్థానంలో డ్రైఫ్రూట్స్ ప్యాక్‌లు దర్శనమిస్తున్నాయి. మనిషి జీవన విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా రోగాలు కూడా చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా షుగర్, బీపీ, స్థూలకాయం, జీర్ణాశయ వ్యాధులు వంటివి పట్టి పీడిస్తున్నాయి. ఇటువంటివారు స్వీట్లకు దూరంగా ఉండాలని కూడా వైద్యులు ఇస్తున్న సలహా. ఈ మార్పునకు మరొక కారణం. ఇప్పుడు బహుమతుల జాబితాలో డ్రైఫ్రూట్స్ ప్రథమస్థానం ఆక్రమించాయి. ప్రస్తుతం ముఖ్యమైన రోజులు, పండుగల సమయాలలో అందమైన ప్యాకింగ్‌లలో డ్రైఫ్రూట్స్ బహుమతులుగా ఇచ్చే సంప్రదాయం ఎక్కువైంది. అందుకే వీటి అమ్మకాలు కూడా జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా డ్రైఫ్రూట్స్ షాపులు వెలుస్తున్నాయి. ఇదివరకు మిఠాయిలు, కేక్‌ల స్థానాన్ని డ్రైఫ్రూట్స్ ఆక్రమించాయి. ఇదివరకు డబ్బున్న వారికే సొంతమైన ఈ డ్రైఫ్రూట్స్‌పట్ల ఇప్పుడు మధ్యతరగతి ప్రజానీకం కూడా ఆసక్తి చూపడంతో వీటిని ఆదరణ పెరిగింది. జీడిపప్పు, ఖర్జూరా, బాదంపిస్తా, గ్రీన్‌పిస్తా, అంజీర, అప్రోనైటీస్, వాల్‌నట్స్, ఫైన్‌నట్స్, ఆల్‌బకరా, ఎండుద్రాక్ష నాణ్యతనుబట్టి మార్కెట్‌లో దొరుకుతున్నాయి.

నీరవ్ మోడీ, మెహల్ చోస్కిల పాస్‌పోర్టులు రద్దు

నీరవ్ ఫాంహౌస్ స్వాధీనం?!

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు వేల కోట్ల కుంభకోణం కేసులో వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, గీతాంజలి జెమ్స్ యజమాని మెహల్ చోస్కిల పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వర్గాలు శనివారం తెలిపాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సలహాపై ఫిబ్రవరి 16 నుంచి నాలుగువారాలపాటు వారి పాస్‌పోర్టులను మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. పాస్‌పోర్టులు ఎందుకు రద్దు చేయకూడదో లేదా స్వాధీనం చేసుకోరాదో వారు ప్రతిస్పందించడానికి వారం రోజుల గడువు ఇచ్చింది. 'ఇప్పటి వరకు వారు స్పందించలేదు. దీంతో పాస్‌పోర్టులను రద్దు చేశాం' అని మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. నోటీసులకు నీరవ్ మోడీ, చోస్కిలు స్పందించకపోతే వారి పాస్‌పోర్టులను రద్దు చేయవచ్చని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థల సలహా మేరకు తదుపరి చర్యలు చేపడతామని తెలిపింది. ఈ కేసులో దర్యాప్తునకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఈడీలు రెండేసి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాయి.

పీఎన్‌బీ మెగాస్కాంలో ఈడీ దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు నీరవ్‌మోడీకి చెందిన విలువైన పలు స్థిర ఆస్తులను శనివారం ఈడీ అధికారులు సీజ్ చేశారు. ముఖ్యంగా ఈ స్కాం వెలుగులో వచ్చిన తరువాత వార్తల్లో నిలిచిన మోడీ విలాసవంతమైన ఫాం హౌస్‌ను ఈడీ స్వాధీనం చేసుకుంది. వీటితోపాటు ముంబైలో ఆరు నివాస, పది కార్యాలయాలు, పూణెలో రెండు ఫ్లాట్లను కూడా స్వాధీనం చేసుకుంది. మనీ లాండరింగ్ చట్టంకింద మోడీ, ఆయన కంపెనీ నియంత్రణలో ఉన్న 21 స్థిరాస్తులను ఈడీ అధికారులు ఎటాచ్ చేశారు. అలీబాగ్‌లో ఫాం హౌస్, సోలార్ పవర్ ప్లాంట్, అహ్మద్ నగర్‌లోని 135 ఎకరాల భూమి, ముంబై, పూణేలోని నివాస, కార్యాలయాల ఆస్తులు ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ. 523.72 కోట్లుగా ఈడీ తేల్చింది. కాగా అలీబాగ్ లోని ఫాంహౌస్‌ను సీబీఐ ఇప్పటికే సీల్ చేయగా, తాజాగా దీన్ని ఈడీ ఎటాచ్ చేసింది. అలాగే మోడీకి చెందిన విలువైన తొమ్మిదికార్లను, దాదాపు 10వేల ఖరీదైన విదేశీ వాచ్‌లను ఈడీ స్వాధీనం చేసుకుంది.



నియంత్రణ చర్యలు చేపట్టండి

ఆ నాలుగు బ్యాంకులకు ఆర్థికశాఖ లేఖ

న్యూఢిల్లీ : దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా పేరొందిన పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో రూ.11,300కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చి సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులు కంపెనీలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చే ముందు నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ హాంకాంగ్‌లోని నాలుగు భారతీయ బ్యాంకులకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఎప్పకటికప్పుడు ఖాతాలను పరిశీలిస్తూ, అక్రమాలను వెంటనే గుర్తించాల్సిందిగా లేఖలో పేర్కొనట్లు సమాచారం. హాంకాంగ్‌లోని ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ లేఖలు పంపించినట్లు తెలుస్తోంది. ఈ నాలుగు బ్రాంచ్‌ల్లోనే పీఎన్‌బీ ముంబై బ్రాంచ్ మధ్యవర్తిగా ఉండి నీరవ్ మోడీకి రుణాలు ఇప్పించింది. ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి రూ.250కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి ఖాతాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఓ అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. నీరవ్ మోదీ, రొటోమాక్ యజమాని విక్రమ్ కొఠారిలు బ్యాంకుల దగ్గర నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకొని వాటిని ఎగవేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఇటువంటివి పునరావృతం కాకుండా బ్యాంకుల ఆడిటర్లు ఎప్పటికప్పుడు తప్పులు గుర్తించ డంలో కీలకంగా వ్యవహరించాలని ఇటీవల కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ సూచించారు.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	677.80	6.26
సన్‌ఫార్మా	570.20	5.17
ఎస్ బ్యాంక్	323.60	2.28
భారతీ ఎయిర్‌టెల్	427.65	2.26
రెడ్డీ ల్యాబ్స్	2,183.65	2.26

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఏషియన్ పెయింట్స్	1,101.90	-1.29
కోల్ ఇండియా	310.55	-0.48
ఇన్ఫోసిస్	1,155.65	-0.42
ఎం&ఎం	724.30	-0.22
హెచ్‌యూఎల్	1,329.95	-0.16

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.04	64.73
యూరో	79.93	79.71
పౌండ్	90.38	90.64
ఆస్ట్రేలియా డాలర్	50.93	50.67
సింగపూర్ డాలర్	49.26	49.00

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,140	31,165
చెన్నై	29,140	31,165
బెంగళూరు	28,550	30,534
ముంబై	29,910	31,165
విజయవాడ	29,000	31,500
విశాఖపట్నం	29,140	31,789
ప్రొద్దుటూరు	29,090	30,960

దేశంలో తొలిసారి 5జీ పరీక్షించిన ఎయిర్‌టెల్

ఒక్క సెకనులో 3జీబీ వేగం



న్యూఢిల్లీ : టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్, టెక్నాలజీ సంస్థ హువాయ్ దేశంలోనే తొలిసారిగా 5జీ నెట్‌వర్క్‌ను సంయుక్తంగా పరీక్షించాయి. ఒక్క సెకన్‌లో 3 గిగాబైట్ల వేగాన్ని సాధించాయి. 'దేశంలోనే తొలిసారి 5జీ నెట్‌వర్క్‌ను విజయవంతంగా పరీక్షించాం' అని హువాయ్ తెలిపింది. గురుగ్రామ్‌లోని మానేసర్ ఎయిర్‌టెల్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రంలో ఈ పరీక్షను నిర్వహించారు. 'ఇది చాలా చిన్నదే. అయితే 5జీని చేరుకునే ప్రయాణంలో మాత్రం కీలక మైలురాయి. 5జీ టెలికాం రంగాన్ని మలుపు తిప్పగలదు. మన జీవితాలను, పనుల్లో పెనుమార్పులు కలిగిస్తుంది. మా భాగస్వామితో కలిసి అత్యద్భుత 5జీ నెట్‌వర్క్‌ను భారత్‌లో అభివృద్ధి చేస్తాం' అని భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్స్ సంచాలకుడు అభయ్ పేర్కొన్నారు. పరీక్షలో లక్షిత వేగం 3జీబీపీఎస్‌ను సాధించారు. '3.5ఉఊళి బ్యాండ్‌లో 100ఓఊళి బ్యాండ్‌విడ్త్‌లో, ఎండ్ టు ఎండ్ పరీక్షలో ఒక మొబైల్ నెట్‌వర్క్ సాధించిన అత్యధిక వేగం ఇదే' అని రెండు సంస్థలు ప్రకటించాయి. టెలికాం రంగంలో జియో సంచలనాలకు తెరదించాలని ఉద్దేశంతోనే ఎయిర్‌టెల్ 5జీతో ముందుకొస్తున్నట్టు సమాచారం.

పీఎన్‌బీ ఖాతాదారుల డేటా లీక్!



న్యూఢిల్లీ : ఇప్పటికే రూ.11,400కోట్ల కుంభకోణంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) సతమవుతోంది. దీంతో పాటు పీఎన్‌బీ మరో సమస్యలో ఇరుక్కుంది. ఆ బ్యాంకుకు చెందిన దాదాపు 10వేల మంది ఖాతాదారుల డెబిట్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన డేటా లీక్ అయినట్లు ఏషియన్ టైమ్స్ నివేదిక వెల్లడించింది. ఓ వెబ్‌సైట్ ద్వారా ఖాతాదారుల వివరాలను మూడు నెలలుగా అమ్మకానికి పెట్టినట్లు ఆ నివేదికలో పేర్కొంది. ఖాతాదారుడి పేరు, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు, వాటి గడువు ముగింపు తేదీ, వ్యక్తిగత గుర్తింపు సంఖ్య, కార్డ్ వెరిఫికేషన్ వాల్యూస్, సీవీవీ నంబర్లు తదితర వివరాలు హ్యాకర్ల చేతికి వెళ్లినట్లు సమాచారం. డేటా లీక్‌పై పీఎన్‌బీ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై బ్యాంకు అధికారులు ఇప్పటి వరకు స్పందించలేదు. ప్రస్తుతం పీఎన్‌బీని రూ.11,400కోట్ల మేర మోసగించిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయిన కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే నీరవ్‌కు చెందిన పలు ఆస్తులను, ఖరీదైన కార్లు, చేతి గడియారాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విదేశాల్లో ఉన్న నీరవ్‌ను వెనక్కి రప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు అతడి దగ్గర నుంచి డబ్బులను చట్టబద్ధంగానే రాబడతామని పీఎన్‌బీ అధికారులు చెబుతున్నారు.

5జీ కోసం క్వాల్కమ్‌తో శాంసంగ్ ఒప్పందం



ముంబై: 4జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే 5జీ సేవలకు సంబంధించిన పనులు కూడా జరిగిపోతు న్నాయి. ఇందు కోసం టెలి కాం, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థలు కార్యాచరణ రూపొందించి ఆ దిశగా కసరత్తులు ప్రారంభించాయి. ఇటీవల టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్, టెక్నాలజీ సంస్థ హువాయ్ దేశంలోనే తొలిసారిగా 5జీ నెట్‌వర్క్‌ను సంయుక్తంగా పరీక్షించిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రముఖ చిప్‌సెట్ తయారీ సంస్థ క్వాల్కమ్‌తో కలిసి 5జీ నెట్‌వర్క్‌పై పనిచేసే చిప్‌సెట్‌లను తయారు చేయనున్నట్లు శాంసంగ్ వెల్లడించింది. గతకొద్ది కాలంగా 5జీ నెట్‌వర్క్ సేవలు అందించే సెమి కండక్టర్లకు డిమాండ్ ఊపందుకుంది. దీంతో శాంసంగ్-క్వాల్కమ్‌లు కలిసి ఎక్స్‌ట్రీమ్ అల్ట్రా వైలెట్(ఈయూవీ)లిథోగ్రఫీ ప్రాసెస్ టెక్నాలజీని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. ఇందులో భాగంగా క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 5జీ మొబైల్ చిప్‌సెట్‌ను శాంసంగ్ 7నానోమీ టర్‌లో పవర్‌ప్లస్ ఈయూవీ తయారు చేయనున్నాయి. 'ఈయూవీ ప్రాసెస్ టెక్నాలజీని ఉపయోగించి క్వాల్కమ్‌తో కలిసి 5జీ టెక్నాలజీ ఆధారంగా పనిచేసే చిప్‌సెట్‌లను తయారు చేయబోతున్నాం' అని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ మార్కెటింగ్ టీమ్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు చార్లీ బే తెలిపారు. క్వాల్కమ్‌తో కలిపి పనిచేయడం మైలురాయిగా ఆయన అభివర్ణించారు.

అమెరికా దౌత్యాధికారికి ఫిలిప్పీన్ ప్రభుత్వ సమన్లు



మనీలా : దేశాధ్యక్షుడు రొడ్రిగో డుటర్టే ప్రజాస్వామ్యానికి ముప్పు అంటూ కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ (సీఐఏ) నివేదికలో పేర్కొన్నట్టు తెలుసుకొన్న ఫిలిప్పీన్ ప్రభుత్వం వెంటనే అమెరికా దౌత్యాధికారి సుంగ్ కిమ్‌కు సమన్లు జారీచేసింది. ఈ నివేదికపై కిమ్ అధ్యక్ష కార్యాలయం ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ సాల్వెడార్ మీడియల్‌డియాతో చర్చించినట్టు అధికార ప్రతినిధి హ్యారీరోక్ తెలిపారు. డుటర్టే రాజ్యాంగాన్ని రద్దు చేసి, తిరుగుబాటు ప్రభుత్వాన్ని ప్రకటించి, మార్షల్ చట్టాన్ని అమలు చేసే అవకాశా లున్నట్టు అమెరికా ఇంటెలిజెన్స్ హెచ్చరించడంతో ఆసియాలోని యాంటీడ్రగ్ క్యాంపెయిన్‌కి సంబంధించిన సమాచారాన్ని వాషింగ్టన్‌లోని ఫిలిప్పీన్ దౌత్య కార్యాలయం ద్వారా సీఐఏకు సాల్వెడార్ అందజేస్తున్నట్టు రోక్ వివరించారు. డుటర్టే చట్టాన్ని గౌరవిస్తారని ఉత్తరాది దేశాన్ని ఒప్పించేందుకు మనీలా దౌత్యాధికారులు యత్నిస్తారని ఆయన తెలిపారు.

శ్వేతసౌధం బారికేడ్‌పైకి దూసుకెళ్లిన కారు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష నివాసం వైట్‌హౌస్ బారికేడ్లపైకి ఓ కారు దూసుకెళ్లింది. అధ్యక్షుడు ట్రంప్, ఆస్ట్రేలియా అధ్యక్షుడు మాల్కోమ్ టర్న్‌బుల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. దీంతో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీసెస్ అధికారులు కొద్దిసేపు శ్వేతసౌధాన్ని లాక్‌డౌన్ చేశారు. అయితే ఎలాంటి కాల్పులు జరగలేదని, ఎవరికి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. కారు నడుపుతున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. తానెవ్వరినీ లక్ష్యంగా చేసుకోలేదని మహిళ చెప్పారని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు.

బ్యాంకులన్నీ స్విఫ్ట్‌తో అనుసంధానం..!



ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో బ్యాంకులన్నీ తమ సాఫ్ట్‌వేర్‌ను స్విఫ్ట్‌తో అనుసంధానం చేయాలని కమర్షియల్ బ్యాంకులను ఆర్బీఐ కోరింది. స్విఫ్ట్ అంటే సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలి కమ్యూనికేషన్. బ్యాంకుల మధ్య ఇదో మెసేజింగ్ వ్యవస్థ. ప్రతి కమర్షియల్ బ్యాంక్‌కు కూడా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (సీబీఎస్) సాఫ్ట్‌వేర్ ఉంటుంది. ఆర్బీఐ ఆదేశాల ప్రకారం.. ప్రతి బ్యాంక్ తమ సీబీఎస్‌తో స్విఫ్ట్ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేయాలి. ఈ ఏడాది ఏప్రిల్ 30 లోపు అనుసంధానం జరగాలని ఆర్బీఐ ఆదేశించింది. బ్యాంకుల ఇంటర్నల్ కంట్రోల్‌ను మరింత పటిష్టం చేసేందుకు ఇది అవసరమైన ప్రక్రియ అని ఆర్బీఐ పేర్కొన్నది. పీఎన్‌బీ నుంచి 11.000 కోట్లు తీసుకున్న నీరవ్ మోడీ రుణాలు చెల్లించలేదు. దీంతో ఆ స్కామ్ పెను దుమారాన్ని సృష్టించింది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్బీఐ ఈ తాజా సూచనలు చేసింది. సాధారణంగా బ్యాంకులు నిర్వహించే లావాదేవీలకు సీబీఎస్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు.

322.65 ▲ సెన్సెక్స్ 34,142.15	108.35 ▲ నిఫ్టీ 10,491.05	బంగారం (విజయవాడ) 29,000 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 29,140 ప్రొద్దుటూరు 29,090 22 క్యారెట్లు, 10 గ్రాములు	-100 ▼ వెండి (విజయవాడ) 39,700 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,600 ప్రొద్దుటూరు 41,456 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 64.73

పన్ను ఆదాకు 15 ఉత్తమ పెట్టుబడి మార్గాలు

పన్ను చెల్లింపుదారులు... 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను పన్ను ఆదా చేసుకునేందుకు చక్కని పెట్టుబడి పథకాల గురించి అన్వేషిస్తున్నారు. స్మార్ట్ ఇన్వెస్టర్లు ఉత్తమమైన పెట్టుబడి మార్గాల్లో పెట్టడం ద్వారా అటు పన్ను ఆదాతో పాటు ఇటు అధిక రాబడులను పొందుతున్నారు. సెక్షన్ 80సీ పరిధికి మించి ఉన్న పన్ను ఆదా పెట్టుబడి మార్గాలేమిటి? వేతన ఉద్యోగులకు, వ్యాపారులకు ఎలాంటి పన్ను ఆదా పథకాలు అనుకూలం.. 2018లో ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవడమెలాగో తెలుసుకుందాం.

ఈఎల్ఎస్ఎస్ ట్యాక్స్ సేవింగ్స్ మ్యూచువల్ ఫండ్లు

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) అనేవి మ్యూచువల్ ఫండ్లు. ఇందులో సంవత్సరానికి రూ. లక్షన్నర దాకా పెట్టుబడులపై పన్ను ఆదా పొందొచ్చు. ఇతర మ్యూచువల్ ఫండ్ల మాదిరిగానే వీటి రాబడులకు కచ్చితమైన హామీనివ్వలేరు. ఐతే మార్కెట్లు బాగుంటే 12 నుంచి 18శాతం దాకా రాబడులు వచ్చే అవకాశమైతే ఉంది. ఏ పన్ను ఆదా పథకంతో పోల్చి చూసినా ఈఎల్ఎస్ఎస్‌కు అతి తక్కువ లాకిన్ పీరియడ్ ఉంది. ఇది కేవలం మూడేళ్లే. ఇన్వెస్టర్లు డివిడెండ్ ఆప్షన్‌ను ఎంచుకోవడం ద్వారా లాకిన్ పీరియడ్‌లోనూ రెగ్యులర్ ఇన్‌కమ్ పొందొచ్చు. ఈఎల్ఎస్ఎస్‌లో నెల నెలా సిప్ చేయడం వల్ల మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షించుకొని అధిక రాబడులు పొందే అవకాశం ఉంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే ప్రతి నెల సిప్‌కు లాకిన్ పీరియడ్ మూడేళ్లు. ఉదాహరణకు డిసెంబరు 2017లో సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేశారనుకుందాం. దీని లాకిన్ పీరియడ్ నవంబర్ 2020 దాకా ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్ ద్వారా వచ్చే రాబడులు ట్యాక్స్ ఫ్రీ. ఎందుకంటే ఇవి ఈక్విటీ విభాగం కిందికి వస్తాయి. మూడేళ్లు పైగా ఇన్వెస్ట్ అయి ఉంటాయి కాబట్టి పూర్తి పన్ను మినహాయింపు ఉంటుంది. కొన్ని టాప్ ఈఎల్ఎస్ఎస్ ఫండ్లలో... యాక్సిస్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్, రిలయన్స్ ట్యాక్స్ సేవర్ ఫండ్, డీఎస్‌పీ బ్లాక్‌రాక్ ట్యాక్స్ సేవర్ ఫండ్‌లు ఉన్నాయి. 2018-19 కోసం మంచి రాబడినివ్వగలిగే ఉత్తమ పెట్టుబడి మార్గాల్లో ఇవి ఒకటి.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఆర్థిక మంత్రిత్వశాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ప్రతి మూడు నెలలకోసారి మారుస్తుంది. పీపీఎఫ్ పై వడ్డీ రేట్లు ఒకప్పుడు బాగా ఉండేవి. కాలక్రమేణ తగ్గుతూ వచ్చాయి. అయినప్పటికీ ఇవి ఉత్తమ పెట్టుబడి మార్గాల్లో ఒకటి. ప్రస్తుతానికి వార్షికంగా 7.6శాతం వడ్డీ లభిస్తుంది. జనవరి 2018 నుంచి ఇది వర్తిస్తోంది. మెచ్యూరిటీ గడువు ముగిశాక వచ్చే సొమ్ముపై పూర్తిగా పన్ను మినహాయింపు ఉంది. పీపీఎఫ్ ఖాతా లాకిన్ పీరియడ్ 15ఏళ్లు. లక్షన్నర రూపాయల దాకా పెట్టే పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు. 3వ ఆర్థిక ఏడాది నుంచి 5వ ఏట వరకు రుణం పొందే వీలుంది. వడ్డీ పైన అదనంగా రుణ రేటును 2శాతం విధిస్తారు. ఎన్ఆర్ఐలు పీపీఎఫ్ ఖాతా తెరిచేందుకు అనర్హులు. అక్టోబర్ 2017లో జారీ అయిన నియమాల ప్రకారం ఎన్ఆర్ఐలు పీపీఎఫ్ ఖాతాను అలాగే కొనసాగిస్తే సాధారణ పొదుపు ఖాతాకు వర్తించే వడ్డీనే జమచేస్తారు. ఒక వ్యక్తి హిందూ అవిభాజ్య కుటుంబం తరపున లేదా వ్యక్తుల సమూహం తరపున ఈ పథకం ద్వారా పెట్టుబడి పెట్టేందుకు వీల్లేదు. కనీసం రూ.500 పెట్టుబడి, గరిష్టంగా రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టవచ్చు. ఇంతకన్నా ఎక్కువ పెడితే ఎటువంటి వడ్డీ జమకాదు. ప్రతి నెలా పీపీఎఫ్‌లో డబ్బు జమచేయవచ్చు. ఐతే ప్రతి నెల 5వ తేదీలోపు ఇన్వెస్ట్ చేస్తే ఆ నెల వడ్డీ జమ అవుతుంది. ఏప్రిల్ 5 లోపు రూ.1.5లక్షలు జమచేయగలిగితే ఆర్థిక సంవత్సరానికి పూర్తి వడ్డీ జమ అవుతుంది. ఈ విధంగా చేస్తే 15ఏళ్ల వ్యవధిలో మంచి రాబడులను పొందొచ్చు. 2018లో ఉత్తమ పెట్టుబడి మార్గాల్లో పీపీఎఫ్ ఒకటి. పన్ను ఆదాతో పాటు రిటైర్‌మెంట్ కోసం నిధి జమచేసుకోవాలనుకునేవారికి, పిల్లల చదువు, పెళ్లిళ్ల కోసం జమచేయాలనుకునేవారికి ఇది ఉత్తమ పెట్టుబడి మార్గం. సురక్షితమైన పెట్టుబడికి, అధిక రాబడికి పీపీఎఫ్ అనుకూలం.







సుకన్య సమృద్ధి యోజన

ఇది కేవలం ఆడపిల్లల సంక్షేమం కోసం ఉద్దేశించింది. ఏటా 8.1శాతం వడ్డీ అందించనుంది. మెచ్యూరిటీ సొమ్ము పూర్తి పన్ను మినహాయింపునకు అర్హత సాధిస్తుంది. కనీసం రూ.1000 మొదలుకొని రూ.1.5లక్షల దాకా పెట్టుబడి పెట్టొచ్చు. దీని కాలవ్యవధి అమ్మాయికి 21ఏళ్లు నిండేవరకు ఉంటుంది. ఐతే ఆలోపు కావాలంటే కొన్ని షరతులకు లోబడి సొమ్మును విత్‌డ్రా చేసుకోవచ్చు. అమ్మాయికి 15ఏళ్లు వచ్చే దాకా డిపాజిట్లకు అనుమతినిస్తారు. 16వ ఏట నుంచి 21ఏళ్ల దాకా డిపాజిట్ చేసేందుకు అనుమతించరు.

పన్ను ఆదానిచ్చే బ్యాంకు ఎఫ్‌డీ పథకాలు

ఇది కాస్త పాత పెట్టుబడి విధానం. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. గతేడాది పెద్ద నోట్ల రద్దు తర్వాత వడ్డీ రేట్లు గణనీయంగా తగ్గాయి. వడ్డీ రేట్లు 4.5 నుంచి 7 శాతం మధ్యలో ఉన్నాయి. దీనిపై వచ్చే రాబడిపై పన్ను వర్తిస్తుంది. అంటే పెట్టుబడిపై మాత్రమే పన్ను మినహాయింపు లభిస్తుంది. వడ్డీపై కాదన్నమాట. పన్ను ఆదానిచ్చే ఎఫ్‌డీల లాకిన్ పీరియడ్ 5ఏళ్లు.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

ఈ పథకం సీనియర్ సిటిజన్స్‌కు అద్భుతంగా ఉంటుంది. 60ఏళ్లు పై బడినవారికి ఇది అనుకూలం. వార్షికంగా 8.3శాతం వడ్డీ లెక్కించినా... చెల్లించేది మాత్రం మూడు నెలలకోసారి. ఈ పథకం కాలవ్యవధి 5ఏళ్లు. కనీసం రూ.1000 డిపాజిట్ చేయవచ్చు. గరిష్టంగా రూ.15లక్షల దాకా అనుమతిస్తారు. దీనిపై వచ్చే వడ్డీకి పన్ను వర్తిస్తుంది. ఒక ఏడాది తర్వాతే ముందస్తు ఖాతా మూసివేతకు అనుమతిస్తారు. అదీ 1.5శాతం ఫైన్‌తో... ఇక రెండేళ్ల తర్వాత తీసుకుంటే 1శాతం రుసుము విధిస్తారు.

వాలంటరీ ప్రావిడెంట్ ఫండ్

ఉద్యోగి తన ప్రావిడెంట్ ఖాతాకు జమచేసుకోగలిగే అదనపు సొమ్మునే వాలంటరీ పీఎఫ్ అంటారు. ఇది ఉద్యోగ భవిష్య నిధిలో భాగంగా 12శాతం జమచేసేదానికి అదనం. వేతనంలోని బేసిక్, డీఏలు కలిపితే ఎంత ఉంటుందో అంత గరిష్ట సొమ్ము జమచేసుకోవచ్చు. దీనికీ ఈపీఎఫ్ వడ్డీ రేటే వర్తిస్తుంది. ఈపీఎఫ్ వార్షిక వడ్డీ రేటు ప్రస్తుతానికి 8.65 శాతంగా ఉంది. ఈ ఫండ్‌లో పెట్టే పెట్టుబడులను రిటైర్‌మెంట్ తర్వాతే తీసుకోవచ్చు. పన్ను ఆదా చేసుకునేందుకు ఇది చక్కని పథకం. మెచ్యూరిటీ తర్వాత వచ్చే రాబడులకు పన్ను వర్తించదు.

కొత్త పింఛను పథకం (ఎన్‌పీఎస్)

సెక్షన్ 80సీ ద్వారా 2018లో పన్ను ఆదా కోసం పెట్టుబడి మార్గాల్లో కొత్త పింఛను పథకం (ఎన్‌పీఎస్) సరైన ఎంపిక. ఎన్‌పీఎస్ రాబడుల్లో వ్యత్యాసం ఉంటుంది. గడచిన 5ఏళ్లలో ఎన్నో ఎన్పీఎస్ ఫండ్లు 10 నుంచి 15శాతం దాకా రాబడులను అందించాయి. మంచి ఎన్‌పీఎస్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే 12 నుంచి 15శాతం దాకా రాబడి వచ్చే అవకాశాలు న్నాయి. ఫండ్ నిర్వహణ ఛార్జీలు సైతం అతి తక్కువ. పెట్టుబడి విలువలో ఇది 0.0009శాతం మాత్రమే. నెలకు రూ.500 చొప్పున లేదా ఏడాదికి రూ.6వేల దాకా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్‌పీఎస్‌లో గరిష్ట పెట్టుబడులకు పరిమితి లేదు. ఐతే టైర్ 1 ఖాతాలో రూ.1.5లక్షల దాకా పెట్టి సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. ఈక్విటీ, బాండ్లు, గిల్ట్ ఫండ్లకు మధ్య అసెట్ అలోకేషన్ చేసుకునేందుకు ఇన్వెస్టర్లకు అవకాశం ఉంది. మెచ్యూరిటీ సొమ్ముపై పన్ను వర్తిస్తుంది. ఎన్‌పీఎస్‌ను ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్‌లో తెరవచ్చు

కొత్త పింఛను పథకం- సెక్షన్ 80 సీసీడీ

సెక్షన్ 80 సీసీడీ కింద ఎన్‌పీఎస్ టైర్ 1 ఖాతాలో పెట్టే పెట్టుబడిపై అదనంగా రూ.50వేల పన్ను ఆదా చేసుకోవచ్చు. టైర్ 1 ఖాతాలో పెట్టే సొమ్మును రిటైర్‌మెంట్ దాకా విత్‌డ్రా చేసుకునే వీల్లేదు. అంటే అప్పటిదాకా సొమ్ము లాక్ అయి ఉంటుంది.

జాతీయ పొదుపు పత్రాలు (ఎన్ఎస్‌సీ)

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ లేదా జాతీయ పొదుపు పత్రాలను పోస్టాఫీసుల్లో జారీచేస్తారు. దీనిపై వడ్డీని భారత ప్రభుత్వం చెల్లిస్తుంది. అందుకే ఇది సురక్షితమైన పెట్టుబడిగా అభివర్ణించవచ్చు. 5ఏళ్ల కాలవ్యవధితో ఇవి అందుబాటులో ఉన్నాయి. కనీసం రూ.500తో కొనచ్చు. ఆ తర్వాత రూ.1000, రూ.5వేలు, రూ.10వేల పత్రాలు లభిస్తాయి. ఇందులో గరిష్టంగా ఎన్ని పత్రాలైనా కొనొచ్చు. వడ్డీ రేట్లు వార్షికంగా 7.6 శాతంగా నిర్ణయించారు. వడ్డీని ప్రతి 6 నెలలకోసారి లెక్కిస్తారు. వచ్చే వడ్డీపై పన్ను వర్తిస్తుంది. ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఇది చూపించాల్సి ఉంటుంది. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల దాకా పన్నుఆదాకోసం క్లెయిం చేసుకోవచ్చు. వ్యక్తులు, ఉమ్మడిగా, సంరక్షకుల ఆధ్వర్యంలో మైనర్లు ఈ పత్రాలు తీసుకునేందుకు అర్హులు.

యూనిట్ లింక్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(యులిప్స్)

2010 సంవత్సరంలో ఐఆర్‌డీఏ నియమాలు జారీచేశాక బీమా సంస్థలు యులిప్స్ ఛార్జీలను గణనీయంగా తగ్గించేశాయి. జీవితానికి ఇవి రక్షణ కల్పిస్తాయి. కొత్త యులిప్స్ పాలసీలకు తక్కువ పాలసీ లేదా నిర్వహణ ఛార్జీలున్నాయి. దీంట్లో ఇంత రాబడి వస్తుందని గ్యారెంటీ లేదు. 5 నుంచి 11శాతం మధ్యలో రాబడిని అందించే అవకాశం ఉంది. 10-12ఏళ్ల కాలంపాటు దీంట్లో ఉంచితే మంచి రాబడులను చూడవచ్చు. స్టాక్‌మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లపై నమ్మకం లేనివారు వీటిని కొనుగోలు చేయవచ్చు. పెట్టుబడితో పాటు జీవిత రక్షణ కల్పిస్తాయి ఇవి. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు.

జీవిత బీమా పాలసీలు

ఆర్థిక ప్రణాళికలో మొట్టమొదట చేయాల్సిన పని జీవిత బీమా తీసుకోవడం. మంచి టర్మ్ ప్లాన్‌ను ఎంచుకోవాలి. అతి తక్కువ ప్రీమియం ఉండేలా ఎక్కువ కవరేజీని ఇస్తాయి. పాలసీదారు తదనంతరం తనపై ఆధారపడి బ్రతికేవారికి ఆర్థిక తోడ్పాటు కల్పిస్తాయి. 10 లేదా 15ఏళ్ల వార్షిక ఖర్చులకు సమానమైన టర్మ్ పాలసీ కొనుగోలు చేయడం మంచిది. జీవిత రక్షణతో పాటు పన్ను ఆదాను ఇవి కల్పిస్తాయి.

గృహరుణ అసలు చెల్లింపు

సొంత ఇల్లు లేనివారు వెంటనే గృహరుణం తీసుకొని ఇల్లు కట్టుకోండి. దాంతో పాటే అసలు లేదా ప్రిన్సిపల్ అమౌంట్ తిరిగి చెల్లింపుపై వడ్డీ మినహాయింపు పొందండి. సొంత ఇల్లు లేకపోతే పన్ను ఆదా చేసుకునేందుకు చేసే పెట్టుబడి మార్గాల్లో దీనికి ప్రాధాన్యత ఇచ్చుకోవచ్చు.

గృహ రుణ వడ్డీ చెల్లింపు

గృహరుణ వడ్డీ చెల్లింపులపై రూ.2లక్షల దాకా పన్ను మినహాయింపు పొందవచ్చు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 24 ఈ వెసులుబాటును కల్పిస్తుంది. సెక్షన్ 80సీ కింద గృహరుణ అసలుపై పొందే మినహాయింపునకు ఇది అదనం. కట్టుకున్న ఇంట్లో నివసించినా, లేదా అద్దెకు ఇచ్చినా ఈ మినహాయింపు వర్తిస్తుంది.

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి

తొలిసారి ఇంటిని కొనుగోలు చేసేవాళ్లలో మీరూ ఒకరైతే గృహరుణ వడ్డీ తిరిగి చెల్లింపుపై అదనంగా రూ.50వేల దాకా పన్ను ఆదా పొందొచ్చు. సెక్షన్ 80ఈఈ ఈ వెసులుబాటును కల్పిస్తుంది. ఉదాహరణకు మొదటిసారి గృహ రుణం తీసుకున్నవారు ఒక ఏడాదిలో రూ.2.6లక్షల వడ్డీ చెల్లించారనుకుందాం. అప్పుడు సెక్షన్ 24 కింద రూ.2లక్షలు, ఇంకా సెక్షన్ 80 ఈఈ కింద రూ.50వేలు.. మొత్తంగా రూ.2.5లక్షల పన్ను మినహాయింపు పొందొచ్చు.

పైన పేర్కొన్న టాప్ 15 పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడి ద్వారా సెక్షన్ 80సీ కింద రూ.1.5లక్షల దాకా మినహాయింపు పొందొచ్చు. ఎన్‌పీఎస్ ద్వారా రూ.50వేలు, గృహరుణ వడ్డీపై రూ.2లక్షల దాకా, మొదటిసారి ఇంటిని కొనుగోలు చేసినవారికి అదనంగా రూ.50వేల రిబేటు.. ఇలా మొత్తంగా రూ.4.5లక్షల దాకా పన్ను మినహాయింపు పొందే వీలుంది. పైన పేర్కొన్న వాటిలో అన్నింటిలో పెట్టాలనేం కాదు. మీ లక్ష్యాలు, పెట్టుబడి వ్యవధి, రిస్క్ తీసుకునే తత్వం లాంటివాటిని బట్టి సరైన దాన్ని ఎంచుకోగలరు.

నాని పుట్టినరోజు పాటల రికార్డింగ్

కింగ్ నాగార్జున, నేచురల్ స్టార్ నాని హీరోలుగా వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం పాటల రికార్డింగ్ నాని పుట్టినరోజు సందర్భంగా మహతి రికార్డింగ్ స్టూడియోలో ప్రారంభమైంది. గతంలో వైజయంతి మూవీస్ బేనర్‌లో ఆఖరిపోరాటం, ఆజాద్, రావోయి చందమామ వంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలు చేసిన కింగ్ నాగార్జున మరోసారి వైజయంతి బేనర్‌లో ఈ మల్టీస్టారర్ చేస్తున్నారు. నేచురల్ స్టార్ నాని మొదటిసారి ఈ బేనర్‌లో నటిస్తున్నారు. గతంలో అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ ఎన్నో మల్టీస్టారర్స్ చేశారు. ఇప్పుడు కింగ్ నాగార్జున, నేచురల్‌స్టార్ నానిలతో ఈ భారీ మల్టీస్టారర్‌ను వైజయంతి మూవీస్ బేనర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా అశ్వనీదత్ మాట్లాడుతూ "నాగార్జున, నాని వెరైటీ కాంబినేషన్‌లో ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్‌తో ఎంటర్‌టైనింగ్ వేలో చాలా భారీగా

ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా బేనర్‌లో వచ్చిన ఎన్నో మల్టీస్టారర్స్‌ని ఆదరించిన ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. మా బేనర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణి శర్మ సంగీత సారథ్యంలో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. మార్చిలో షూటింగ్‌ని స్టార్ట్ చేస్తాం. మిగతా నటీనటుల ఎంపిక జరుగుతోంది" అన్నారు.

దర్శకుడు టి.శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ "నాగార్జునగారు, నాని కాంబినేషన్‌లో సినిమాని డైరెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అందులోనూ వైజయంతి మూవీస్ వంటి పెద్ద బేనర్‌లో సినిమా చేయడం మరింత ఆనందంగా ఉంది. ఇది దర్శకుడుగా నాకు ఓ ప్రెస్టీజియస్ మూవీ అవుతుంది" అన్నారు.

ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు: వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం, కో-డైరెక్టర్: తేజ కాకుమాను, ప్రొడక్షన్ కంట్రోలర్: మోహన్, నిర్మాత: సి.అశ్వనీదత్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: టి.శ్రీరామ్ ఆదిత్య.



సినిమానే ఇంటి పేరు

పేరులోనేముంది అంటారు. పేరులోనే నేముంది. ఫేముంది అంటారు సినీ నటులు. చాలా మంది జాతకరీత్యా పేర్లు మార్చుకుంటే.. కొందరు సంఖ్యాశాస్త్రానికి, న్యూమరాలజీకి అనుగుణంగా తమ పేర్లను మార్చుకుంటారు. అయితే వీరికంటే భిన్నంగా తాము నటించిన మొదటి సినిమా, తమకు బాగా పేరు తెచ్చిన సినిమానే ఇంటిపేరుగా మార్చుకున్న నటులు తెలుగుచలన చిత్ర పరిశ్రమలో లెక్కకు మించిన వారున్నారు. ఈ సినిమా విజయం వల్ల, అవకాశాలు రావడం, అదే పేరు స్థిరపడిపోవడంతో చాలా మంది ఇంటి పేర్లు కూడా తెలియనంతగా సినిమా పేర్లతో ఆయా నటులు ఫేమస్ అయ్యారు. పాతతరం కథానాయికి జానకి షావుకారు జానకిగానే ప్రసిద్ధులయ్యారు. క్లాసికస్ మూవీస్‌లోనూ..బాపు, జంధ్యాల, కె విశ్వనాథ్ సినిమాలలో తప్పనిసరిగా పాత్ర ఉండే రంగారావు సాక్షి సినిమాతో పరిచయం కావడంతో సాక్షి రంగారావుగానే పేరు స్థిరపడిపోయింది. ఇక శుభలేఖ సినిమా తెచ్చిన పేరుతో శుభలేఖ సుధాకర్‌గా టైటిల్ కార్డ్స్‌లోనూ నేటికీ కొనసాగుతున్నారు. అంతకుముందు చాలా సినిమాలు చేసినా, బాహుబలిలో కాలకేయుడి పాత్ర పోషించడం వల్ల బాగా ఫేమస్ కావడంతో తన పేరును బాహుబలి ప్రభాకర్‌గానే పిలిపించుకుంటున్నారు. అవార్డులు, రివార్డులు తెచ్చిపెట్టిన కళ్లు సినిమాలో నటించిన చిదంబరం కళ్లు చిదంబరంగానే మనకు తెరపరిచయం.

మహర్షి సినిమాతో తెరంగేట్రం చేసిన రాఘవ మహర్షి రాఘవగా తన సినీకెరీర్‌ను నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. ఆహుతి సినిమాతో ఫేమస్ అయిన ప్రసాద్ ఆహుతి ప్రసాద్‌గానే టైటిల్స్‌లో స్థానం దక్కించుకున్నారు. సినిమాయే లక్ష్యం, జీవితం, వృత్తిగా కొనసాగిస్తున్న కళాకారులు.. చివరికి తమ ఇంటిపేర్లకు బదులు తమకు విజయాన్నిచ్చి, పేరు తెచ్చిపెట్టిన సినిమా పేర్లనే ఇంటిపేర్లుగా మార్చుకోవడం.. విశేషం.

మిలియన్ మార్క్ అందుకున్న తొలిప్రేమ



వరుణ్ తేజ్, రాశిఖన్నా హీరో హీరోయిన్లుగా నటించిన తొలిప్రేమ సినిమా విదేశాల్లో మరో ఘనత సాధించింది. ఈ సినిమాకు అక్కడ 10 లక్షల డాలర్లు వచ్చాయి. బ్యాక్ టు బ్యాక్ మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరిన హీరోగా వరుణ్ తేజ్ రికార్డు సృష్టించాడు. ఈ హీరో గత సినిమా ఫిదా కూడా మిలియన్ డాలర్ క్లబ్ లోకి చేరింది. మరోవైపు తన తొలి సినిమాతోనే ఓవర్సీస్‌లో మిలియన్ డాలర్ క్లబ్ లోకి చేరిన దర్శకుడిగా వెంకీ అట్లూరి రికార్డు సృష్టించాడు. ఈ క్లబ్ లో చాలా తక్కువమంది దర్శకులు మాత్రమే ఉన్నారు. ఈ సినిమా విదేశాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నడుస్తోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమాకు తమన్ సంగీతం అందించాడు

రంగస్థలం ఆఖరి షెడ్యూల్ ప్రారంభం



రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న రంగస్థలం సినిమా ఆఖరి షెడ్యూల్ మొదలైంది. ఇది జస్ట్ ప్యాచ్ వర్క్ మాత్రమే. సినిమాకు సంబంధించి 4 రోజుల పాటు చిన్నచిన్న సన్నివేశాలు తీయబోతున్నారు. దీంతో రంగస్థలం సినిమాకు సంబంధించి షూటింగ్ పూర్తి అయిపోతుంది. మూవీకి సంబంధించి ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొదలైంది. ఆడియోను దశలవారీగా సోషల్ మీడియాలో రిలీజ్ చేస్తున్నారు. మార్చి 3న టోటల్ జూక్ బాక్స్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ఇక ప్రీ-రిలీజ్ ఫంక్షన్ ను మార్చి 15న విశాఖలో భారీఎత్తున నిర్వహించనున్నారు. సినిమాను మార్చి 30న థియేటర్లలోకి తీసుకొస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్‌తో 1985 నాటి పరిస్థితుల్ని ప్రతిబింబించేలా, అప్పటి స్టోరీలైన్‌తో ఈ సినిమా తెరకెక్కింది. సమంత హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ఆది పినిశెట్టి, అనసూయ కీలక పాత్రలు పోషించారు.

వరుణ్ తేజ్ కొత్త సినిమా అహం బ్రహ్మాస్మి

ఘాజీ అనే వార్ మూవీతో దర్శకుడిగా పరిచయమైయ్యాడు సంకల్ప్. 1971లో ఇండియా, పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధ నేపథ్యంలో అండర్‌వాటర్‌లో జరిగిన యుద్ధ కథాంశమే ఘాజీ సినిమా. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదలైన ఈ సినిమాలో రానా ప్రధాన పాత్రలో నటించాడు. సంకల్ప్‌కు దర్శకుడిగా చాలా మంచి పేరు వచ్చింది. అయితే సంకల్ప్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ స్టార్ట్ చేయడానికి సమయం తీసుకున్నాడు. ఓ సైంటిఫిక్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో సంకల్ప్ తన సెకండ్ మూవీని వరుణ్ తేజ్‌తో తెరకెక్కించనున్నాడు. వరుణ్ కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందనున్న ఈ సినిమాకు అహం బ్రహ్మాస్మి అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

విశాలాంధ్ర సినిమా

మార్చి 1న కాలా టీజర్

రజనీకాంత్ కొత్త చిత్రం కాలా కు సంబంధించి ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే విడుదల తేదీ ప్రకటించిన మేకర్స్.. ఇప్పుడు టీజర్ రిలీజ్ డేట్ కూడా ఎనౌన్స్ చేశారు. మార్చి 1న కాలా టీజర్ రాబోతోంది. మాఫియా డాన్‌గా రజనీకాంత్ నటించిన సినిమా కాలా. గతంలో సూపర్ స్టార్‌తో కబాలి సినిమాను తెరకెక్కించిన పా రంజిత్ ఈ సినిమాకు దర్శకుడు.

రజనీకాంత్ అల్లుడు ధనుష్, తన సొంత ప్రొడక్షన్ కంపెనీపై నిర్మించిన చిత్రమిది. రజనీ సరసన హుమా ఖురేషీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో నానా పటేకర్ విలన్‌గా కనిపించనున్నారు. ఏప్రిల్ 27న కాలా సినిమా ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి విడుదల కానుంది. తెలుగులో ఈ సినిమాను ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్ రిలీజ్ చేస్తున్నారు.

దేశదిమ్మరి కోసం గాయకుడిగా తనీష్



యంగ్ హీరో తనీష్ దేశదిమ్మరిగా ముస్తాబౌతున్నాడు. సవీన క్రియేషన్స్ పతాకంపై నగేష్ నారదాసి సారథ్యంలో తెరకెక్కుతున్న దేశదిమ్మరిలో తనీష్‌కు జోడీగా షరీన్ హీరోయిన్‌గా నటిస్తోంది. సమ్మర్ కానుకగా మార్చి నెలలో విడుదలకు ముస్తాబవుతున్న ఈ చిత్రం తాజాగా డబ్బింగ్ పూర్తిచేసుకుంది. ఈ చిత్రంతో తనీష్ తనలోని గాయకుడిని మనకు పరిచయం చేస్తున్నాడు. హే పైసా అంటూ డబ్బుపై వచ్చే ఓ సెటైరికల్ సాంగ్‌ని తనీష్ స్వయంగా ఆలపించాడు. ఈ చిత్రాన్ని పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, సిమ్లా వంటి అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించారు. దేశదిమ్మరి చిత్రానికి సుభాష్ ఆనంద్ అందించిన సంగీతం, ప్రదీష్ ఆంటోని కొరియోగ్రఫీ రెండు హైలైట్‌గా ఉంటాయని చిత్ర దర్శకుడు నగేష్ నారదాసి చెప్పారు. ఈ చిత్రానికి నందమూరి హరి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించగా, మల్లిఖార్జున్ సినిమాటోగ్రఫీని అందించారు. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని అంటోంది యూనిట్.

కల్యాణ్ రామ్ చిత్రంలో తండ్రి సోదరుడు



అక్కినేని మల్టీస్టారర్ 'మనం' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని దక్కించుకుంది. ఇప్పుడు నందమూరి ఫ్యామిలీ మల్టీస్టారర్ తెరకెక్కనుందని వార్తలు వినపడుతున్నాయి. వివరాల్లోకెళ్తే.. కల్యాణ్ రామ్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఫ్యాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో కల్యాణ్ రామ్ తండ్రి హరికృష్ణ, సోదరుడు తారక్ నటించబోతున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రాన్ని కల్యాణ్ రామ్ తన స్వంత బ్యానర్‌లో నిర్మించబోతున్నాడట. మరి దీనిపై కల్యాణ్ రామ్ అండ్ టీం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఒకవేళ అన్ని అనుకున్నట్లే కుదిరితే త్వరలోనే నందమూరి వారి మల్టీస్టారర్ చూసేయొచ్చు.

ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతం



షిల్లాంగ్ : మేఘాలయలో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో కరుడుగట్టిన ఉగ్రవాది, గారో నేషనల్ లిబర్టీ ఆర్మీ(జీఎన్ఎల్ఏ) చీఫ్‌గా చెప్పుకుంటున్న సోహన్ డి షిరా చనిపోయాడు. మేఘాలయలోని ఈస్టు గారో హిల్స్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఎన్‌సీపీ అభ్యర్థి జోనాథోన్ ఎన్.సంగ్మాను ఫిబ్రవరి 18న జీఎన్ఎల్ఏ ఉగ్రవాదులు బాంబుదాడి చేసి హతమార్చారు. జోనాథోన్ తలపై ఇప్పటికే ప్రభుత్వం రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. సంగ్మా హత్యతో భద్రతా దళాలు దక్షిణ, తూర్పు గారో హిల్స్ జిల్లాల్లో గాలింపును ముమ్మరం చేశాయి. అణువణువూ వేటాడాయి. ఎన్నికల సమయంలో ఉగ్రవాదుల ఏరివేత కార్యకలాపాలు ముమ్మ రమయ్యాయి. దోబు ప్రాంతంలో జీఎన్ఎల్ఏ ఉగ్రవాదులు ఉన్నట్టు సమాచారం అందడంతో భద్రతా దళాలు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నాయని ఆపరేషన్‌లో పాల్గొన్న సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. దోబు సమీపంలోని అచక్‌పెక్ గ్రామంలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని ఆయన చెప్పారు. ఈ ఎన్‌కౌంటరులో సోహన్ మరణించాడని తెలిపారు. ఈస్టు గారోహిల్స్ జిల్లాలో ఫిబ్రవరి 18న ఉగ్రవాదుల బాంబుదాడిలో ఎన్‌సీపీ అభ్యర్థి జొనాథోన్, మరో ముగ్గురు కార్యకర్తలు చనిపోయారు.

మెవానీ హత్యకు ఖాకీల కుట్ర..!



అహ్మదాబాద్ : తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు గుజరాత్ పోలీసులు కుట్ర చేస్తున్నారని వడ్గాం ఎమ్మెల్యే, దళిత నేత జిగేష్ మేవాని తెలిపారు. ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు.. తనను ఎలా చంపాలని ప్లాన్ చేస్తున్నారని జిగేష్ వెల్లడించారు. పోలీసుల కుట్రపై గుజరాత్ డీజీపీ, ఆ రాష్ట్ర హోంమంత్రికి ఫిర్యాదు చేసినట్లు దళిత నేత తెలిపారు. తనకు పోలీసుల నుంచి ప్రాణహాని ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కర్ణాటకలో బీజేపీకి వ్యతిరేకంగా ఏప్రిల్ నెలలో ప్రచారం చేస్తానని జిగేష్ మేవాని ప్రకటించిన విషయం తెలిసిందే. కర్ణాటక రాష్ట్రంలో 20 శాతం దళితులు ఉన్నారని.. దళితుల ఒక్క ఓటు కూడా బీజేపీ పడకుండా ప్రచారం చేస్తానని చెప్పిన సంగతి తెలిసిందే.

విశాలాంధ్ర

9

విజయవాడ

ఆదివారం

25 ఫిబ్రవరి 2018

నేషనల్ హెరాల్డ్ ఎడిటర్ ఇన్ చీఫ్ కన్నుమూత..!



చెన్నై: సీనియర్ జర్నలిస్ట్, నేషనల్ హెరాల్డ్ ఎడిటర్ ఇన్ చీఫ్ నీలబ్ మిశ్రా శనివారం కన్ను మూశారు. చెన్నైలోని అపోలో హాస్పటల్‌లో ఆయన తుది శ్వాస విడిచారు. కాలేయ సంబంధిత వ్యాధితో ఆయన గత కొన్నాళ్లుగా బాధపడుతున్నారు. ఆయన వయసు 57 ఏళ్లు. నేషనల్ హెరాల్డ్ పత్రిక రీలాంచ్ సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. సత్యం కోసం పోరాటం చేసిన వ్యక్తి ఆయన అని రాహుల్ కీర్తించారు.

ఆప్ ఎమ్మెల్యేల పిటిషన్ వెనక్కి

న్యూఢిల్లీ : లాభదాయక పదవులపై విచారణ జరపాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను 20 మంది ఆప్ శాసనసభ్యులు వెనక్కి తీసుకున్నారు. లాభదాయక పదవులకు సంబం ధించి తమకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారణను కొనసాగిం చాలన్న ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆప్ ఎమ్మెల్యేలు ఆగస్టులో హైకోర్టునయి ఆశ్రయించారు. ఇప్పుడు ఆ పిటిషన్‌ను కోర్టు నుంచి వెనక్కి తీసుకున్నారు. పార్లమెంటరీ కార్యదర్శులుగా తమ నియామ కాన్ని హైకోర్టు ఓసారి పక్కన పెట్టిన తర్వాత ఈ అంశంపై ఎన్నికల కమిషన్ విచారణ చేయాల్సిన అవసరం లేదని ఆప్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. తాము ఇంతకుముందు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుం టున్నామని జస్టిస్ రేఖా పిల్లికి విన్నవిం చుకున్నారు. తమ అనర్హతపై పిటిషన్ హైకోర్టు విస్తృత ధర్మాసనం ముందు ఉన్నందున దానిని వెనక్కి తీసుకుంటున్నామని ఆ ఎమ్మెల్యేలు వివరించారు.

ఏడేళ్లుగా కళ్లు మూసుకున్నారా..?

పీఎన్‌బీ అధికారులకు మళ్లీ జైట్లీ ప్రశ్న



ఢిల్లీ: ఏడేళ్ల నుంచి ఒక బ్యాంకు శాఖలో మోసం జరుగుతుంటే ఎందుకని గుర్తించలేకపోయారని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) అధికారులను ప్రశ్నించారు. రూ.11,400కోట్ల కుంభకోణం గురించి ఆయన మరోసారి మాట్లాడారు. పీఎన్‌బీలో జరిగిన మోసాన్ని గుర్తించడంలో బ్యాంకింగ్ నియంత్రణదారులు విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు.

ఈటీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ పీఎన్‌బీ కుంభకోణం గురించి ప్రస్తావించారు. బ్యాంక్‌లో మోసం జరుగుతుంటే కనీసం ఒక్క ఉద్యోగి కూడా హెచ్చరించలేదు. ఆడిటర్లు మొక్కుబడిగా తమ విధులు నిర్వర్తించినట్లు తెలుస్తోంది. బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్ దీనిపై దృష్టి సారించకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది' అని జైట్లీ అభిప్రాయపడ్డారు. ఏడేళ్లుగా బ్యాంక్‌లో మోసం జరుగుతుంటే.. ఆడిటర్లు ఎందుకని గుర్తించలేకపోయారని ఆయన ప్రశ్నించారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వాళ్లను ప్రభుత్వం ఎంతమాత్రం విడిచిపెట్టబోదని, వారిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తుందని మరోసారి పునరుద్ఘాటించారు. మోసాలు జరగకుండా ఎప్పటికప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బ్యాంకులకు రుణాలు ఎగవేసే వారిని కఠినంగా శిక్షించేందుకు అవసరమైతే చట్టంలో కొన్ని మార్పులు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దాదాపు రూ.11,400కోట్ల మేర మోసానికి పాల్పడిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారిస్తున్నారు.

సెల్యూట్...ఆర్మీ మేజర్

బిడ్డను ఎత్తుకొని భర్త అంత్యక్రియలకు..





ఢిల్లీ: మనకు ఇష్టమైన వ్యక్తులు దూరమైతే ఆ బాధను భరించడం చాలా కష్టం. కానీ అటువంటి పరిస్థితుల్లో కూడా ఆమె తన వృత్తి ధర్మాన్ని మరువలేదు. విమానం కూలిన ఘటనలో మృతి చెందిన తన భర్త అంత్యక్రియలకు తన ఐదు రోజుల చిన్నారిని ఎత్తుకొని వచ్చి విధుల్లో పాల్గొంది. ఆమె మేజర్ కుముద్ దోగ్రా. ఈ దృశ్యం అక్కడి వారి హృదయాలను కలిచివేసింది. బిడ్డను ఎత్తుకొని ఆమె మార్చ్‌లో పాల్గొని.. తన భర్తకు నివాళులర్పించింది. ఈనెల 15న అసోంలో ఐఏఎఫ్‌కు చెందిన మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో దోగ్రా భర్త వింగ్ కమాండర్ డి.వాట్స్ కూడా ఉన్నారు. విమానాన్ని ల్యాండ్ చేసే సమయంలో అది అదుపు తప్పి ఒక్కసారిగా కూలిపోయి మంటలు రావడంతో అందులో ఉన్న ఇద్దరు పైలెట్లు అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం వింగ్ కమాండర్ డి.వాట్స్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడికి ఆయన భార్య ఆర్మీ యూనిఫాంలో తన ఐదురోజుల కుమార్తెను ఎత్తుకొని వచ్చారు. తన భర్తకు నివాళులర్పించి మార్చ్‌లో బిడ్డతో పాటే పాల్గొన్నారు. భర్త మరణాన్ని దిగమింగుకొని ఆమె తన విధుల పట్ల చూపించిన నిబద్ధతను అక్కడి వారందరూ ప్రశంసిస్తున్నారు.

బోధ్ గయా పేలుడు కేసులో తీవ్రవాది అరెస్టు

కోల్‌కతా : బోధ్ గయా (బీహార్) పట్టణంలో జనవరి 19న జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి నూర్ ఆలం అనే యువకుడిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ముషీరాబాద్ జిల్లా ధులియాన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిని జమాతుల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జెఎంబి) తీవ్రవాద సంస్థ సభ్యుడిగా అనుమానిస్తున్నారు. ఆలం తోపాటు మరో నలుగురు జెఎంబి సభ్యులు నవంబరులో జెఎంబి సీనియర్ నాయకులను కలిసేందుకు నవంబరులో హైదరాబాద్ సందర్శించినట్లు ప్రాథమిక సమాచారం. ఆలంకు బట్టల వ్యాపారం ఉందని, ఇటీవలే ఇస్లామిక్ సాహిత్యం విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'గో ఎయిర్' విమానం అత్యవసర ల్యాండింగ్

జమ్మూ : ఢిల్లీ-లెహ్-జమ్మూ మధ్య ప్రయాణించే 'గో ఎయిర్' విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో పైలెట్ అత్యవసరంగా కిందకు దించాల్సి వచ్చింది. లడఖ్ ప్రాంతంలోని లెహ్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన విమానం పది నిమిషాలలో వెనక్కు తిరిగి వచ్చి సురక్షితంగా ల్యాండ్ అయింది. దీనిలో ప్రయాణిస్తున్న 112మంది, సిబ్బంది క్షేమంగా ఉన్నట్లు గో ఎయిర్ అధికారి తెలిపారు.ప్రయాణికులను ఇతర విమానాల్లో గమ్య స్థానాలకు పంపుతున్నట్లు వివరిం చారు. విమాన మరమ్మతులకు ఢిల్లీ నుంచి ఇంజనీర్లు వస్తున్నట్లు చెప్పారు.

పాక్ కాల్పులను తిప్పి కొట్టిన భారత్

శ్రీనగర్ : జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం బారాముల్లా జిల్లా యురి సెక్టర్ వద్ద ఎల్‌ఓసీ వెంబడి భారత సైనిక శిబిరాలను లక్ష్యం చేసుకొని పాకిస్తాన్ సైనికులు శనివారం మధ్యాహ్న సమయంలో కాల్పులు జరిపారు. పాక్ దళాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి రెచ్చగొట్టే విధంగా కాల్పులకు ప్పాలడగా, సమర్థంగా తిప్పి కొట్టినట్లు భారత సైనికాధికారి తెలిపారు. పాక్ వైపు మృతులకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

గిరిజనుడి హత్యపై వివరణ కోరిన కేంద్రం

తిరువనంతపురం : పలక్కడ్ జిల్లా అగలిలో షాపుల నుంచి వస్తువులు దొంగిలిస్తున్నాడని ఆరోపిస్తూ ఓ గిరిజనుడిని తీవ్రంగా కొట్టి చంపిన ఘటనపై నివేదిక సమర్పించాల్సిందిగా కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జువల్ ఓరామ్ కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై వివరణ కోరినట్లు మంత్రి ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ చెప్పారు. హత్య గురైన గిరిజన యువకుడు మధు కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేయాల్సిందిగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఈ ఘటనపై మన్నార్‌కాడ్ తాలూకాలో ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు శనివారం హర్తాళ్ నిర్వహించాయి.

రైఫిల్ పేలి పోలీస్ అధికారికి గాయాలు

శ్రీనగర్ : సర్వీస్ రైఫిల్ పేలిన ఘటనలో ఓ పోలీస్ కానిస్టేబుల్ గాయాల పాలయ్యాడు. ప్రత్యేక పోలీస్ అధికారి (ఎస్‌పిఓ)గా పనిచేస్తున్న మహమ్మద్ అమిర్ దక్షిణ కాశ్మీర్ పరిధిలోని షోపైన్ జిల్లా జైనపురా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా దురదృష్టవశాత్తు సర్వీస్ రైఫిల్ పేలినట్లు స్టేషన్ పోలీస్ అధికారి వెల్లడించారు. గాయపడ్డ అమిర్‌ను ఆస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

యూపీఏ హయాంలో ఉత్తమ దశాబ్ద కాల వృద్ధి : చిదంబరం

న్యూఢిల్లీ : కేంద్రంలో యూపీఏ పదేళ్ల పాలన కాలంలోనే ఉత్తమ దశాబ్ద కాల వృద్ధి నమోదైందని కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం పేర్కొన్నారు. ప్రపంచ వ్యాపార సదస్సులో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఆయన ట్విట్టర్ ద్వారా పైవిధంగా స్పందించారు. యూపీఏ అధికారంలో ఉన్న 2004-2014 మధ్య కాలంలో దాలర్లలో జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి) మూడు రెట్లు , రూపాయల్లో నాలుగు రెట్లు పెరిగిందని వివరించారు. ఎకనమిక్ టైమ్స్ శుక్రవారం నిర్వహించిన ఈ సదస్సు లో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు.

మహారాష్ట్ర మంత్రి కారుపై దాడి

ముంబై : మహారాష్ట్ర మంత్రి సదాభాహు ఖోటే కారుపై శనివారం తెల్లవారుజామున సోలాపూర్ జిల్లాలోని రైదోర్ గ్రామం వద్ద తన మాతృ సంస్థ స్వాభిమాన్ షెట్కారీ సంఘటన్(ఎస్ఎస్ఎస్)కి చెందిన మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఖోటే తాను కొత్తగా ఏర్పాటు చేసిన పార్టీ రైతు క్రాంతి సంఘటనకు చెందిన మద్దతుదారులతో సమావేశమయ్యేందుకు జిల్లాలోని బార్షికి వెళుతుండగా ఈ సంఘటన జరిగినట్లు పోలీసు అధికారులు తెలిపారు. రైదోర్ వద్ద ఎస్ఎస్ఎస్ మద్దతుదారులుగా ఆరోపిస్తున్న కొంతమంది ఇనుప రాడ్లతో మంత్రి కారుపై దాడికి పాల్పడినట్లు వివరించారు. కారు ధ్వంసమైనప్పటికీ, ఎవరూ గాయపడలేదు. ఈ ఘటనకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారి చెప్పారు.

అధికారంలోకి వస్తే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తాం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ



తికోటా(కర్ణాటక) : కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును తమ పార్టీ ఆమోదిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికలలో ఎక్కువ మంది మహిళా ఆశావాహులకు టికెట్లు ఇవ్వాలని కర్ణాటక పార్టీ విభాగాన్ని రాహుల్ కోరారు. 'పంచాయతీ రాజ్‌లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే విష యమై మేము పని చేస్తున్నాం. బీజేపీ ఇప్పటి వరకు అమలు చేయని మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడమే మా లక్ష్యం' అని రాహుల్ న్నారు. 'స్త్రీ శక్తి సమావేశ' కార్యక్రమాన్ని ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తూ, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, రాజ్యసభ, లోకసభలలో మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకువస్తామని చెప్పారు. 'రాజకీయాల్లో, విధాన సభలో, రాజ్యసభ, లోకసభలలో, కేబినెట్‌లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలి. దేశం ప్రతి మూలన వారి గొంతుకు వినపడాలి' అని ఆయన పేర్కొన్నారు.

పేలిన పెళ్లికానుక

వరుడి మృతి : ప్రాణాపాయ స్థితిలో వధువు

భువనేశ్వర్ : కొత్తగా పెళ్లైన యువకుడు తనకు వచ్చిన పెళ్లి కానుక కారణంగానే ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన ఒడిశాలోని బొలాంగిర్ జిల్లాలో చోటుచేసు కుంది. ఈ ప్రమాదంలో పెళ్లికొడుకుతో పాటు అతడి బామ్మ కూడా చనిపోయింది. వధువు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీసులు వెల్లడించారు. అయిదు రోజుల క్రితం వారి పెళ్లి జరగ్గా, ఫిబ్రవరి 21న జరిగిన వివాహ రిసెప్షన్‌లో గుర్తుతెలియని వ్యక్తి నూతన దంపతులకు పెళ్లి కానుకగా ఒక పార్సిల్ ఇచ్చాడు. శుక్రవారం వారు ఇంట్లో ఆ పార్సిల్‌ను తెరిచారు. తెరిచిన వెంటనే అది పేలింది. దీంతో అక్కడ ఉన్న వరుడు, వధువు, వారి బామ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. వరుడు, అతడి బామ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తీవ్రంగా గాయపడిన వధువు బుర్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ప్రతాన్‌గఢ్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సెసాదేవ బరిహా తెలిపారు. ఆ పెళ్లికానుక ఇచ్చిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

చోక్సీ కూడా జీతాలు ఇవ్వలేడట..

ఉద్యోగులను బుజ్జగిస్తూ లేఖ



ఢిల్లీ: భారీ మోసాలకు పాల్పడిన గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ తన సంస్థలోని ఉద్యోగులకు లేఖ రాశారు. తాను ఏ తప్పు చేయలేదని అందులో పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400కోట్ల భారీ కుంభకోణంలో నీరవ్ మోడీతో పాటు అతడి మామ అయిన ఛోక్సీకి కూడా సంబంధం ఉంది. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని తన న్యాయవాది సంజయ్ అబాట్ ద్వారా లేఖ విడుదల చేశారు. 'విధిని నేను ఎదుర్కొంటాను. నాకు తెలుసు నేను ఏ తప్పు చేయలేదని. చివరికి నిజం బయటపడుతుంది' అని లేఖలో పేర్కొన్నారు.అలాగే తన సంస్థలో పనిచేస్తున్న 3,500 మంది ఉద్యోగులకు ఇక తాను జీతాలు చెల్లించలేనని తేల్చి చెప్పేశారు. దర్యాప్తు అధికారులు తన బ్యాంకు ఖాతాలు, ఆస్తులు సీజ్ చేసినందున నిస్సహాయ స్థితిలో ఉన్నానని వేతనాలు ఇవ్వలేనని చెప్పారు. ప్రస్తుతం తన కంపెనీ విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఎప్పుడు పరిస్థితి చక్కబడుతుందో చెప్పలేమని, వేరే ఉద్యోగాలు చూసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. విచారణ న్యాయంగా జరగట్లేదని ఆరోపించారు. జీతాల బకాయిలు చెల్లించే వరకు కంపెనీ ఇచ్చిన ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్ ఉద్యోగులు తమ వద్దే ఉంచుకోవచ్చని స్పష్టంచేశారు. ఉద్యోగులకు రిలీవింగ్ లెటర్స్, ఎక్స్‌పీరియన్స్ లెటర్స్ అందజేస్తామని చెప్పారు. రెండు రోజుల క్రితం గీతాంజలి జెమ్స్ ఉద్యోగులు తమ జీతాల బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన చేశారు. నీరవ్ మోడీ కూడా ఇదే తరహాలో తన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేను, వేరే ఉద్యోగాలు చూసుకోండి అంటూ లేఖ రాసిన సంగతి తెలిసిందే.

జయలలిత కాంస్య విగ్రహావిష్కరణ

అన్నాడీఎంకే అధికార దినపత్రిక ప్రారంభం

చెన్నై : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జె.జయలలిత 70వ జయంతిని పురస్కరించుకుని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏఐఏడీఎంకె అధికార తమిళ దిన పత్రికను, జయలలిత విగ్రహాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి కె.పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి ఒ.పన్నీరుసెల్వంలు జయలలిత కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే పార్టీ అధికార తమిళ దినపత్రిక 'నమ్మదు పురచ్చి తలైవి అమ్మ' పేరుతో ప్రారంభించారు. కాగా అంతకుముందు జయలలిత ఏఐఏడీఎంకె అధికార తమిళ దినపత్రిక 'డాక్టర్ నమ్మదు ఎంజీఆర్'ను స్థాపించారు. ఇదిలాఉండగా, జయలలిత జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జయ విగ్రహావిష్కరణ పురస్కరించుకుని పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అయితే టి.టి.వి.దినకరన్ ఆధ్వర్యంలో కూడా జయలలిత జయంతి కార్యక్రమాలు జరిగాయి. తిరునల్వేలి జిల్లాలోని అంబసముద్రం ప్రభుత్వాస్పత్రిలో శనివారం పుట్టిన ఆడ శిశువులకు బంగారపు ఉంగరాలు పంపిణీ చేశారు.

దేశ సంపద లూటీ

- కాంగ్రెస్ బాటలోనే ఎన్‌డీఏ
- పెట్టుబడిదారుల కోసమే మోడీ నిర్ణయాలు
- బొగ్గు గనుల ప్రైవేటీకరణ వారి కోసమే...
- మాయావతి విమర్శ



లక్నో : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ నరేంద్రమోడీ ప్రభుత్వంపై విమర్శల దాడి తీవ్రతరమవుతోంది. బీఎస్‌పీ అధినేత్రి మాయావతి ఇటీవల వరుసగా మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ప్రముఖ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని మాయావతి ఆరోపించారు. అందులో భాగంగానే బొగ్గు గనులను వరుసబెట్టి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని ఆమె అన్నారు. బొగ్గు గనుల వ్యవహారంపై ఆందోళన వ్యక్తంచేస్తూ..బడా పెట్టుబడిదారులు ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పెద్దఎత్తున రుణాలు తీసుకొని దేశం వదిలిపారిపోయే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే పంజాబ్ నేషనల్ బ్యాంకును ముంచిన నీరవ్ మోడీ విదేశాలకు వెళ్లిపోయారని గుర్తుచేశారు. జాతీయ సంపద బొగ్గు వంటి కీలకమైన రంగాన్ని ప్రైవేటీకరించడాన్ని మాయావతి తప్పుబట్టారు. ఇందుకు మోడీ ప్రభుత్వం చెబుతున్న కారణాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడేందుకే కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిర్ణయాలు తీసుకుంటున్నదని, పేదలు, అట్టడుగువర్గాలకు మంచి రోజులు తెస్తానన్న హామీ పరిపూర్తి కాలేదని బీఎస్‌పీ అధినేత్రి ఆరోపించారు. వాణిజ్య వినియోగం కోసం బొగ్గు గనులను ప్రైవేటురంగానికి కట్టబెట్టడానికి కేంద్రం ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరించింది. 1973లో బొగ్గు గనుల జాతీయీకరణ నాటి నుంచి ఈ రంగంలో ఇదే అతిపెద్ద సంస్కరణ. ప్రైవేటు వ్యక్తులు, అంతర్జాతీయ బొగ్గు కంపెనీలకు గనులను ఈ ఆక్షన్ ద్వారా అమ్మకాలు జరుగనున్నాయి. కీలకమైన అన్ని రంగాలను ప్రైవేటీకరించడానికి ప్రధాని నరేంద్రమోడీ రహస్య అజెండాను అమలు చేస్తున్నారని మాయావతి విమర్శించారు. ఇది ప్రైవేటీకరణ వ్యవస్థకు, జాతీయ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఆమె స్పష్టంచేశారు. జాతీయ సంపదను ప్రైవేటు కంపెనీలు ఎలా దోచుకుంటున్నాయో యావత్‌దేశం చూస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కళ్లూ, చెవులూ మూసుకున్నదని అన్నారు. ఆర్థికరంగంలో అరాచక, ఆటవిక రాజ్యం కొనసాగుతోందని మాయావతి ఘాటుగా వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల తర్వాత మోడీ ప్రభుత్వం గురించి ఆలోచిస్తే..దీనికీ, కాంగ్రెస్ ప్రభుత్వానికీ పెద్ద తేడా ఏమీ లేదని అన్నారు. జాతీయ సంపదను దోచుకోవడం, దోచిపెట్టడంలో రెండూ ఒకటేనని ఆమె అన్నారు.

సేలంలో 26 మంది రౌడీల అరెస్టు

సేలం(తమిళనాడు) : తమిళనాడు పోలీసులు నేరగాళ్లపై ఉక్కుపాదం మోపారు. శుక్రవారం నుంచి నగరంలోని మొత్తం 72 మంది రౌడీలకుగాను 26 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఏడుగురు కరడుగట్టిన నేరస్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా తాము పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిసిన తర్వాత అనేక మంది రౌడీలు అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వివరించారు. డిప్యూటీ పోలీసు కమిషనర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ రౌడీ మూకలపై చర్యలు కొనసాగుతాయన్నారు. ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు ముప్పుగా మారిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీల నుంచి ఎటువంటి బెదిరింపులు వచ్చినా పోలీసు కమిషనరేట్‌కు సమాచారం అందించాలని ప్రజలను ఆమె కోరారు.

సోనియా రాయబరేలీ పర్యటన రద్దు

రాయ్‌బరేలీ(ఉత్తరప్రదేశ్) : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాయ్‌బరేలీ ఎంపీ సోనియాగాంధీ తన నియోజకవర్గంలో ఒక రోజు పర్యటన అనివార్య కారణాల వల్ల శనివారం రద్దయ్యింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు ఆమె తరపు ప్రతినిధి కె.ఎల్.శర్మ ఇక్కడ తెలిపారు. భూరేమౌ అతిథి గృహం వద్ద శనివారం ఎంపీ నిధుల నుంచి అనేక పథకాలను ఆమె ప్రారంభించాల్సి ఉంది.

టన్ను జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

కొజికోడ్ : జిల్లాలో ఒక లారీ నుంచి సుమారు టన్ను జిలెటిన్ స్టిక్స్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకుని, లారీ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో ముక్కమ్ సమీపంలో తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాన్ని ముక్కమ్ పోలీసుస్టేషన్ ఎస్ఐ అభిలాష్ తనిఖీ చేసి 45 బాక్సుల్లో ఉన్న పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క బాక్సులో 200 జిలెటిన్ స్టిక్స్ ఉన్నాయి. తమిళనాడులోని సేలం నుంచి తీసుకువస్తున్న డ్రైవర్ మాథేష్‌ను పేలుడు పదార్థాల చట్టం వేర్వేరు సెక్షన్ల క్రింద అరెస్టు చేశారు. పేలుడు పదార్థాల రవాణాకు సంబంధించి డాక్యుమెంట్లను చూపించడంలో డ్రైవర్ విఫలమయ్యాడని పోలీసులు తెలిపారు.

2022 నాటికి పేదలందరికీ పక్కా గృహాలు



విశాలాంధ్రప్రతినిధి - అనంతపురము : రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ 2022వ సంవత్సరం నాటికి పక్కా గృహాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామీణ గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. అనంతపురములోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనాభా పెరుగుదలతోపాటు పట్టణీకరణతో నివాస గృహాల కొరత ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిలో 90 శాతం మంది ఇళ్ల కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సరసమైన ధరల్లో ఇళ్లు నిర్మించేలా ఎన్టీఆర్ గ్రామీణ నిర్మాణ పథకం, ఎన్టీఆర్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం, ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకాల ద్వారా అర్హులకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 19 లక్షల ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. గ్రామీణ గృహనిర్మాణ శాఖ ద్వారా 13 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గత అక్టోబర్ 2న గాంధీ జయంతినాడు ప్రపంచ ఆవాస్ దినోత్సవం సందర్భంగా లక్ష గృహప్రవేశాలు చేశామన్నారు. ఈ లక్షతో పాటు మరో లక్షన్నర ఇళ్లు పూర్తి కానున్నాయని, మార్చి నెలాఖరులోపు వీటి గృహప్రవేశం చేస్తామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణ పనులకు ఉద్యమంలా శంకుస్థాపనలు చేయాలన్నారు.

చిన్నారి చెవి పీకేసిన వీధి కుక్కల గుంపు



విశాలాంధ్ర - రెంటచింతల : వీధి కుక్కలు పదునైన పళ్ళతో కసితీరా కాటేస్తూ చిన్నారులను బలి తీసుకుంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా క జనంపై దాడులు చేయడంతో వీధుల్లోకి రావాలంటే పెద్దలు సైతం హడలిపోతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా రెంటచింతల మండలం మెట్టగుడిపాడు గ్రామంలో శనివారం ఉదయం వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపర్చాయి. ఒక స్కూలు టీచర్‌పై విచక్షణరహితంగా దాడిచేశాయి. మూడేళ్ల చిన్నారి బలుగూరి నాగసైదమ్మపై కుక్కలు దాడి చేసి పళ్లతో పీకేయడంతో చిన్నారి ఎడమచెవి సగానికిపైగా తెగి వేలాడటంతో అల్లాడిపోయింది. షేక్ బంగారు అనే నాలుగు సంవత్సరాల చిన్నారి ఛాతీపై కాటేశాయి. మూడేళ్ల ఉప్పు ఈశ్వరి లక్ష్మీకుమారిని, కస్తూర్బా ఉపాధ్యాయురాలు శివలింగమ్మపైనా దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులంతా ఆటలాడుకుంటున్న సమయంలో కుక్కలు దాడిచేయడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలో కుక్కల సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తమ పిల్లల ప్రాణాలమీదకు వచ్చాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో అడవితక్కెళ్ళపాడులో రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన ప్రేమ్ (5)ను ఏడు కుక్కలు లాక్కెళ్లి కరిచి చంపేసిన సమయంలో హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు విశాఖలో రాష్ట్ర గిరిజన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం మున్సిపాలిటీ : పార్లమెంటు సమావేశాల్లో గిరిజన యూనివర్సిటీ బిల్లు ప్రవేశపెట్టాలని, బోయ, వాల్మీకి, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లును ఎంపీలంతా తిరస్కరించాలని కోరుతూ ఆదివారం విశాఖలోని గిరిజన భవన్‌లో రాష్ట్ర స్థాయి గిరిజన సదస్సు నిర్వహిస్తున్నట్లు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలుగు వెంకటరావు శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నిర్వాశితులకు పునరావాస కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాజక్టు పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. ఐక్య ఉద్యమాలకు రూపకల్పన జరుగుతుందని వెంకటరావు వివరించారు.


కాపు, బలిజలకు న్యాయం చేయండి



విశాలాంధ్ర - ఓర్వకల్లు : రాష్ట్రంలోని కాపు, బలిజ జాతిని బీసీ-ఎఫ్‌లో చేర్చి న్యాయం చేయాలని రాష్ట్ర కాపు, బలిజ ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ముద్రగడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో నష్టపోయిన కాపు, బలిజలను రాజకీయ పార్టీ నాయకులు వేళాకోళం చేస్తూ, బాధపెట్టి ఆడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం త్వరలో 50 వేల ఉద్యోగాలు విడుదల చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే కాపు, బలిజ నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అర్హత పొందడానికి బీసీ-ఎఫ్‌లో మార్చి 31 నాటికి చేర్చాలని, దీనికి దరఖాస్తు చేసుకునేందుకు తహశీల్దార్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్‌లో ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నారాయణరెడ్డి, అంగడి శ్రీనివాసులు, పుల్లారెడ్డి, చెన్నా రెడ్డి, గడేకారి ప్రభాకర్, యంగన్న, హోటల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ధరల్లో దళారుల కోత

- అలంకారంగా కొనుగోలు కేంద్రాలు
- నెల్లూరు జిల్లాలో రైతుల దుస్థితి



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. రైతులకు మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. జిల్లాలో సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో 89, ఐకేపీ ఆధ్వర్యంలో 66, జిల్లా మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 13 కలిపి మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ మధ్య సమన్వయలోపం కారణంగా ప్రస్తుతం కేంద్రాలు ఫ్లెక్సీలకే పరిమితం అయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్స్, గోనె సంచులు, తేమశాతం కొలిచే మీటర్లు, వెయింగ్ స్కేలు.. తదితర పరికరాలు లేకపోవడంతో ఆయా సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. సంచులు, పరికరాలు వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేక దళారులకు తెగనమ్ముతున్నారు. దీంతో ధాన్యం వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరల్లో భారీ కోత వేస్తున్నారు. జిలకర మసూరి ధాన్యం ఏ గ్రేడ్ రకం 100 కేజీల బస్తా ధర రూ. 1590, సాధారణ రకం ధర రూ.1550గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. రైతుల పరిస్థితులను అవకాశంగా తీసుకుంటున్న దళారులు బస్తా రూ.300 నుంచి రూ.500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కుటుంబమంతా కాయకష్టం చేసి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు.

మిల్లర్లు వెనుకంజ

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు తరలిస్తుంది. మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ పద్ధతిలో ధాన్యం ఆడించి బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. 2016 సంవత్సరంలో వెలుగుచూసిన అక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. రైస్‌మిల్లులకు ధాన్యం తరలించాలంటే ఆయా మిల్లర్లు విధిగా తీసుకునే ధాన్యానికి సరిపడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి. బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి మిల్లర్లు ముందుకు రాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లుల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు చెల్లింపులోనూ అయోమయం నెలకొంది. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఉచితంగా మిల్లులకు చేర్చుతుంది. ఈ ఖర్చును తొలుత రైతులు భరిస్తే ఆ తర్వాత వారికి చెల్లిస్తారు. వీటి రవాణా కోసం వాహనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక కాంట్రాక్టర్‌ను నియమిస్తుంది. గత ఏడాది రైతులకు సక్రమంగా నగదు చెల్లించకపోవడంతో రైతులే రవాణా వ్యయం భరించారు. ట్రాక్టర్లతో ధాన్యాన్ని రైతులు మిల్లుల వద్దకు తీసుకెళ్లినా మిల్లర్లు స్పందించకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వకుండా పథకం ప్రకారమే వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో రైతులు గత్యంతరం లేక దళారులు, వ్యాపారులు, మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయిస్తారు. మిల్లర్లే కొన్నిచోట్ల దళారుల అవతారం ఎత్తుతున్నారు. గ్యారంటీ చూపకపోతే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయవచ్చని, గ్యారంటీ లేకుండా అధికారులే ధాన్యాన్ని పంపిస్తారనే ఆలోచనలో మిల్లర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

16 మంది మిల్లర్లే బ్యాంకు గ్యారంటీ

జిల్లాలో 250 రైస్ మిల్లులు ఉన్నప్పటికీ 16 మంది రైస్ మిల్లర్లు మాత్రం 8 కోట్ల 61 లక్షల రూపాయల బ్యాంకు గ్యారంటీ ఇచ్చారు. కడపకు చెందిన మరో ఆరుగురు మిల్లర్లు రూ. 7 కోట్లు గ్యారంటీలు ఇచ్చారు. సీఎంఆర్ బకాయిలున్న రైస్ మిల్లర్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఒక్క గింజ కూడా వెళ్లడానికి వీల్లేదని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు.

జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడంతో సుమారు 20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వృద్ధురాలు సజీవ దహనం

విశాలాంధ్ర - హిరమండలం/కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ వృద్ధురాలు సజీవ దహనమైంది. ఈ ఘటనతో పారాపురంలో విషాధఛాయలు అలముకున్నాయి. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం పారాపురంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఆ పక్కనే ఉన్న మిగిలిన 4 ఇళ్ళకు అంటుకోవడంతో అయిదు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంచంపై ఎటూ కదలలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు రీసి శాంతమ్మ ఇంటి నుండి బయటకు రాలేక మంటల్లోనే సజీవ దహనమైంది. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ రెడ్డి శాంతి శనివారం ఘటనా స్థలికి చేరుకొని బాధితులను, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అగ్నికి ఆహుతైన ఇళ్లకు గాను పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.



భారీగా ఎర్రచందనం పట్టివేత

విశాలాంధ్ర - పీలేరు : చిత్తూరు జిల్లాలోని పీలేరు-కడప జాతీయ రహదారిలో దుర్గంపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో శనివారం భారీ స్థాయిలో ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీలేరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద అడిషనల్ ఎస్పీ రాధిక పర్యవేక్షణలో పీలేరు అర్బన్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐ పీవీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు ఎస్టీఎఫ్ సిబ్బంది, పీలేరు అదనపు ఎస్ఐ సుమన్ సిబ్బంది తనిఖీ చేశారు. కడప నుంచి వస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ వేగంగా వెళ్ళిపోవడంతో పోలీసులు వెంబడించారు. లారీని డ్రైవర్ చెట్టును ఢీకొనడంతో లారీలోని కొందరు దిగి పారిపోయారు. వాహనంలోని 100 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వీటి బరువు సుమారు 2960 కిలోలు ఉంటుందని అంచనా వేశారు. కేవీపల్లె మండలం తువ్వపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇండికా విస్టా కారు అతివేగంగా దూసుకెళ్లడంతో పోలీసులు వెంబడించారు. కొత్తపల్లె హరిజనవాడ వద్ద దిగి డ్రైవర్, కొంత మంది వ్యక్తులు పారిపోయారు. దీనిలోని 9 ఎర్రచందనపు దుంగలను కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సీఆర్డీఏ ఓ ల్యాండ్ మాఫియా

- పూలింగ్‌కు భూమి ఇవ్వలేదని కక్ష సాధింపు
- పండలనేని శ్రీమన్నారాయణ



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాజధాని అమరావతి ప్రాంతంలో సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ల్యాండ్ మాఫియాగా రైతులను మోసం చేస్తున్నారని రాజధాని నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసిన పండలనేని శ్రీమన్నారాయణ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ ఇంప్లిమెంట్, సూపర్‌వైజర్ కమిటీలను నియమించిందన్నారు. అవి ఇంతవరకు ఎన్‌జీటీకి రిపోర్టులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్‌జీటీకి వ్యతిరేకంగా సీఆర్‌డీఏ అధికారులు రాత్రికి రాత్రి దొండపాడు, పాలవీడు, కోటివాగు ఏరియాల్లో మురుగునీరు వెళ్లే డ్రెయిన్లను మిషన్లతో పూడ్చివేస్తున్నారన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా ఈ ప్రాంతాల్లో ఎటువంటి పంటలు పండవని ఎన్‌జీటీ వారికి చూపించే ప్రయత్నిస్తున్నారన్నారు. రాజధాని కోసం పూలింగ్ భూములు ఇవ్వని వారి సర్వే నెంబర్లను ఇతర పేర్లతో కలిపి పూలింగ్‌కు ఇచ్చినట్లు సృష్టిస్తున్నారన్నారు. ఇలా మోసపోయిన మందడం గ్రామ రైతు పాతూరి తాతబాబు ఉన్నారన్నారు. తాతబాబు మాట్లాడుతూ మందడంలోని తనకున్న 18 ఎకరాల 56 సెంట్ల భూమిని పూలింగ్‌కు ఇవ్వలేదన్నారు. సీఆర్‌డీఏ అధికారులు తన భూమిలో కొంత ఇతర వ్యక్తులు పూలింగ్‌కు ఇచ్చినట్లు సృష్టించి వారికి కౌలు తరపున రూ. 18 లక్షల చెక్కులు అందజేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులు తన భూమిని వదలకుంటే నిరవధిక నిరాహార దీక్షకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు.

విద్యుత్ తీగలకు ఇద్దరు రైతుల బలి



విశాలాంధ్ర - బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లి మండలం బాలిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు రైతులు శనివారం విద్యుత్‌షాక్‌కు మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల నిర్లక్ష్యానికి రెండు కుటుంబాలు వీధినపడ్డాయి. తంబళ్లపల్లి మండలంలోని దిగువపల్లికి చెందిన రైతులు భూమిరెడ్డి, మద్దిరెడ్డి తమ పొలంలో పంటను అడవి జంతువులు నాశనం చేస్తున్నాయన్న ఆందోళనతో శుక్రవారం రాత్రి పొలం చుట్టూ తీగలు లాగి విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఈ నేపథ్యంలో అదే పంచాయతీకి చెందిన అక్కెమ్మగారిపల్లి గ్రామ రైతులు రామలింగారెడ్డి (45), రాజారెడ్డి (35), సమీప దొడ్డికాడపల్లికి చెందిన రైతు వెంకట్రమణారెడ్డి (55)లను కూడా తమ పొలం వద్దకు రావాలని భూమిరెడ్డి, మద్దిరెడ్డిలు కోరగా, వీరు ముగ్గురూ శుక్రవారం రాత్రి అడవి జంతువులను బెదరగొట్టేందుకు 12 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్ళారు. రాత్రి కావడంతో ఇద్దరు రైతులు వేరుశనగ పొలంలోకి వెళ్లడంతో కరెంట్ షాక్‌తో ఒక్క క్షణంలో ప్రాణాలు కోల్పోయారు. మరో రైతు రాజారెడ్డి గాయాలతో బయటపడ్డారు. వెంటనే తేరుకొని పెద్దగా కేకలు వేయడంతో సమీప రైతులు అక్కడకు చేరుకునే లోపే ప్రాణనష్టం జరిగిపోయింది. ఈ విషయం మండలమంతా వ్యాపించడంతో వేలాదిమంది రైతులు అక్కడకు చేరుకున్నారు. మృతుల్లో రామలింగారెడ్డికి భార్య సులోచన, కుమారులు రాజేశ్వర్‌రెడ్డి (10), మహేశ్వర్‌రెడ్డి (11) ఉన్నారు. వెంకట్రమణారెడ్డికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. తంబళ్ళపల్లి ఎస్ఐ దిలీప్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మద్దిరెడ్డి, భూమిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో గిరి రైతు ఆత్మహత్య



విశాలాంధ్ర - బెలగాం : వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పుల ఒత్తిడి పెరగడంతో పత్తిపంట కోసం తెచ్చిన పురుగుల మందు తాగి ఓ గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం విజయనగరం జిల్లా బెలగాంలో చోటుచేసుకుంది. కొమరాడ మండలం మసిమండ గ్రామానికి చెందిన గిరిజన రైతు జీలకర్ర చంద్రయ్య(55) కొన్నేళ్లుగా సుమారు ఎనిమిది ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఏటా పత్తి పంట పండించేవాడు. ఈ ఏడాది కూడా అప్పు చేసి పంట సాగుచేశాడు. కనీసం పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం వేకువజామున ఇంట్లోని పురుగుల మందు తాగేశాడు. నురగలు కక్కుకుంటున్న భర్తను గమనించిన భార్య జమ్మలమ్మ స్థానికుల సహకారంతో కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్యకు భార్య, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కొమరాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిందూమతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నాశనం చేస్తోంది

స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం



విశాలాంధ్ర - విజయనగరం (మున్సిపాలిటీ) : హిందూమతాన్ని సర్వనాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంటోందని శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ తెలుగు అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఎన్‌వీఎల్ నాగరాజు దత్తత తీసుకున్న విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామంలో నిర్మించిన సామాజిక భవన సముదాయాన్ని శనివారం స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో రోడ్ల విస్తరణ, సదావత్తు భూముల వ్యవహారం, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో క్షుద్రపూజలు వంటివన్నీ ఇకపై ప్రభుత్వంపై ప్రభావం చూపుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది అనంతరం కొత్త సంవత్సరంలో గ్రామాలు, పల్లెలను, హిందూధర్మాన్ని పట్టించుకోని ప్రభుత్వంగా, ప్రజలకు వ్యతిరేకంగా మారిపోబోతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో 40కు పైగా దేవాలయాలను కూలదోస్తూ దైవానుగ్రహాన్ని పొందని ఈ ప్రభుత్వానికి నష్టం తప్పదన్నారు. రాబోయే సంవత్సరమంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనిపిస్తున్న సూచనలు ఉన్నాయన్నారు. అప్రతిష్ఠ మూటకట్టుకోనున్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రజా వ్యతిరేకిగా మారబోతోందని జోస్యం చెప్పారు.



బీసీల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడం

విశాలాంధ్ర - గూడూరు : వెనుకబడినవర్గాల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు అన్నారు. నెల్లూరు జిల్లా గూడూరు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తి కావస్తున్నా వెనుకబడినవర్గ ప్రజలు ఇంకా హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించడం బాధాకరమన్నారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపు, సబ్ ప్లాన్‌ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పాలకులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పూలే భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు, స్థలాలు కేటాయించినప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కార్పొరేషన్లు వెలిసినా నిరుపేదలకు నేరుగా రుణాలు అందించలేని పరిస్థితి ఎందుకు ఉందో ఉన్నతాధికారులు సమీక్షించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2019 ఎన్నికల్లో బీసీ యువతకు అన్ని రాజకీయ పార్టీలు అత్యధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల బీసీ ఉద్యోగాలను వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌కె.యాదవ్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మగ్దూమ్ మొహిద్దీన్, బహుజన నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం రోగులకు 'టెలీమెడిసిన్'

- నేటి నుంచి విశాఖ వైద్యుల సేవలు
- ఉచిత సేవలకు ఉద్దానం ఫౌండేషన్ సిద్ధం



విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉద్దానం ఫౌండేషన్ మరో వరం ప్రకటించింది. ఉన్నత వైద్యసేవల కోసం అనేక వ్యయప్రయాసలతో విశాఖ వెళ్లాల్సిన పనిలేకుండా విశాఖలోని స్పెషలిస్ట్ వైద్యులు నేరుగా ఉద్దానంలోని రోగుల మధ్య వీడియో కాన్ఫరెన్స్ తరహాలో 'టెలిమెడిసిన్' కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనుంది. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, విజయ దంపతుల నిర్వహణలో ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలో శుద్ధ జల ప్లాంట్ల ద్వారా మినరల్ వాటర్ పంపిణీ, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉచిత అంబులెన్స్‌ల ద్వారా రోగులను బరంపురం, విశాఖ తరలించడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉద్దానం ఫౌండేషన్ తాజాగా మరో అడుగు ముందుకేసింది. 'టెలీమెడిసిన్' కోసం సోంపేటలోని జేకే ప్లాజాలో విశాలమైన కార్యాలయం ఏర్పాటుచేశారు. ఇక్కడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోగులతో విశాఖ నుంచి వైద్య నిపుణులు మాట్లాడేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని సిద్ధం చేసింది. విశాఖ నుంచి టెలీ మెడిసిన్ ప్రక్రియ ద్వారా సేవలు అందించేందుకు శ్రద్ధ ఆసుపత్రి ముందుకొచ్చింది. నెఫ్రాలజిస్ట్‌లు, న్యూరాలజిస్టులు రోగుల పరిస్థితులను టెలీమెడిసిన్ ద్వారా పరీక్షించనున్నారు. రోగుల వైద్య పరీక్షల నివేదికలను సైతం టెలీమెడిసిన్ ద్వారా అధ్యయనం చేసి అవసరమైన మందులు సూచించనున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజలకు ఉచిత సేవలు కల్పించేందుకు ఉద్దానం ఫౌండేషన్ తగు చర్యలు చేపట్టనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. ఉచిత టెలీమెడిసిన్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్‌కందా, హర్యానా డీజీపీ అనంత్‌కుమార్ దుల్ రానున్నట్లు ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డులో వ్యక్తిని కాల్చేశారు



విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని డంపింగ్ యార్డు వద్ద ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టడం శనివారం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించినట్టు జరిగింది. కాకినాడ డీఎస్పీ రవివర్మ తెలిపారు. ఐశ్వర్యనగర్‌కు చెందిన రాయుడు హరి (32) కనిపించటంలేదంటూ అతని అన్నయ్య రాయుడు శ్రీను సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికే డంపింగ్ యార్డు వద్ద కాలుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చూసిన శ్రీను తన తమ్ముడిదే అని గుర్తించడంతో పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రాయుడు హరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. హరి భార్య భానుచందుకు భవానీప్రసాద్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగేదని, వీరిద్దరే తన తమ్ముని మరణానికి కారణమని అనుమానించడంతో భానుచందును అదుపులోకి తీసుకున్నామన్నారు. సీఐ దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

2022 నాటికి పేదలందరికీ పక్కా గృహాలు



విశాలాంధ్రప్రతినిధి - అనంతపురము : రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ 2022వ సంవత్సరం నాటికి పక్కా గృహాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామీణ గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. అనంతపురములోని ఆర్అండ్బీ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనాభా పెరుగుదలతోపాటు పట్టణీకరణతో నివాస గృహాల కొరత ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిలో 90 శాతం మంది ఇళ్ల కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం నరసమైన ధరల్లో ఇళ్లు నిర్మించేలా ఎన్టీఆర్ గ్రామీణ నిర్మాణ పథకం, ఎన్టీఆర్ ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం, ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకాల ద్వారా అర్హులకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 19 లక్షల ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. గ్రామీణ గృహనిర్మాణ శాఖ ద్వారా 13 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గత అక్టోబర్ 2న గాంధీ జయంతినాడు ప్రపంచ అవాస్ దినోత్సవం సందర్భంగా లక్ష గృహప్రవేశాలు చేశామన్నారు. ఈ లక్షతో పాటు మరో లక్షన్నర ఇళ్లు పూర్తి కానున్నాయని, మార్చి నెలాఖరులోపు వీటి గృహప్రవేశం చేస్తామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణ పనులకు ఉద్యమంలా శంకుస్థాపనలు చేయాలన్నారు.

చిన్నారి చెవి పీకేసిన వీధి కుక్కల గుంపు



విశాలాంధ్ర - రెంటచింతల : వీధి కుక్కలు పదునైన పళ్ళతో కసితీరా కాటేస్తూ చిన్నారులను బలి తీసుకుంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఽ జనంపై దాడులు చేయడంతో వీధుల్లోకి రావాలంటే పెద్దలు సైతం హడలిపోతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా రెంటచింతల మండలం మెట్టగుడిపాడు గ్రామంలో శనివారం ఉదయం వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపర్చాయి. ఒక స్కూలు టీచర్పై విచక్షణరహితంగా దాడిచేశాయి. మూడేళ్ల చిన్నారి బలుగూరి నాగసైదమ్మపై కుక్కలు దాడి చేసి పళ్లతో పీకేయడంతో చిన్నారి ఎడమచెవి సగానికిపైగా తెగి వేలాడటంతో అల్లాడిపోయింది. షేక్ బంగారు అనే నాలుగు సంవత్సరాల చిన్నారి ఛాతీపై కాటేశాయి. మూడేళ్ల ఉప్పు ఈశ్వరి లక్ష్మీకుమారిని, కస్తూర్బా ఉపాధ్యాయురాలు శివలింగమ్మపైనా దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులంతా ఆటలాడుకుంటున్న సమయంలో కుక్కలు దాడిచేయడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలో కుక్కల సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తమ పిల్లల ప్రాణాలమీదకు వచ్చాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్లో అడవితక్కెళ్ళపాడులో రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన ప్రేమ్ (5)ను ఏడు కుక్కలు లాక్కెళ్లి కరిచి చంపేసిన సమయంలో హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు విశాఖలో రాష్ట్ర గిరిజన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం మున్సిపాలిటీ : పార్లమెంటు సమావేశాల్లో గిరిజన యూనివర్శిటీ బిల్లు ప్రవేశపెట్టాలని, బోయ, వాల్మీకి, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లును ఎంపీలంతా తిరస్కరించాలని కోరుతూ ఆదివారం విశాఖలోని గిరిజన భవన్లో రాష్ట్ర స్థాయి గిరిజన సదస్సు నిర్వహిస్తున్నట్టు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలుగు వెంకటరావు శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాజక్టు పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. ఐక్య ఉద్యమాలకు రూపకల్పన జరుగుతుందని వెంకటరావు వివరించారు.


కాపు, బలిజలకు న్యాయం చేయండి



విశాలాంధ్ర - ఓర్వకల్లు : రాష్ట్రంలోని కాపు, బలిజ జాతిని బీసీ-ఎఫ్లో చేర్చి న్యాయం చేయాలని రాష్ట్ర కాపు, బలిజ ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ముద్రగడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో నష్టపోయిన కాపు, బలిజలను రాజకీయ పార్టీ నాయకులు వేళాకోళం చేస్తూ, బాధపెట్టి ఆడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం త్వరలో 50 వేల ఉద్యోగాలు విడుదల చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే కాపు, బలిజ నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అర్హత పొందడానికి బీసీ-ఎఫ్లో మార్చి 31 నాటికి చేర్చాలని, దీనికి దరఖాస్తు చేసుకునేందుకు తహశీల్దార్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్లో ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నారాయణరెడ్డి, అంగడి శ్రీనివాసులు, పుల్లారెడ్డి, చెన్నా రెడ్డి, గడేకారి ప్రభాకర్, యంగన్న, హెూటల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ధరల్లో దళారుల కోత

- అలంకారంగా కొనుగోలు కేంద్రాలు
- నెల్లూరు జిల్లాలో రైతుల దుస్థితి



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. రైతులకు మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. జిల్లాలో సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో 89, ఐకేపీ ఆధ్వర్యంలో 66, జిల్లా మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 13 కలిపి మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ మధ్య సమన్వయలోపం కారణంగా ప్రస్తుతం కేంద్రాలు ఫ్లెక్సీలకే పరిమితం అయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్స్, గోనె సంచులు, తేమశాతం కొలిచే మీటర్లు, వెయింగ్ స్కేలు.. తదితర పరికరాలు లేకపోవడంతో ఆయా సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. సంచులు, పరికరాలు వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేక దళారులకు తెగనమ్ముతున్నారు. దీంతో ధాన్యం వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరల్లో భారీ కోత వేస్తున్నారు. జిలకర మసూరి ధాన్యం ఏ గ్రేడ్ రకం 100 కేజీల బస్తా ధర రూ. 1590, సాధారణ రకం ధర రూ.1550గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. రైతుల పరిస్థితులను అవకాశంగా తీసుకుంటున్న దళారులు బస్తా రూ.300 నుంచి రూ.500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కుటుంబమంతా కాయకష్టం చేసి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు.

మిల్లర్లు వెనుకంజ

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు తరలిస్తుంది. మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ పద్ధతిలో ధాన్యం ఆడించి బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. 2016 సంవత్సరంలో వెలుగుచూసిన అక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. రైస్మిల్లులకు ధాన్యం తరలించాలంటే ఆయా మిల్లర్లు విధిగా తీసుకునే ధాన్యానికి సరిపడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి. బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి మిల్లర్లు ముందుకు రాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లుల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు చెల్లింపులోనూ అయోమయం నెలకొంది. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఉచితంగా మిల్లులకు చేర్చుతుంది. ఈ ఖర్చును తొలుత రైతులు భరిస్తే ఆ తర్వాత వారికి చెల్లిస్తారు. వీటి రవాణా కోసం వాహనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక కాంట్రాక్టర్ను నియమిస్తుంది. గత ఏడాది రైతులకు సక్రమంగా నగదు చెల్లించకపోవడంతో రైతులే రవాణా వ్యయం భరించారు. ట్రాక్టర్లతో ధాన్యాన్ని రైతులు మిల్లుల వద్దకు తీసుకెళ్లినా మిల్లర్లు స్పందించకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వకుండా పథకం ప్రకారమే వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో రైతులు గత్యంతరం లేక దళారులు, వ్యాపారులు, మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయిస్తారు. మిల్లర్లే కొన్నిచోట్ల దళారుల అవతారం ఎత్తుతున్నారు. గ్యారంటీ చూపకపోతే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయవచ్చని, గ్యారంటీ లేకుండా అధికారులే ధాన్యాన్ని పంపిస్తారనే ఆలోచనలో మిల్లర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

16 మంది మిల్లర్లే బ్యాంకు గ్యారంటీ

జిల్లాలో 250 రైస్ మిల్లులు ఉన్నప్పటికీ 16 మంది రైస్ మిల్లర్లు మాత్రం 8 కోట్ల 61 లక్షల రూపాయల బ్యాంకు గ్యారంటీ ఇచ్చారు. కడపకు చెందిన మరో ఆరుగురు మిల్లర్లు రూ. 7 కోట్లు గ్యారంటీలు ఇచ్చారు. సీఎంఆర్ బకాయిలున్న రైస్ మిల్లర్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఒక్క గింజ కూడా వెళ్లడానికి వీల్లేదని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు.

జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడంతో సుమారు 20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వృద్ధురాలు సజీవ దహనం

విశాలాంధ్ర - హిరమండలం/కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ వృద్ధురాలు సజీవ దహనమైంది. ఈ ఘటనతో పారాపురంలో విషాధఛాయలు అలము కున్నాయి. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం పారాపురంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్తో మంటలు చెలరేగి ఆ పక్కనే ఉన్న మిగిలిన 4 ఇళ్ళకు అంటుకోవడంతో అయిదు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంచంపై ఎటూ కదలలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు రీసి శాంతమ్మ ఇంటి నుండి బయటకు రాలేక మంటల్లోనే సజీవ దహనమైంది. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ రెడ్డి శాంతి శనివారం ఘటనా స్థలికి చేరుకొని బాధితులను, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అగ్నికి ఆహుతైన ఇళ్లకు గాను పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.



భారీగా ఎర్రచందనం పట్టివేత

విశాలాంధ్ర - పీలేరు : చిత్తూరు జిల్లాలోని పీలేరు-కడప జాతీయ రహదారిలో దుర్గంపల్లె టోల్ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో శనివారం భారీ స్థాయిలో ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీలేరు సమీపంలోని టోల్ప్లాజా వద్ద అడిషనల్ ఎస్పీ రాధిక పర్యవేక్షణలో పీలేరు అర్బన్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐ పీవీ సుధాకర్రెడ్డి, చిత్తూరు ఎస్టీఎఫ్ సిబ్బంది, పీలేరు అదనపు ఎస్ఐ సుమన్ సిబ్బంది తనిఖీ చేశారు. కడప నుంచి వస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ వేగంగా వెళ్ళిపోవడంతో పోలీసులు వెంబడించారు. లారీని డ్రైవర్ చెట్టును ఢీకొనడంతో లారీలోని కొందరు దిగి పారిపోయారు. వాహనంలోని 100 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వీటి బరువు సుమారు 2960 కిలోలు ఉంటుందని అంచనా వేశారు. కేవీపల్లె మండలం తువ్వపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇండికా విస్తా కారు అతివేగంగా దూసుకెళ్లడంతో పోలీసులు వెంబడించారు. కొత్తపల్లె హరిజనవాడ వద్ద దిగి డ్రైవర్, కొంత మంది వ్యక్తులు పారిపోయారు. దీనిలోని 9 ఎర్రచందనపు దుంగలను కేవీపల్లె పోలీస్స్టేషన్కు తరలించారు.

సీఆర్డీఏ ఓ ల్యాండ్ మాఫియా

- పూలింగ్కు భూమి ఇవ్వలేదని కక్ష సాధింపు
- పండలనేని శ్రీమన్నారాయణ



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాజధాని అమరావతి ప్రాంతంలో సీఆర్డీఏ ఉన్నతాధికారులు ల్యాండ్ మాఫియాగా రైతులను మోసం చేస్తున్నారని రాజధాని నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో పిటిషన్ వేసిన పండలనేని శ్రీమన్నారాయణ తెలిపారు. విజయవాడ ప్రెస్క్లబ్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ ఇంప్లిమెంట్, సూపర్వైజర్ కమిటీలను నియమించిందన్నారు. అవి ఇంతవరకు ఎన్జీటీకి రిపోర్టులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్జీటీకి వ్యతిరేకంగా సీఆర్డీఏ అధికారులు రాత్రికి రాత్రి దొండపాడు, పాలవీడు, కోటివాగు ఏరియాల్లో మురుగునీరు వెళ్లే డ్రెయిన్లను మిషన్లతో పూడ్చివేస్తున్నారన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా ఈ ప్రాంతాల్లో ఎటువంటి పంటలు పండవని ఎన్జీటీ వారికి చూపించే ప్రయత్నిస్తున్నారన్నారు. రాజధాని కోసం పూలింగ్ భూములు ఇవ్వని వారి సర్వే నెంబర్లను ఇతర పేర్లతో కలిపి పూలింగ్కు ఇచ్చినట్లు సృష్టిస్తున్నారన్నారు. ఇలా మోసపోయిన మందడం గ్రామ రైతు పాతూరి తాతబాబు ఉన్నారన్నారు. తాతబాబు మాట్లాడుతూ మందడంలోని తనకున్న 18 ఎకరాల 56 సెంట్ల భూమిని పూలింగ్కు ఇవ్వలేదన్నారు. సీఆర్డీఏ అధికారులు తన భూమిలో కొంత ఇతర వ్యక్తులు పూలింగ్కు ఇచ్చినట్లు సృష్టించి వారికి కౌలు తరపున రూ.18 లక్షల చెక్కులు అందజేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులు తన భూమిని వదలకుంటే నిరవధిక నిరాహార దీక్షకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు.

విద్యుత్ తీగలకు ఇద్దరు రైతుల బలి



విశాలాంధ్ర - బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లి మండలం బాలిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు రైతులు శనివారం విద్యుత్షాక్కు మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల నిర్లక్ష్యానికి రెండు కుటుంబాలు వీధినపడ్డాయి. తంబళ్లపల్లి మండలంలోని దిగువపల్లికి చెందిన రైతులు భూమిరెడ్డి, మద్దిరెడ్డి తమ పొలంలో పంటను అడవి జంతువులు నాశనం చేస్తున్నాయన్న ఆందోళనతో శుక్రవారం రాత్రి పొలం చుట్టూ తీగలు లాగి విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఈ నేపథ్యంలో అదే పంచాయతీకి చెందిన అక్కెమ్మగారిపల్లి గ్రామ రైతులు రామలింగారెడ్డి (45), రాజారెడ్డి (35), సమీప దొడ్డికాడపల్లికి చెందిన రైతు వెంకట్రమణారెడ్డి (55)లను కూడా తమ పొలం వద్దకు రావాలని భూమిరెడ్డి, మద్దిరెడ్డిలు కోరగా, వీరు ముగ్గురూ శుక్రవారం రాత్రి అడవి జంతువులను బెదరగొట్టేందుకు 12 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్ళారు. రాత్రి కావడంతో ఇద్దరు రైతులు వేరుశనగ పొలంలోకి వెళ్లడంతో కరెంట్ షాక్తో ఒక్క క్షణంలో ప్రాణాలు కోల్పోయారు. మరో రైతు రాజారెడ్డి గాయాలతో బయటపడ్డారు. వెంటనే తేరుకొని పెద్దగా కేకలు వేయడంతో సమీప రైతులు అక్కడకు చేరుకునే లోపే ప్రాణనష్టం జరిగిపోయింది. ఈ విషయం మండలమంతా వ్యాపించడంతో వేలాదిమంది రైతులు అక్కడకు చేరుకున్నారు. మృతుల్లో రామలింగారెడ్డికి భార్య సులోచన, కుమారులు రాజేశ్వర్రెడ్డి (10), మహేశ్వర్రెడ్డి (11) ఉన్నారు. వెంకట్రమణారెడ్డికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. తంబళ్ళపల్లి ఎస్ఐ దిలీప్కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మద్దిరెడ్డి, భూమిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో గిరి రైతు ఆత్మహత్య



విశాలాంధ్ర - బెలగాం : వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పుల ఒత్తిడి పెరగ దంతో పత్తిపంట కోసం తెచ్చిన పురుగుల మందు తాగి ఓ గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం విజయనగరం జిల్లా బెలగాంలో చోటుచేసుకుంది. కొమరాడ మండలం మసిమండ గ్రామానికి చెందిన గిరిజన రైతు జీలకర్ర చంద్రయ్య(55) కొన్నేళ్లుగా సుమారు ఎనిమిది ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఏటా పత్తి పంట పండించేవాడు. ఈ ఏడాది కూడా అప్పు చేసి పంట సాగుచేశాడు. కనీసం పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం వేకువజామున ఇంట్లోని పురుగుల మందు తాగేశాడు. నురగలు కక్కుకుంటున్న భర్తను గమనించిన భార్య జమ్మలమ్మ స్థానికుల సహకారంతో కూనేరు రామభద్రపురం పీహెచ్సీకి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్యకు భార్య, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కొమరాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిందూమతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నాశనం చేస్తోంది

స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం



విశాలాంధ్ర - విజయనగరం (మున్సిపాలిటీ) : హిందూమతాన్ని సర్వనాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంటోందని శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ తెలుగు అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఎన్వీఎల్ నాగరాజు దత్తత తీసుకున్న విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామంలో నిర్మించిన సామాజిక భవన సముదాయాన్ని శనివారం స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో రోడ్ల విస్తరణ, సదావత్తు భూముల వ్యవహారం, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో క్షుద్రపూజలు వంటివన్నీ ఇకపై ప్రభుత్వంపై ప్రభావం చూపుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది అనంతరం కొత్త సంవత్సరంలో గ్రామాలు, పల్లెలను, హిందూధర్మాన్ని పట్టించుకోని ప్రభుత్వంగా, ప్రజలకు వ్యతిరేకంగా మారిపోబోతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో 40కు పైగా దేవాలయాలను కూలదోస్తూ దైవానుగ్రహాన్ని పొందని ఈ ప్రభుత్వానికి నష్టం తప్పదన్నారు. రాబోయే సంవత్సరమంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనిపిస్తున్న సూచనలు ఉన్నాయన్నారు. అప్రతిష్ట మూటకట్టుకోనున్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రజా వ్యతిరేకిగా మారబోతోందని జోస్యం చెప్పారు.



బీసీల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడం

విశాలాంధ్ర - గూడూరు : వెనుకబడినవర్గాల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు అన్నారు. నెల్లూరు జిల్లా గూడూరు ఆర్అండ్బీ అతిథిగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తి కావస్తున్నా వెనుకబడినవర్గ ప్రజలు ఇంకా హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించడం బాధాకరమన్నారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపు, సబ్ ప్లాన్ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పాలకులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పూలే భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు, స్థలాలు కేటాయించినప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కార్పొరేషన్లు వెలిసినా నిరుపేదలకు నేరుగా రుణాలు అందించలేని పరిస్థితి ఎందుకు ఉందో ఉన్నతాధికారులు సమీక్షించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2019 ఎన్నికల్లో బీసీ యువతకు అన్ని రాజకీయ పార్టీలు అత్యధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల బీసీ ఉద్యోగాలను వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్కె.యాదవ్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మగ్దూమ్ మొహిద్దీన్, బహుజన నాయకులు నాశిన భాస్కర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో వ్యక్తిని కాల్చేశారు



విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని డంపింగ్ యార్డు వద్ద ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టడం శనివారం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించినట్టు జరిగింది. కాకినాడ డీఎస్పీ రవివర్మ తెలిపారు. ఐశ్వర్యనగర్కు చెందిన రాయుడు హరి (32) కనిపించటంలేదంటూ అతని అన్నయ్య రాయుడు శ్రీను సర్పవరం పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికే డంపింగ్ యార్డు వద్ద కాలుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చూసిన శ్రీను తన తమ్ముడిదే అని గుర్తించడంతో పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రాయుడు హరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. హరి భార్య భానుచందుకు భవానీప్రసాద్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగేదని, వీరిద్దరే తన తమ్ముని మరణానికి కారణమని అనుమానించడంతో భానుచందును అదుపులోకి తీసుకున్నామన్నారు. సీఐ దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

ఉద్దానం రోగులకు 'టెలీమెడిసిన్'

- నేటి నుంచి విశాఖ వైద్యుల సేవలు
- ఉచిత సేవలకు ఉద్దానం ఫౌండేషన్ సిద్ధం



విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో తీవ్ర వ్యాధులతో బాధ పడుతున్న రోగులకు ఉద్దానం ఫౌండేషన్ మరో వరం ప్రకటించింది. ఉన్నత వైద్యసేవల కోసం అనేక వ్యయప్రయాసలతో విశాఖ వెళ్లాల్సిన పనిలేకుండా విశాఖలోని స్పెషలిస్ట్ వైద్యులు నేరుగా ఉద్దానంలోని రోగుల మధ్య వీడియో కాన్ఫరెన్స్ తరహాలో 'టెలీమెడిసిన్' కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనుంది. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, విజయ దంపతుల నిర్వహణలో ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలో శుద్ధ జల ప్లాంట్ల ద్వారా మినరల్ వాటర్ పంపిణీ, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉచిత అంబులెన్స్ల ద్వారా రోగులను బరంపురం, విశాఖ తరలించడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉద్దానం ఫౌండేషన్ తాజాగా మరో అడుగు ముందుకేసింది. 'టెలీమెడిసిన్' కోసం సోంపేటలోని జేకే ప్లాజాలో విశాలమైన కార్యాలయం ఏర్పాటుచేశారు. ఇక్కడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోగులతో విశాఖ నుంచి వైద్య నిపుణులు మాట్లాడేలా ప్రత్యేక సాఫ్ట్వేర్ టెక్నాలజీని సిద్ధం చేసింది. విశాఖ నుంచి టెలీ మెడిసిన్ ప్రక్రియ ద్వారా సేవలు అందించేందుకు శ్రద్ధ ఆసుపత్రి ముందుకొచ్చింది. నెఫ్రాలజిస్టులు, న్యూరాలజిస్టులు రోగుల పరిస్థితులను టెలీమెడిసిన్ ద్వారా పరీక్షించనున్నారు. రోగుల వైద్య పరీక్షల నివేదికలను సైతం టెలీమెడిసిన్ ద్వారా అధ్యయనం చేసి అవసరమైన మందులు సూచించనున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజలకు ఉచిత సేవలు కల్పించేందుకు ఉద్దానం ఫౌండేషన్ తగు చర్యలు చేపట్టనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. ఉచిత టెలీమెడిసిన్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్కందా, హర్యానా డీజీపీ అనంత్కుమార్ దుల్ రానున్నట్టు ఆయన తెలిపారు.

2022 నాటికి పేదలందరికీ పక్కా గృహాలు



విశాలాంధ్రప్రతినిధి - అనంతపురము : రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ 2022వ సంవత్సరం నాటికి పక్కా గృహాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామీణ గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. అనంతపురములోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనాభా పెరుగుదలతోపాటు పట్టణీకరణతో నివాస గృహాల కొరత ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిలో 90 శాతం మంది ఇళ్ల కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సరసమైన ధరల్లో ఇళ్లు నిర్మించేలా ఎన్టీఆర్ గ్రామీణ నిర్మాణ పథకం, ఎన్టీఆర్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం, ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకాల ద్వారా అర్హులకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 19 లక్షల ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. గ్రామీణ గృహనిర్మాణ శాఖ ద్వారా 13 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గత అక్టోబర్ 2న గాంధీ జయంతినాడు ప్రపంచ ఆవాస్ దినోత్సవం సందర్భంగా లక్ష గృహప్రవేశాలు చేశామన్నారు. ఈ లక్షతో పాటు మరో లక్షన్నర ఇళ్లు పూర్తి కానున్నాయని, మార్చి నెలాఖరులోపు వీటి గృహప్రవేశం చేస్తామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణ పనులకు ఉద్యమంలా శంకుస్థాపనలు చేయనున్నారు.

చిన్నారి చెవి పీకేసిన వీధి కుక్కల గుంపు



విశాలాంధ్ర - రెంటచింతల : వీధి కుక్కలు పదునైన పళ్లతో కసితీరా కాటేస్తూ చిన్నారులను బలి తీసుకుంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఆ జనంపై దాడులు చేయడంతో వీటిల్లోకి రావాలంటే పెద్దలు సైతం హడలిపోతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా రెంటచింతల మండలం మెట్టగుడిపాడు గ్రామంలో శనివారం ఉదయం వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపర్చాయి. ఒక స్కూలు టీచర్‌పై విచక్షణారహితంగా దాడిచేశాయి. మూడేళ్ల చిన్నారి బలుగూరి నాగసైదమ్మపై కుక్కలు దాడి చేసి పళ్లతో పీకేయడంతో చిన్నారి ఎడమచెవి సగానికిపైగా తెగి వేలాడటంతో అల్లాడిపోయింది. షేక్ జంగారు అనే నాలుగు సంవత్సరాల చిన్నారి ఛాతీపై కాటేశాయి. మూడేళ్ల ఉప్పు ఉత్తర లక్ష్మీకుమారిని, కస్తూర్బా ఉపాధ్యాయురాలు శివలింగమ్మపైనా దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులంతా ఆటలాడుకుంటున్న సమయంలో కుక్కలు దాడిచేయడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలో కుక్కల సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తమ పిల్లల ప్రాణాలమీదకు వచ్చాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో అడవితక్కెళ్లపాడులో రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన ప్రేమ్ (5)ను ఏడు కుక్కలు లాక్కెళ్లి కరిచి చంపేసిన సమయంలో హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


నేడు విశాఖలో రాష్ట్ర గిరిజన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం మున్సిపాలిటీ : పార్లమెంటు సమావేశాల్లో గిరిజన యూనివర్సిటీ బిల్లు ప్రవేశపెట్టాలని, బోయ, వాల్మీకి, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లును ఎంపీలంతా తిరస్కరించాలని కోరుతూ ఆదివారం విశాఖలోని గిరిజన భవన్‌లో రాష్ట్ర స్థాయి గిరిజన సదస్సు నిర్వహిస్తున్నట్లు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలుగు వెంకటరావు శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాజెక్టు పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. ఐక్య ఉద్యమాలకు రూపకల్పన జరుగుతుందని వెంకటరావు వివరించారు.

కాపు, బలిజలకు న్యాయం చేయండి



విశాలాంధ్ర - ఒర్వకల్లు : రాష్ట్రంలోని కాపు, బలిజ జాతిని బీసీ-ఎఫ్‌లో చేర్చి న్యాయం చేయాలని రాష్ట్ర కాపు, బలిజ ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ముద్రగడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో నష్టపోయిన కాపు, బలిజలను రాజకీయ పార్టీ నాయకులు నేలకోళం చేస్తూ, బాధపెట్టి ఆడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం త్వరలో 50 వేల ఉద్యోగాలు విడుదల చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే కాపు, బలిజ నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అర్హత పొందడానికి బీసీ-ఎఫ్‌లో మార్చి 31 నాటికి చేర్చాలని, దీనికి దరఖాస్తు చేసుకునేందుకు తహశీల్దార్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్‌లో ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నారాయణరెడ్డి, అంగడి శ్రీనివాసులు, పుల్లారెడ్డి, చెన్నా రెడ్డి, గడేకారి ప్రభాకర్, యుగన్న, హోటల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



భారీగా ఎర్రచందనం పట్టివేత


విశాలాంధ్ర - పీలేరు : చిత్తూరు జిల్లాలోని పీలేరు-కడప జాతీయ రహదారిలో దుర్గంపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో శనివారం భారీ స్థాయిలో ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీలేరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద అడిషనల్ ఎస్పీ రాధిక పర్యవేక్షణలో పీలేరు అర్బన్ సీఐ వేణుగోపాల్, ఎస్బి సీఐ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు ఎస్బీఎస్ సిబ్బంది, పీలేరు అదనపు ఎస్ఐ సుమన్ సిబ్బంది తనిఖీ చేశారు. కడప నుంచి వస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ వేగంగా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించారు. లారీని డ్రైవర్ చెట్లను ఢీకొనడంతో లారీలోని కొందరు దిగి పారిపోయారు. వాహనంలోని 100 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వీటి బరువు సుమారు 2960 కిలోలు ఉంటుందని అంచనా వేశారు. కేవీపల్లె మండలం తువ్వపల్లె వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇండికా విస్టా కారు అతివేగంగా దూసుకెళ్లడంతో పోలీసులు వెంబడించారు. కొత్తపల్లె హరిజనవాడ వద్ద దిగి డ్రైవర్, కొంత మంది వ్యక్తులు పారిపోయారు. దీనిలోని 9 ఎర్రచందనపు దుంగలను కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అప్పుల బాధతో గిరి రైతు ఆత్మహత్య



విశాలాంధ్ర - బెలగాం : వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పుల ఒత్తిడి పెరగడంతో పత్తిపంట కోసం తెచ్చిన పురుగుల మందు తాగి ఓ గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం విజయనగరం జిల్లా బెలగాంలో చోటుచేసుకుంది. కొమరాడ మండలం మసిమండ గ్రామానికి చెందిన గిరిజన రైతు జీలకర్ర చంద్రయ్య(55) కొన్నేళ్లుగా సుమారు ఎనిమిది ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఏటా పత్తి పంట పండించేవారు. ఈ ఏడాది కూడా అప్పు చేసి పంట సాగుచేశారు. కనీసం పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం వేకువజామున ఇంట్లోని పురుగుల మందు తాగేశారు. నురగలు కక్కుకుంటున్న భర్తను గమనించిన భార్య జమ్మలమ్మ స్థానికుల సహకారంతో కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు చికిత్స అందించిన ఫలితం లేక మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్యకు భార్య, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కొమరాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డంపింగ్ యార్డులో వ్యక్తిని కాల్చేశారు



విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని డంపింగ్ యార్డు వద్ద ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టడం శనివారం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించినట్టు జరిగింది. కాకినాడ డీఎస్పీ రవివర్మ తెలిపారు. ఐశ్వర్యనగర్‌కు చెందిన రాయుడు హరి (32) కనిపించటంలేదంటూ అతని అన్నయ్య రాయుడు శ్రీను సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికే డంపింగ్ యార్డు వద్ద కాలుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చూసిన శ్రీను తన తమ్ముడిదే అని గుర్తించడంతో పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రాయుడు హరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. హరి భార్య భాగ్యలక్ష్మి భువనేశ్వరిప్రసాద్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగించిన, వీరిద్దరే తన తమ్ముని మరణానికి కారణమని అనుమానించడంతో వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. సీఐ దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

ధాన్యం ధరల్లో దళారుల కోత

- అలంకారంగా కొనుగోలు కేంద్రాలు
- నెల్లూరు జిల్లాలో రైతుల దుస్థితి



విశాలాంధ్ర - నెల్లూరుజ్యూరో : నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. రైతులకు మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. జిల్లాలో సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో 89, ఐకేపీ ఆధ్వర్యంలో 66, జిల్లా మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 13 కలిపి మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ మధ్య సమన్వయలోపం కారణంగా ప్రస్తుతం కేంద్రాలు షెడ్యూల్‌కే పరిమితం అయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్స్, గోనె సంచులు, తేమశాతం కొలిచే మీటర్లు, వెయింగ్ మిషన్లు తదితర పరికరాలు లేకపోవడంతో ఆయా సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. సంచులు, పరికరాలు వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేక దళారులకు తెగనమ్ముకుంటున్నారు. దీంతో ధాన్యం వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరలో భారీ కోత వేస్తున్నారు. ప్రభుత్వం జిలకర మసూరి ధాన్యం ఏ గ్రేడ్ రకం 100 కేజీల బస్తా ధర రూ. 1590, సాధారణ రకం ధర రూ.1550గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. రైతుల పరిస్థితులను అవకాశంగా తీసుకుంటున్న దళారులు బస్తా రూ. 300 నుంచి రూ.500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కుటుంబమంతా కాయకష్టం చేసి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు.

మిల్లర్లు వెనుకంజ

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు తరలిస్తుంది. మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ పద్ధతిలో ధాన్యం ఆడించి బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. 2016 సంవత్సరంలో వెలుగుచూసిన అక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. రైస్‌మిల్లులకు ధాన్యం తరలించాలంటే ఆయా మిల్లర్లు విధిగా తీసుకునే ధాన్యానికి సరిపడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి. బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి మిల్లర్లు ముందుకు రాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లుల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు చెల్లింపులోనూ అయోమయం నెలకొంది. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఉచితంగా మిల్లులకు చేర్చుతుంది. ఈ ఖర్చును తొలుత రైతులు భరిస్తే ఆ తర్వాత వారికి చెల్లిస్తారు. వీటి రవాణా కోసం వాహనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక కాంట్రాక్టర్‌ను నియమిస్తుంది. గత ఏడాది రైతులకు నష్టమంగా నగదు చెల్లించకపోవడంతో రైతులే రవాణా వ్యయం భరించారు. ట్రాక్టర్లతో ధాన్యాన్ని రైతులు మిల్లుల వద్దకు తీసుకెళ్తినా మిల్లర్లు స్పందించకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో మిల్లర్లు ప్రభుత్వానికి గ్యారంటీలు ఇవ్వకుండా పథకం ప్రకారమే వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో రైతులు గత్యంతరం లేక దళారులు, వ్యాపారులు, మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయిస్తారు. మిల్లర్లే కొన్నిచోట్ల దళారుల అవతారం ఎత్తుతున్నారు. గ్యారంటీ చూపకపోతే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయవచ్చని, గ్యారంటీ లేకుండా అధికారులే ధాన్యాన్ని పంపిస్తారనే ఆలోచనలో మిల్లర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

16 మంది మిల్లర్లే బ్యాంకు గ్యారంటీ

జిల్లాలో 250 రైస్ మిల్లులు ఉన్నప్పటికీ 16 మంది రైస్ మిల్లర్లు మాత్రం 8 కోట్ల 61 లక్షల రూపాయల బ్యాంకు గ్యారంటీ ఇచ్చారు. కడపకు చెందిన మరో ఆరుగురు మిల్లర్లు రూ. 7 కోట్లు గ్యారంటీలు ఇచ్చారు. సీఎంఆర్ బకాయిలున్న రైస్ మిల్లర్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఒక్క గింజ కూడా వెళ్లడానికి వీల్లేదని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు.

జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడంతో సుమారు 20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వృద్ధురాలు సజీవ దహనం

విశాలాంధ్ర - హిరమండలం/కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ వృద్ధురాలు సజీవ దహనమైంది. ఈ ఘటనతో పారాపురంలో విషాదఛాయలు అలుము కున్నాయి. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం పారాపురంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఆ పక్కనే ఉన్న మిగిలిన 4 ఇళ్లకు అంటుకోవడంతో అయిదు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంచంపై ఎటూ కదలలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు రేసు శాంతమ్మ ఇంటి నుండి బయటకు రాలేక మంటల్లోనే సజీవ దహనమైంది. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ వైఎస్ఆర్ కన్వీనర్ రెడ్డి శాంతి శనివారం ఘటనా స్థలికి చేరుకొని బాధితులను, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అగ్నికి ఆహుతైన ఇళ్లకు గాను పక్కా గృహాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

సీఆర్‌డీఏ ఓ ల్యాండ్ మాఫియా



- పూలింగ్‌కు భూమి ఇవ్వలేదని కక్ష సాధింపు
- పండలనేని శ్రీమన్నారాయణ

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాజధాని అమరావతి ప్రాంతంలో సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ల్యాండ్ మాఫియాగా రైతులను మోసం చేస్తున్నారని రాజధాని నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసిన పండలనేని శ్రీమన్నారాయణ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ ఇంప్లిమెంట్, సూపర్‌వైజ్ కమిటీలను నియమించిందన్నారు. అవి ఇంతవరకు ఎన్‌జీటీకి రిపోర్టులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్‌జీటీకి వ్యతిరేకంగా సీఆర్‌డీఏ అధికారులు రాత్రికి రాత్రి దొండపాడు, పొలవీడు, కోటివాగు ఏరియాల్లో మురుగునీరు వెళ్లే డ్రెయిన్లను మిషన్లతో పూడ్చేస్తున్నారన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా ఆ ప్రాంతాల్లో ఎటువంటి పంటలు పండవని ఎన్‌జీటీ వారికి చూపించే ప్రయత్నిస్తున్నారన్నారు. రాజధాని కోసం పూలింగ్ భూములు ఇవ్వని వారి సర్వే నెంబర్లను ఇతర పేర్లతో కలిపి పూలింగ్‌కు ఇచ్చినట్లు సృష్టిస్తున్నారన్నారు. ఇలా మోసపోయిన మందడం గ్రామ రైతు పాతూరి తాతబాబు ఉన్నారన్నారు. తాతబాబు మాట్లాడుతూ మందడంలో తనకున్న 18 ఎకరాల 56 సెంట్ల భూమిని పూలింగ్‌కు ఇవ్వలేదన్నారు. సీఆర్‌డీఏ అధికారులు తన భూమిలో కొంత ఇతర వ్యక్తుల పూలింగ్‌కు ఇచ్చినట్లు సృష్టించి వారికి కౌలు తరఫున రూ.18 లక్షల చెక్కులు అందజేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులు తన భూమిని వదలకుంటే నిరవధిక నిరాహార దీక్షకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు.

విద్యుత్ తీగలకు ఇద్దరు రైతుల బలి



విశాలాంధ్ర - బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలం బాలిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు రైతులు శనివారం విద్యుత్‌షాక్‌కు మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల నిర్లక్ష్యానికి రెండు కుటుంబాలు వీధినపడ్డాయి. తంబళ్లపల్లి మండలంలోని దిగువపల్లికి చెందిన రైతులు భూమిరెడ్డి, మద్దిరెడ్డి తమ పొలాల్లో పంటను అడవి జంతువులు నాశనం చేస్తున్నాయని ఆందోళనతో శుక్రవారం రాత్రి పొలం చుట్టూ తీగలు వేసి లాగి విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఈ నేపథ్యంలో అదే పంచాయతీకి చెందిన అక్కెమ్మగారిపల్లె గ్రామ రైతులు రామలింగారెడ్డి (45), రాజారెడ్డి (35), సమీప దొడ్డికాడపల్లెకి చెందిన రైతు వెంకట్రమణారెడ్డి (55)లను కూడా తమ పొలం వద్దకు రావాలని భూమిరెడ్డి, మద్దిరెడ్డిలు కోరగా, వీరు ముగ్గురు శుక్రవారం రాత్రి అడవి జంతువులను బెదరగొట్టేందుకు 12 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లారు. రాత్రి కావడంతో ఇద్దరు రైతులు నేలంతా పొలంలోకి వెళ్లడంతో కరెంట్ షాక్‌తో ఒక్క క్షణంలో ప్రాణాలు కోల్పోయారు. మరో రైతు రాజారెడ్డి గాయాలతో బయటపడ్డారు. వెంటనే తేరుకొని పెద్దగా కేకలు వేయడంతో సమీప రైతులు అక్కడకు చేరుకునేలోపే ప్రాణనష్టం జరిగిపోయింది. ఈ విషయం మండలమంతా వ్యాపించడంతో వేలాదిమంది రైతులు అక్కడకు చేరుకున్నారు. మృతుల్లో రామలింగారెడ్డికి భార్య సులోచన, కుమారుల రాజశేఖర్‌రెడ్డి (10), మహేశ్వర్‌రెడ్డి (11) ఉన్నారు. వెంకట్రమణారెడ్డికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. తంబళ్లపల్లి ఎస్ఐ దిలీప్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మద్దిరెడ్డి, భూమిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

హిందూమతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నాశనం చేస్తోంది

స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం



విశాలాంధ్ర - విజయనగరం (మున్సిపాలిటీ) : హిందూమతాన్ని సర్వనాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ తెలుగు అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఎన్‌వీఎస్ నాగరాజు దత్తత తీసుకున్న విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామంలో నిర్మించిన సామాజిక భవన సముదాయాన్ని శనివారం స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో రోడ్ల విస్తరణ, సదావర్తి భూముల వ్యవహారం, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో క్షుద్రపూజలు వంటివన్నీ ఇకపై ప్రభుత్వంపై ప్రభావం చూపుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది అనంతరం కొత్త సంవత్సరంలో గ్రామాలు, పల్లెలు, హిందూధర్మాన్ని పట్టించుకోని ప్రభుత్వంగా, ప్రజలకు వ్యతిరేకంగా మారిపోబోతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో 40కు పైగా దేవాలయాలను కూలదోసి దైవానుగ్రహాన్ని పొందని ఈ ప్రభుత్వానికి నష్టం తప్పదన్నారు. రాబోయే సంవత్సరమంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనిపిస్తున్న సూచనలు ఉన్నాయన్నారు. అప్రతిష్ట మూటకట్టుకోనున్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రజా వ్యతిరేకగా మారబోతోందని జోస్యం చెప్పారు.



బీసీల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడం

విశాలాంధ్ర - గూడూరు : వెనుకబడినవర్గాల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు అన్నారు. నెల్లూరు జిల్లా గూడూరు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తి కావస్తున్నా వెనుకబడినవర్గ ప్రజలు ఇంకా హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించడంలో బాధాకరమన్నారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, సబ్‌ప్లాన్‌ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పాలకులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పూలే భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు, స్థలాలు కేటాయించినప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కార్పొరేషన్లకు వెంటనే నిధులు విడుదల చేసి, నేరుగా రుణాలు అందించేలా పరిస్థితి ఎందుకు లేదో ఉన్నతాధికారులు సమీక్షించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోవటం లేదన్నారు. 2019 ఎన్నికల్లో బీసీ యువతకు అన్ని రాజకీయ పార్టీలు అత్యధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల బీసీ ఉద్యోగాలను వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్కే యాదవ్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మగ్దూమ్ మొహిద్దీన్, బహుజన నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం రోగులకు 'టెలీమెడిసిన్'

- నేటి నుంచి విశాఖ వైద్యుల సేవలు
- ఉచిత సేవలకు ఉద్దానం ఫౌండేషన్ సిద్ధం



విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉద్దానం ఫౌండేషన్ మరో వరం ప్రకటించింది. ఉన్నత వైద్యసేవల కోసం అనేక వ్యయప్రయాసలతో విశాఖ వెళ్లాల్సిన పనిలేకుండా విశాఖలోని స్పెషలిస్ట్ వైద్యుల నేరుగా ఉద్దానంలోని రోగుల మధ్య వీడియో కాన్ఫరెన్స్ తరహాలో 'టెలీమెడిసిన్' కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనుంది. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, విజయ దంపతులు సోంపేటలో ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలో శుద్ధ జల ప్లాంట్ల ద్వారా మినరల్ వాటర్ పంపిణీ, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉచిత అంబులెన్స్ ల ద్వారా రోగులను బరంపురం, విశాఖ తరలింపడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉద్దానం ఫౌండేషన్ తాజాగా మరో అడుగు ముందుకేసింది. 'టెలీమెడిసిన్' కోసం సోంపేటలోని జేకే ప్లాజాలో విశాలమైన కార్యాలయం ఏర్పాటుచేశారు. ఇక్కడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోగులకు విశాఖ నుంచి వైద్య నిపుణులు మాట్లాడేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని సిద్ధం చేసింది. విశాఖ నుంచి టెలీమెడిసిన్ ప్రక్రియ ద్వారా సేవలు అందించేందుకు శ్రద్ధ ఆసుపత్రి ముందుకొచ్చింది. నెఫ్రాలజిస్ట్, యూరాలజిస్ట్‌లు రోగుల పరిస్థితులను టెలిమెడిసిన్ ద్వారా పరీక్షించనున్నారు. రోగుల వైద్య పరీక్షల నివేదికలను సైతం టెలీమెడిసిన్ ద్వారా అధ్యయనం చేసి అవసరమైన మందులు సూచించనున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజలకు ఉచిత సేవలు కల్పించేందుకు ఉద్దానం ఫౌండేషన్ తగు చర్యలు చేపట్టనున్నట్టు ఫౌండేషన్ నిర్వాహకులు పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. ఉచిత టెలీమెడిసిన్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్‌కందా, హర్యానా డీజీపీ అనంతకుమార్ దుల్ రానున్నట్టు ఆయన తెలిపారు.

2022 నాటికి పేదలందరికీ పక్కా గృహాలు



విశాలాంధ్రప్రతినిధి - అనంతపురము : రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ 2022వ సంవత్సరం నాటికి పక్కా గృహాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామీణ గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. అనంతపురములోని ఆర్అండ్బీ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనాభా పెరుగుదలతోపాటు పట్టణీకరణతో నివాస గృహాల కొరత ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిలో 90 శాతం మంది ఇళ్ల కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సరసమైన ధరల్లో ఇళ్లు నిర్మించేలా ఎన్టీఆర్ గ్రామీణ నిర్మాణ పథకం, ఎన్టీఆర్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం, ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకాల ద్వారా అర్హులకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 19 లక్షల ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. గ్రామీణ గృహనిర్మాణ శాఖ ద్వారా 13 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గత అక్టోబర్ 2న గాంధీ జయంతినాడు ప్రపంచ ఆవాస్ దినోత్సవం సందర్భంగా లక్ష గృహప్రవేశాలు చేశామన్నారు. ఈ లక్షతో పాటు మరో లక్షన్నర ఇళ్లు పూర్తి కానున్నాయని, మార్చి నెలాఖరులోపు వీటి గృహప్రవేశం చేస్తామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణ పనులకు ఉద్యమంలా శంకుస్థాపనలు చేయాలన్నారు.

చిన్నారి చెవి పీకేసిన వీధి కుక్కల గుంపు



విశాలాంధ్ర - రెంటచింతల : వీధి కుక్కలు పదునైన పళ్ళతో కసితీరా కాటేస్తూ చిన్నారులను బలి తీసుకుంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఽ జనంపై దాడులు చేయడంతో వీధుల్లోకి రావాలంటే పెద్దలు సైతం హడలిపోతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా రెంటచింతల మండలం మెట్టగుడిపాడు గ్రామంలో శనివారం ఉదయం వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపర్చాయి. ఒక స్కూలు టీచర్పై విచక్షణరహితంగా దాడిచేశాయి. మూడేళ్ల చిన్నారి బలుగూరి నాగసైదమ్మపై కుక్కలు దాడి చేసి పళ్లతో పీకేయడంతో చిన్నారి ఎడమచెవి సగానికిపైగా తెగి వేలాడటంతో అల్లాడిపోయింది. షేక్ బంగారు అనే నాలుగు సంవత్సరాల చిన్నారి ఛాతీపై కాటేశాయి. మూడేళ్ల ఉప్పు ఈశ్వరి లక్ష్మీకుమారిని, కస్తూర్బా ఉపాధ్యాయురాలు శివలింగమ్మపైనా దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులంతా ఆటలాడుకుంటున్న సమయంలో కుక్కలు దాడిచేయడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలో కుక్కల సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తమ పిల్లల ప్రాణాలమీదకు వచ్చాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్లో అడవితక్కెళ్ళపాడులో రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన ప్రేమ్ (5)ను ఏడు కుక్కలు లాక్కెళ్లి కరిచి చంపేసిన సమయంలో హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు విశాఖలో రాష్ట్ర గిరిజన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం మున్సిపాలిటీ : పార్లమెంటు సమావేశాల్లో గిరిజన యూనివర్శిటీ బిల్లు ప్రవేశపెట్టాలని, బోయ, వాల్మీకి, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లును ఎంపీలంతా తిరస్కరించాలని కోరుతూ ఆదివారం విశాఖలోని గిరిజన భవన్లో రాష్ట్ర స్థాయి గిరిజన సదస్సు నిర్వహిస్తున్నట్టు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలుగు వెంకటరావు శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నిర్వాశితులకు పునరావాస కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాజక్టు పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. ఐక్య ఉద్యమాలకు రూపకల్పన జరుగుతుందని వెంకటరావు వివరించారు.


కాపు, బలిజలకు న్యాయం చేయండి



విశాలాంధ్ర - ఓర్వకల్లు : రాష్ట్రంలోని కాపు, బలిజ జాతిని బీసీ-ఎఫ్లో చేర్చి న్యాయం చేయాలని రాష్ట్ర కాపు, బలిజ ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ముద్రగడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో నష్టపోయిన కాపు, బలిజలను రాజకీయ పార్టీ నాయకులు వేళాకోళం చేస్తూ, బాధపెట్టి ఆడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం త్వరలో 50 వేల ఉద్యోగాలు విడుదల చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే కాపు, బలిజ నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అర్హత పొందడానికి బీసీ-ఎఫ్లో మార్చి 31 నాటికి చేర్చాలని, దీనికి దరఖాస్తు చేసుకునేందుకు తహశీల్దార్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్లో ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నారాయణరెడ్డి, అంగడి శ్రీనివాసులు, పుల్లారెడ్డి, చెన్నా రెడ్డి, గడేకారి ప్రభాకర్, యంగన్న, హెూటల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ధరల్లో దళారుల కోత

- అలంకారంగా కొనుగోలు కేంద్రాలు
- నెల్లూరు జిల్లాలో రైతుల దుస్థితి



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. రైతులకు మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. జిల్లాలో సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో 89, ఐకేపీ ఆధ్వర్యంలో 66, జిల్లా మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 13 కలిపి మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ మధ్య సమన్వయలోపం కారణంగా ప్రస్తుతం కేంద్రాలు ఫ్లెక్సీలకే పరిమితం అయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్స్, గోనె సంచులు, తేమశాతం కొలిచే మీటర్లు, వెయింగ్ స్కేలు.. తదితర పరికరాలు లేకపోవడంతో ఆయా సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. సంచులు, పరికరాలు వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేక దళారులకు తెగనమ్ముతున్నారు. దీంతో ధాన్యం వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరల్లో భారీ కోత వేస్తున్నారు. జిలకర మసూరి ధాన్యం ఏ గ్రేడ్ రకం 100 కేజీల బస్తా ధర రూ. 1590, సాధారణ రకం ధర రూ.1550గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. రైతుల పరిస్థితులను ఆవకాశంగా తీసుకుంటున్న దళారులు బస్తా రూ. 300 నుంచి రూ. 500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కుటుంబమంతా కాయకష్టం చేసి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు.

మిల్లర్లు వెనుకంజ

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు తరలిస్తుంది. మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ పద్ధతిలో ధాన్యం ఆడించి బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. 2016 సంవత్సరంలో వెలుగుచూసిన అక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. రైస్మిల్లులకు ధాన్యం తరలించాలంటే ఆయా మిల్లర్లు విధిగా తీసుకునే ధాన్యానికి సరిపడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి. బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి మిల్లర్లు ముందుకు రాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లుల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు చెల్లింపులోనూ అయోమయం నెలకొంది. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఉచితంగా మిల్లులకు చేర్చుతుంది. ఈ ఖర్చును తొలుత రైతులు భరిస్తే ఆ తర్వాత వారికి చెల్లిస్తారు. వీటి రవాణా కోసం వాహనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక కాంట్రాక్టర్ను నియమిస్తుంది. గత ఏడాది రైతులకు సక్రమంగా నగదు చెల్లించకపోవడంతో రైతులే రవాణా వ్యయం భరించారు. ట్రాక్టర్లతో ధాన్యాన్ని రైతులు మిల్లుల వద్దకు తీసుకెళ్లినా మిల్లర్లు స్పందించకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వకుండా పథకం ప్రకారమే వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో రైతులు గత్యంతరం లేక దళారులు, వ్యాపారులు, మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయిస్తారు. మిల్లర్లే కొన్నిచోట్ల దళారుల అవతారం ఎత్తుతున్నారు. గ్యారంటీ చూపకపోతే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయవచ్చని, గ్యారంటీ లేకుండా అధికారులే ధాన్యాన్ని పంపిస్తారనే ఆలోచనలో మిల్లర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

16 మంది మిల్లర్లే బ్యాంకు గ్యారంటీ

జిల్లాలో 250 రైస్ మిల్లులు ఉన్నప్పటికీ 16 మంది రైస్ మిల్లర్లు మాత్రం 8 కోట్ల 61 లక్షల రూపాయల బ్యాంకు గ్యారంటీ ఇచ్చారు. కడపకు చెందిన మరో ఆరుగురు మిల్లర్లు రూ. 7 కోట్లు గ్యారంటీలు ఇచ్చారు. సీఎంఆర్ బకాయిలున్న రైస్ మిల్లర్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఒక్క గింజ కూడా వెళ్లడానికి వీల్లేదని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు.

జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడంతో సుమారు 20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వృద్ధురాలు సజీవ దహనం

విశాలాంధ్ర - హిరమండలం/కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ వృద్ధురాలు సజీవ దహనమైంది. ఈ ఘటనతో పారాపురంలో విషాధఛాయలు అలము కున్నాయి. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం పారాపురంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్తో మంటలు చెలరేగి ఆ పక్కనే ఉన్న మిగిలిన 4 ఇళ్ళకు అంటుకోవడంతో అయిదు పూరిళ్ల అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంచంపై ఎటూ కదలలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు రీసి శాంతమ్మ ఇంటి నుండి బయటకు రాలేక మంటల్లోనే సజీవ దహనమైంది. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ రెడ్డి శాంతి శనివారం ఘటనా స్థలికి చేరుకొని బాధితులను, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అగ్నికి ఆహుతైన ఇళ్లకు గాను పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.



భారీగా ఎర్రచందనం పట్టివేత

విశాలాంధ్ర - పీలేరు : చిత్తూరు జిల్లాలోని పీలేరు-కడప జాతీయ రహదారిలో దుర్గంపల్లె టోల్ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో శనివారం భారీ స్థాయిలో ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీలేరు సమీపంలోని టోల్ప్లాజా వద్ద అడిషనల్ ఎస్పీ రాధిక పర్యవేక్షణలో పీలేరు అర్బన్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐ పీవీ సుధాకర్రెడ్డి, చిత్తూరు ఎస్టీఎఫ్ సిబ్బంది, పీలేరు అదనపు ఎస్ఐ సుమన్ సిబ్బంది తనిఖీ చేశారు. కడప నుంచి వస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ వేగంగా వెళ్ళిపోవడంతో పోలీసులు వెంబడించారు. లారీని డ్రైవర్ చెట్టును ఢీకొనడంతో లారీలోని కొందరు దిగి పారిపోయారు. వాహనంలోని 100 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వీటి బరువు సుమారు 2960 కిలోలు ఉంటుందని అంచనా వేశారు. కేవీపల్లె మండలం తువ్వపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇండికా విస్తా కారు అతివేగంగా దూసుకెళ్లడంతో పోలీసులు వెంబడించారు. కొత్తపల్లె హరిజనవాడ వద్ద దిగి డ్రైవర్, కొంత మంది వ్యక్తులు పారిపోయారు. దీనిలోని 9 ఎర్రచందనపు దుంగలను కేవీపల్లె పోలీస్స్టేషన్కు తరలించారు.

సీఆర్డీఏ ఓ ల్యాండ్ మాఫియా

- పూలింగ్కు భూమి ఇవ్వలేదని కక్ష సాధింపు
పండలనేని శ్రీమన్నారాయణ



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాజధాని అమరావతి ప్రాంతంలో సీఆర్డీఏ ఉన్నతాధికారులు ల్యాండ్ మాఫియాగా రైతులను మోసం చేస్తున్నారని రాజధాని నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో పిటిషన్ వేసిన పండలనేని శ్రీమన్నారాయణ తెలిపారు. విజయవాడ ప్రెస్క్లబ్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ ఇంప్లిమెంట్, సూపర్వైజర్ కమిటీలను నియమించిందన్నారు. అవి ఇంతవరకు ఎన్జీటీకి రిపోర్టులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్జీటీకి వ్యతిరేకంగా సీఆర్డీఏ అధికారులు రాత్రికి రాత్రి దొండపాడు, పాలవీడు, కోటివాగు ఏరియాల్లో మురుగునీరు వెళ్లే డ్రెయిన్లను మిషన్లతో పూడ్చివేస్తున్నారన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా ఈ ప్రాంతాల్లో ఎటువంటి పంటలు పండవని ఎన్జీటీ వారికి చూపించే ప్రయత్నిస్తున్నారన్నారు. రాజధాని కోసం పూలింగ్ భూములు ఇవ్వని వారి సర్వే నెంబర్లను ఇతర పేర్లతో కలిపి పూలింగ్కు ఇచ్చినట్లు సృష్టిస్తున్నారన్నారు. ఇలా మోసపోయిన మందడం గ్రామ రైతు పాతూరి తాతబాబు ఉన్నారన్నారు. తాతబాబు మాట్లాడుతూ మందడంలోని తనకున్న 18 ఎకరాల 56 సెంట్ల భూమిని పూలింగ్కు ఇవ్వలేదన్నారు. సీఆర్డీఏ అధికారులు తన భూమిలో కొంత ఇతర వ్యక్తులు పూలింగ్కు ఇచ్చినట్లు సృష్టించి వారికి కౌలు తరపున రూ.18 లక్షల చెక్కులు అందజేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులు తన భూమిని వదలకుంటే నిరవధిక నిరాహార దీక్షకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు.

విద్యుత్ తీగలకు ఇద్దరు రైతుల బలి



విశాలాంధ్ర - బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లి మండలం బాలిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు రైతులు శనివారం విద్యుత్షాక్కు మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల నిర్లక్ష్యానికి రెండు కుటుంబాలు వీధినపడ్డాయి. తంబళ్లపల్లి మండలంలోని దిగువపల్లికి చెందిన రైతులు భూమిరెడ్డి, మద్దిరెడ్డి తమ పొలంలో పంటను అడవి జంతువులు నాశనం చేస్తున్నాయన్న ఆందోళనతో శుక్రవారం రాత్రి పొలం చుట్టూ తీగలు లాగి విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఈ నేపథ్యంలో అదే పంచాయతీకి చెందిన అక్కెమ్మగారిపల్లి గ్రామ రైతులు రామలింగారెడ్డి (45), రాజారెడ్డి (35), సమీప దొడ్డికాడపల్లికి చెందిన రైతు వెంకట్రమణారెడ్డి (55)లను కూడా తమ పొలం వద్దకు రావాలని భూమిరెడ్డి, మద్దిరెడ్డిలు కోరగా, వీరు ముగ్గురూ శుక్రవారం రాత్రి అడవి జంతువులను బెదరగొట్టేందుకు 12 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లారు. రాత్రి కావడంతో ఇద్దరు రైతులు వేరుశనగ పొలంలోకి వెళ్లడంతో కరెంట్ షాక్తో ఒక్క క్షణంలో ప్రాణాలు కోల్పోయారు. మరో రైతు రాజారెడ్డి గాయాలతో బయటపడ్డారు. వెంటనే తేరుకొని పెద్దగా కేకలు వేయడంతో సమీప రైతులు అక్కడకు చేరుకునే లోపే ప్రాణనష్టం జరిగిపోయింది. ఈ విషయం మండలమంతా వ్యాపించడంతో వేలాదిమంది రైతులు అక్కడకు చేరుకున్నారు. మృతుల్లో రామలింగారెడ్డికి భార్య సులోచన, కుమారులు రాజేశ్వర్రెడ్డి (10), మహేశ్వర్రెడ్డి (11) ఉన్నారు. వెంకట్రమణారెడ్డికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. తంబళ్ళపల్లి ఎస్ఐ దిలీప్కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మద్దిరెడ్డి, భూమిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో గిరి రైతు ఆత్మహత్య



విశాలాంధ్ర - బెలగాం : వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పుల ఒత్తిడి పెరగడంతో పత్తిపంట కోసం తెచ్చిన పురుగుల మందు తాగి ఓ గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం విజయనగరం జిల్లా బెలగాంలో చోటుచేసుకుంది. కొమరాడ మండలం మసిమండ గ్రామానికి చెందిన గిరిజన రైతు జీలకర్ర చంద్రయ్య(55) కొన్నేళ్లుగా సుమారు ఎనిమిది ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఏటా పత్తి పంట పండించేవాడు. ఈ ఏడాది కూడా అప్పు చేసి పంట సాగుచేశాడు. కనీసం పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం వేకువజామున ఇంట్లోని పురుగుల మందు తాగేశాడు. నురగలు కక్కుకుంటున్న భర్తను గమనించిన భార్య జమ్మలమ్మ స్థానికుల సహకారంతో కూనేరు రామభద్రపురం పీహెచ్సీకి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్యకు భార్య, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కొమరాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిందూమతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నాశనం చేస్తోంది

స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం



విశాలాంధ్ర - విజయనగరం (మున్సిపాలిటీ) : హిందూమతాన్ని సర్వనాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంటోందని శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ తెలుగు అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఎన్పీఎల్ నాగరాజు దత్తత తీసుకున్న విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామంలో నిర్మించిన సామాజిక భవన సముదాయాన్ని శనివారం స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో రోడ్ల విస్తరణ, సదావత్తు భూముల వ్యవహారం, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో క్షుద్రపూజలు వంటివన్నీ ఇకపై ప్రభుత్వంపై ప్రభావం చూపుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది అనంతరం కొత్త సంవత్సరంలో గ్రామాలు, పల్లెలను, హిందూధర్మాన్ని పట్టించుకోని ప్రభుత్వంగా, ప్రజలకు వ్యతిరేకంగా మారిపోబోతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో 40కు పైగా దేవాలయాలను కూలదోస్తూ దైవానుగ్రహాన్ని పొందని ఈ ప్రభుత్వానికి నష్టం తప్పదన్నారు. రాబోయే సంవత్సరమంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనిపిస్తున్న సూచనలు ఉన్నాయన్నారు. అప్రతిష్ట మూటకట్టుకోనున్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రజా వ్యతిరేకిగా మారబోతోందని జోస్యం చెప్పారు.



బీసీల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడం

విశాలాంధ్ర - గూడూరు : వెనుకబడినవర్గాల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు అన్నారు. నెల్లూరు జిల్లా గూడూరు ఆర్అండ్బీ అతిథిగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తి కావస్తున్నా వెనుకబడినవర్గ ప్రజలు ఇంకా హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించడం బాధాకరమన్నారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపు, సబ్ ప్లాన్ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పాలకులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పూలే భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు, స్థలాలు కేటాయించినప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కార్పొరేషన్లు వెలిసినా నిరుపేదలకు నేరుగా రుణాలు అందించలేని పరిస్థితి ఎందుకు ఉందో ఉన్నతాధికారులు సమీక్షించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2019 ఎన్నికల్లో బీసీ యువతకు అన్ని రాజకీయ పార్టీలు అత్యధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల బీసీ ఉద్యోగాలను వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్కె.యాదవ్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మగ్దూమ్ మొహిద్దీన్, బహుజన నాయకులు నాశిన భాస్కర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో వ్యక్తిని కాల్చేశారు



విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని డంపింగ్ యార్డు వద్ద ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టడం శనివారం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించినట్టు జరిగింది. కాకినాడ డీఎస్పీ రవివర్మ తెలిపారు. ఐశ్వర్యనగర్కు చెందిన రాయుడు హరి (32) కనిపించటంలేదంటూ అతని అన్నయ్య రాయుడు శ్రీను సర్పవరం పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికే డంపింగ్ యార్డు వద్ద కాలుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చూసిన శ్రీను తన తమ్ముడిదే అని గుర్తించడంతో పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రాయుడు హరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. హరి భార్య భానుచందుకు భవానీప్రసాద్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగేదని, వీరిద్దరే తన తమ్ముని మరణానికి కారణమని అనుమానించడంతో భానుచందును అదుపులోకి తీసుకున్నామన్నారు. సీఐ దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

ఉద్దానం రోగులకు 'టెలీమెడిసిన్'

- నేటి నుంచి విశాఖ వైద్యుల సేవలు
- ఉచిత సేవలకు ఉద్దానం ఫౌండేషన్ సిద్ధం



విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో తీవ్ర వ్యాధులతో బాధ పడుతున్న రోగులకు ఉద్దానం ఫౌండేషన్ మరో వరం ప్రకటించింది. ఉన్నత వైద్యసేవల కోసం అనేక వ్యయప్రయాసలతో విశాఖ వెళ్లాల్సిన పనిలేకుండా విశాఖలోని స్పెషలిస్ట్ వైద్యులు నేరుగా ఉద్దానంలోని రోగుల మధ్య వీడియో కాన్ఫరెన్స్ తరహాలో 'టెలీమెడిసిన్' కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనుంది. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, విజయ దంపతుల నిర్వహణలో ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలో శుద్ధ జల ప్లాంట్ల ద్వారా మినరల్ వాటర్ పంపిణీ, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉచిత అంబులెన్స్ల ద్వారా రోగులను బరంపురం, విశాఖ తరలించడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉద్దానం ఫౌండేషన్ తాజాగా మరో అడుగు ముందుకేసింది. 'టెలీమెడిసిన్' కోసం సోంపేటలోని జేకే ప్లాజాలో విశాలమైన కార్యాలయం ఏర్పాటుచేశారు. ఇక్కడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోగులతో విశాఖ నుంచి వైద్య నిపుణులు మాట్లాడేలా ప్రత్యేక సాఫ్ట్వేర్ టెక్నాలజీని సిద్ధం చేసింది. విశాఖ నుంచి టెలీ మెడిసిన్ ప్రక్రియ ద్వారా సేవలు అందించేందుకు శ్రద్ధ ఆసుపత్రి ముందుకొచ్చింది. నెఫ్రాలజిస్టులు, న్యూరాలజిస్టులు రోగుల పరిస్థితులను టెలీమెడిసిన్ ద్వారా పరీక్షించనున్నారు. రోగుల వైద్య పరీక్షల నివేదికలను సైతం టెలీమెడిసిన్ ద్వారా అధ్యయనం చేసి అవసరమైన మందులు సూచించనున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని నాలుగు మండలాల్లో ప్రజలకు ఉచిత సేవలు కల్పించేందుకు ఉద్దానం ఫౌండేషన్ తగు చర్యలు చేపట్టనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. ఉచిత టెలీమెడిసిన్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్కందా, హర్యానా డీజీపీ అనంత్కుమార్ దుల్ రానున్నట్టు ఆయన తెలిపారు.

చిన్న వ్యాపారులను ప్రోత్సహిస్తే ఉపాధి అవకాశాలు



గిరిజాలలో భూ కేటాయింపుపై జీవో ఇవ్వలేదు

భారత మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ అధ్యక్షులు కె రమాదేవి

విశాలాంధ్ర-విశాఖపట్నం : చిన్న చిన్న వ్యాపారులను ప్రోత్సహిస్తే ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని భారత మహిళా పారిశ్రామిక వేత్తల అసోసియేషన్ అధ్యక్షురాలు (అలివ్) కన్నెగంటి రమాదేవి అన్నారు. విశాఖలో జరుగుతున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆమె విశాలాంధ్రతో మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు భూములు, రాయితీలు, ప్యాకేజీలు ఇచ్చినా స్థానికులకు పెద్దగా ఉపాధి దొరికే అవకాశాలు లేవన్నారు. వారు ఐఐఎం, ఐబిఎం, ఐఐటిల్లో చదివే వాళ్లకు, విదేశీయులకు ఉద్యోగాలిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పది, ఇంటర్, ఐటిఐ లేదా డిగ్రీ చదివే యువతకు స్వయం ఉపాధి, ఉద్యోగాలు రావాలంటే చిన్న ఎంటర్ ప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిఐఐ సదస్సులో అలివ్ తరుపున ఎంఓయులు కుదర్చుకుంటున్నారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ వాటితో పని లేకుండా తాము కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ శివారున సూరంపల్లిలో అలివ్‌కు 30 ఎకరాలు కేటాయిస్తే అందులో వేలాదిమందికి ఉపాధి లభించే కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో భూ కేటాయింపులు చేస్తే ఇక్కడ కూడా మహిళలే కాకుండా చిన్న పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పిస్తామన్నారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం గిరిజాల లో తాము కోరిన 50 ఎకరాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జివో జారీ చేయలేదన్నారు. కేవలం ప్రకటన మాత్రమే చేసిందన్నారు.

ఉత్తమ్ బ్లాస్టెక్‌తో సున్నపురాయి గని వెలికితీత



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: భద్రతతో పేలుడు పదార్థాలను ఉపయోగిస్తూ నిర్మాణాల కూల్చివేత, పేల్చివేతలో అనుభవజ్ఞులైన ఉత్తమ్ బ్లాస్టెక్ ప్రైవేట్ లిమిటెడ్...సిమెంట్ కర్మాగారానికి చెందిన సున్నపురాయి నిల్వ చెక్కుచెదరకుండా నిర్మాణాన్ని కూల్చివేసింది. నిరుపయోగంగా ఉన్న ఈ నిర్మాణం ఒక శిధిలమైన కట్టడం. భూమి పైపొర నుండి 80 మీటర్ల లోతు వరకు 3 కోట్ల టన్నుల పరిమాణం గల సున్నపురాయికి, చుట్టుపక్కల పరిసరాలకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్మాణాన్ని కూల్చివేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ వైరాగారె తెలిపారు. ఈ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత, చుట్టుపక్కల ప్రాంతాలకు ఎలాంటి నష్టం జరగకుండా పైన ఉన్న కట్టడాన్ని నేలకు సమాంతరంగా తీసుకువచ్చేందుకు ఇంజనీర్లు ఇంప్లోజిషన్ పద్ధతిని అమలు చేశారన్నారు. కూల్చివేత తరువాత వచ్చే ఫలితం ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని క్లయింట్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఈ సిమెంట్ ప్లాంట్‌కు దాదాపు 6 సంవత్సరాలకు సరిపడ సున్నపు రాయి నిల్వలు సమకూరినట్లయిందన్నారు. ఇంప్లొజిషన్ అనేది పేలుడు పదార్థాలను ఉపయోగించి నిర్మాణాలు కూల్చివేసే ఒక పద్ధతి అని, ఈ పద్ధతి ద్వారా వేగంగా, సురక్షితంగా కూల్చివేయవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ్ బ్లాస్టెక్ నైజీరియా, యూరప్, గల్ఫ్ దేశాలు, భూటాన్, నేపాల్ వంటి పలు దేశాల్లో పలు ప్రాజెక్టులు చేపట్టిందని శ్రీకాంత్ తెలిపారు.



ఎఫ్ఆర్‌డీఐ బిల్లును అడ్డుకోవాలి

ఐబీఈఎఫ్ 12వ జాతీయ మహాసభలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఫైనాన్షియల్ రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లును ఏకోన్ముఖంగా అడ్డుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలన్నీ కూడా ప్రజావ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఐబీఈఎఫ్)12వ జాతీయ మహాసభలు శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండ్రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం సమాఖ్య అధ్యక్షుడు కె కృష్ణన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల్లో మార్పు వచ్చే వరకూ ప్రజలకు మేలు జరగదన్నారు. నూతన ఆర్థిక విధానాలపై పోరాటం సాగించేందుకు అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పాలకుల తప్పిదాల వల్ల బ్యాంకింగ్ రంగం నిర్వీర్యమైపోతోందన్నారు. రైతులు రుణాన్ని చెల్లించకపోతే జైలుకు పంపే ప్రభుత్వాలు లక్షల కోట్లను ఎగ్గొట్టిన కార్పోరేట్ పెద్దలను ఎందుకు పట్టించుకోవడంలేదని గఫూర్ ప్రశ్నించారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లును వ్యతిరేకించాలని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ) ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగుల ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా మహాసభలో నిర్ణయాలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐబీఈఎఫ్ గౌరవ సలహాదారు తపన్‌దాస్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిస్వాస్, సభాధ్యక్షులు కృష్ణన్, ఎల్ఐసీ మహిళా కోఆర్డినేషన్ కమిటీ సభ్యురాలు ఎం కామేశ్వరి, ఏపీఎంఆర్ఎస్‌యూ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఐసీయూఎల్ ఉపాధ్యక్షులు సిహెచ్ కళాధర్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా దేశ నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు నగరంలో ర్యాలీ నిర్వహించారు.

ఎగవేతదారులపై చర్యలు చేపట్టాలి

- బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు వద్ద ధర్నా
- బ్యాంకులపై నమ్మకం కలిగించే బాధ్యత కేంద్రానిదే
- బెఫీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిస్వాస్




విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వేలాది కోట్లను ఎగవేసిన బడా కార్పొరేట్లపై చర్యలు చేపట్టడం ద్వారా బ్యాంకింగ్‌రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిస్వాస్ అన్నారు. విజయవాడలోని ఎంబీభవన్‌లో శనివారం ప్రారంభమైన ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ 12వ అఖిల భారత సదస్సుకు హాజరైన బిస్వాస్ విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ప్రభుత్వరంగంలోని బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు జరుగుతున్న యత్నాలను 1991 నుంచి సమాఖ్యలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగంలో బ్యాంకులు కొనసాగుతున్నందునే ప్రజలు తమ కష్టార్జితాన్ని జమ చేస్తున్నారని తెలిపారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లును చట్టం చేస్తే తాము నష్టపోతామన్న భావనతోనే ప్రజలు బ్యాంకుల నుంచి తమ డిపాజిట్లను వెనక్కు తీసేసుకుం టున్నారని ఆయన పేర్కొన్నారు. బ్యాంకులపై నమ్మకం కలిగించే బాధ్యత కేంద్రానిదేనని ఆయన స్పష్టం చేశారు. 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి అమెరికా, యూరప్ దేశాల్లో వందలకొద్దీ బ్యాంకులు కుప్పకూలిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బ్యాంకులపై ప్రభుత్వాల బాధ్యతలను తప్పించేందుకే జీ 20 దేశాల సదస్సులో ఎఫ్ఆర్‌డీఐ చట్టం చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. బ్యాంకింగ్ రంగంలో గత కొంతకాలంగా మొండిబకాయిలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారు రూ. 7 లక్షల కోట్ల వరకు మొండి బకాయిలున్నాయని, రాబోయే మార్చి నాటికి ఈ మొత్తం రూ. 10 లక్షల కోట్లకు చేరుకోవచ్చని తెలిపారు. మొండిబాకీల్లో 80 శాతం కార్పొరేట్ కంపెనీలే చెల్లించాల్సి ఉందన్నారు. ఎగవేతదారులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమ న్నారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లును చట్టం చేయకుండా అడ్డుకునేందుకు దేశంలోని 9 సమాఖ్యలతో ఐక్యపోరాటం సాగిస్తామన్నారు. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా బ్యాంకింగ్‌రంగాన్ని రక్షించాలని కోరుతూ అన్ని సంఘాలూ కలసి పార్లమెంటు ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించాయని, తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ సదస్సులో బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణ మాలు, ఎగవేతదారులపై కేంద్రం అవలంబిస్తున్న వైఖరి, ఎఫ్ఆర్‌డీఐ బిల్లు తదితర అంశాలపై లోతుగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొంది స్తామని బిస్వాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె కృష్ణన్, బెఫీ సలహాదారు తపన్‌దాస్, ఉప ప్రధాన కార్యదర్శి రంజన్ రాజ్ పాల్గొన్నారు.

సీమ లాయర్లతో చర్చలు జరపాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాయలసీమలో హైకోర్టు కోసం ఆందోళన సాగిస్తున్న న్యాయవాదులతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శనివారం లేఖ రాసారు. తమ ప్రాంతంలో హైకోర్టును ఏర్పాటు చేయాలని రాయలసీమ న్యాయవాదులు నెల రోజులుగా ఐక్యంగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వారికి విద్యార్థులు, యువతీయువకులు, ప్రజాసంఘాల నేతలు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోగా ఈనెల 22వ తేదీన మీ పర్యటన సందర్భంగా లాయర్లు, ప్రజాసంఘాలు, వామపక్షనాయకులను అరెస్టు చేయించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. తక్షణమే న్యాయవాదులతో చర్చలు జరడం శ్రేయస్కరమని మధు సూచించారు.

70 కోట్లతో వైట్ ట్యాపింగ్ రోడ్లు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సనత్‌నగర్ నియోజక వర్గంలోని అమీర్‌పేట్, సనత్‌నగర్, రాంగో పాల్‌పేట డివిజన్‌లలో రూ.70 కోట్ల ఖర్చుతో వైట్ ట్యాపింగ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం మేయర్ బొంతు రామ్మోహన్, మున్సిపల్ పరిపాలనా విభాగం ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ బి.జనార్దనరెడ్డితో కలిసి మంత్రి పర్యటిం చారు. బేగంపేటలోని గ్రీన్‌ల్యాండ్ నుండి అమీర్‌పేట సర్కిల్ వరకు రూ.11.81 కోట్లతో, అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ ఆలయం నుండి ఫతేనగర్ బ్రిడ్జి వరకు రూ.28.42 కోట్లతో, రాణిగంజ్ నుంచి రసూల్‌పురా వరకు రూ.18.66 కోట్లతో, గూడ్స్‌షెడ్ నుండి మూసాపేట జంక్షన్ వరకు రూ.10.15 కోట్లతో వైట్ ట్యాంపింగ్ రోడ్లను నిర్మించనున్నట్లు మంత్రి వివరించారు. ఈ రహదారులను రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్ఆర్‌డీసీఎల్ ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ రహదారుల నిర్మాణంలో భాగంగా సెంట్రల్ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు ఇరు వైపులా పాదచారుల కోసం పాదబాటలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

27న ఆదిలాబాద్‌కు కేసీఆర్

విశాలాంధ్ర-ఆదిలాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 27వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి స్థానిక అధికారులకు సమాచారమందింది. తన పర్యటనలో భాగంగా చనాకా-కొరాట బ్యారేజీ పనులను సీఎం పరిశీలించనున్నారు. చనాకా-కొరాట బ్యారేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలో జరుగుతున్న ఆయా అభివృద్ధి పనులను సీఎం పరిశీలించనున్నట్లు సమాచారం.



లూలూకు స్థలం అప్పగింత

శంకుస్థాపన చేసిన ఉపరాష్ట్రపతి, సీఎం

విశాలాంధ్ర- విశాఖపట్నం : విశాఖ సాగరతీరంలో విలువైన ఏపీఐఐసీకి చెందిన 9.12 ఎకరాలను ఏడాదికి రూ. 4.50కోట్లు లీజు కింద లూలూ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. శనివారం ఇదే స్థలంలో తాత్కాలిక వేదికలో ఏర్పాటు చేసిన సీఐఐ సమ్మిట్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు సురేష్ ప్రభు, అశోకగజపతిరాజు, రాష్ట్ర మంత్రులు శంకుస్థాపన చేశారు. లూలూ సంస్థకు వెలువైన స్థలాన్ని అప్పగించవద్దంటూ, లీజును రద్దు చేయాలంటూ గత కొద్ది రోజులు విపక్షాలు ఆందోళన నేపథ్యంలో భాగస్వామ్య వేదిక వద్దే శిలాఫలకం ద్వారా శంకుస్థాపన చేయడం ఆశ్చర్యాన్ని కలిగించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన లూలూ గ్రూపునకు రూ. 2వేల కోట్లు విలువైన స్థలాన్ని ఎకరాలకు రూ. 50 లక్షలు నామమాత్రపు లీజు చొప్పున 12.52 ఎకరాలు లూలూ గ్రూపునకు కేటాయించారు. మొదట లీజు కమ్ డెవలప్‌మెంట్ కింద ఏపిఐఐసీకి చెందిన 9.12 ఎకరాలును ఏడాదికి రూ. 4.51కోట్లు లీజు కింద ఇవ్వగా ఇది చాలదని. ప్రక్కనే ఉన్న సీఎంఆర్ సంస్థకు చెందిన మరో 3.40 ఎకరాల భూమిని సేకరించి ఇస్తున్నారు. దీనికి అధనంగా 5శాతం లీజు వసూలుచేయాలని నిర్ణయించారు. అయితే లూలూ కోసం తీసుకున్న భూమికి ప్రత్యామ్నాయంగా సీఎంఆర్ సంస్థకు నగరంలో రూ.5చోట్ల విలువైన 4.85 ఎకరాలు దాదాపు రూ. 500 విలువ చేసే ప్రభుత్వ భూమిని కేటాయించడంపై సీపీఐ సహా విపక్షాలన్నీ గత కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో సాక్షాత్తు ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రే శంకుస్థాపన చేయడంపై విశాఖ ప్రజలు, విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ భూ కుంభకోణంపై పెద్ద ఎత్తున ఆందోళనకు సన్నద్ధమవుతున్నాయి. దొడ్డిదారిలో శంకుస్థాపన చేయడం దుర్మార్గమని ఈ చర్యను సీపీఐ తీవ్రంగా ఖండించింది.

రాజ్యసభకు గౌతు శిరీష ?



విశాలాంధ్ర-పలాస : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న మనుమరాలు, పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ కుమార్తె,జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గౌతు శిరీషను రాజ్యసభకు పంపించే దిశగా తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా అసెంబ్లీలోనే సీనియర్ ఎమ్మెల్యే అయిన గౌతు శివాజీకి మంత్రి పదవి కట్టబెట్టడంలో అధిష్టాన వర్గం దృష్టి సారించకపోవడంతో అప్పట్లో శివాజీ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. సామాజిక వర్గాల సమీకరణలో ఆయనకు తృటిలో మంత్రి పదవి తప్పిందని, దీన్ని పూడ్చేందుకు ఆయన కుమార్తె శిరీషకు రాజ్యసభ పంపించాలని ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. పలాస నియోజకవర్గంలో మత్స్యకారులు ఎక్కువగా ఉండటంతో ఆ వర్గానికి పార్టీ చేరువ చేసేందుకు శిరీషను రాజ్యసభకు పంపించి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు నిలబెడితే పార్టీకి ఢోకా ఉండదని నిఘా విభాగం అధిష్టానం దృష్టికి తీసుకు ెళ్ళినట్లు సమాచారం.ప్రజాభిమానంతో ఎమ్మెల్యే శివాజీ 6 సార్లు ఎన్నికవడంతో శిరీషకు రాజ్యసభకు పంపిస్తారని టీడీపీ పార్టీ వర్గాలలో చర్చించుకుంటున్నారు. పార్టీ అధ్యక్షురాలుగా జిల్లాలో సుడిగాలి పర్యటన జరిపి పార్టీ అధినేత చంద్రబాబు దృష్టిని ఆకర్షించడంతో ముఖ్య మంత్రి ఆమె సభ్యత్వాన్ని ఖరారుచేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

గీతవృత్తిదారులకు రూ.3వేల కోట్లు

బొమ్మగాని ప్రభాకర్ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బడ్జెట్‌లో కల్లుగీత వృత్తి అభివృద్ధికి, వృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.3000 కోట్లు కేటాయించాలని రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వనపెంపకానికిగాను 5 ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాలకు కేటాయించేందుకు జారీ చేసిన జీవో అమలు కావడం లేదని, వనపెంపకానికి 10 ఎకరాల భూమి, సహకార సంఘాల కార్యకలాపాలకు భవనాలు, వనాలలో షెడ్డులు, బోరు బావుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభాకర్ డిమాండు చేశారు. హరితహారంలో నాటిన చెట్ల పెంపకానికిగాను నీటి సరఫరాకు నిధులు విడుదల చేయాలని కోరారు.

కొల్లాపూర్‌లో కందుల కొనుగోలు కేంద్రం : హరీశ్

విశాలాంధ్ర-నాగర్ కర్నూల్: కొల్లాపూర్‌లో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. నియోజకవర్గంలో రూ. 1000 కోట్లతో గోదాములు నిర్మించామన్నారు. కేఎల్ఐ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు రావడం ఆనందంగా ఉందన్నారు. మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు శనివారం జిల్లాలో పర్యటించారు. వీపనగండ్ల, పానగల్‌లో గోదాములను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతులు పాస్ పుస్తకాలు ఇవ్వొద్దని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. పాలమూరు రంగారెడ్డి, కేఎల్ఐ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు ఇచ్చి మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రాజెక్టులను అడ్డుకుంటుందన్న మంత్రి... టీఆర్ఎస్ పాలనలో రైతుల్లో ఆనందం చూస్తున్నామన్నారు.

మహిళల కోసం ప్రత్యేక కలెక్షన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సమాజంలో మహిళా స్థానానికి ఉన్న ప్రత్యేకతను వారి ప్రగతిని గురించి తెలిపేందుకు ప్రముఖ దుస్తుల సంస్థ 'అండ్' ముందుకొచ్చింది. మహిళా దినోత్సవం సందర్భంగా వారికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక కలెక్షన్‌ను అందిస్తోంది. సీజన్‌ను బట్టి వారి అవసరాల దృష్ట్యా సమ్మర్ కలెక్షన్‌ను తీసుకొచ్చినట్టు హౌస్ ఆఫ్ అనితా డోంగ్రే చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ అనితా డోంగ్రే తెలిపారు. ఈ నూతన కలెక్షన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా కరీనా కపూర్ వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రధాన నగరాలలో ఈ కలెక్షన్ అందుబాటులో ఉంది.

టీఎస్ కాప్ మొబైల్ యాప్‌కు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇటీవల రాష్ట్రంలో విడుదల చేసిన టీఎస్ కాప్ మొబైల్ యాప్ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఉత్తమ అవార్డుగా ఎంపికైంది. తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగి స్తున్న టీఎస్ కాప్ ఈ అత్యుత్తమ అవార్డుకు ఎంపికైందని డీజీపీ కార్యా లయం వెల్లడించింది. తెలంగాణ పోలీస్ శాఖకు ఉత్తమ అవార్డు రావడంపై డీజీపీ మహేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 28న చెన్నైలో ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీస్ శాఖ అవార్డును అందుకోనుంది.

ఎన్‌టీఎస్‌ఈ పరీక్షను రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఎన్‌టీఎస్‌ఈ పరీక్షను రద్దు చేయాలని డిమాండు చేస్తూ ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు, నాయకులు శనివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద జరిగిన ఆందోళనల్లో అనేక మంది పాల్గొని ప్రభుత్వ చర్యలను నిరసిం చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వేణు, రావి శివరామకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలతో విద్యాశాఖ అధికారులు భాగస్వామ్యం అయ్యారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల అండదండలతో ఎన్‌టీఎస్‌ఈ విధానాన్ని అమలులోకి తెచ్చారని విమర్శించారు. కేంద్రప్రభుత్వం ఎన్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌టీ ఎస్‌ఈ మొదటి దశ పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. 2018 పరీక్షా ఫలితాల్లో ఒకే సెంటర్ నుంచి 20 మంది విద్యార్థులు ఎలా ఎంపికవుతారని ప్రశ్నించారు. ఎన్‌టీఈఎస్ పరీక్షా విధానాన్ని రద్దు చేయకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, చైతన్య యాదవ్, రఘు, లక్ష్మణ్, రాజేష్, దిలీప్ పాల్గొన్నారు.

ఉద్యోగం లేదా భృతి

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకుంది. పోలీసులు ఆందోళనకారులను అరెస్టుచేసి కారులోకి ఎక్కించేందుకు ప్రయత్నించడంతో కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాముడు, కారుమంచి, సహాయ కార్యదర్శులు పులిశేఖర్, చంద్రశేఖర్, బాబయ్య, నభి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్‌తో సహా 50 మందిని అరెస్టుచేసి మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసుల జీపును అడ్డుకున్నారు. పోలీసులకు, ఆందోళన కారుల మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఆందోళకారులను మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ప్రతాప్ రమేష్, బాలకృష్ణ, బీసన్న, తిమ్మగురుడు, సుధాకర్, రవి, మునిస్వామి, వీరేష్, రమేష్‌తోపాటు పెద్దఎత్తున విద్యార్థి, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత నిరుద్యోగులను దగా చేసిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండు చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా పోలీసులు అనవసర రాద్ధాంతం సృష్టించి యువజన సమాఖ్య కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్ విజయవాడలో ఒక ప్రకటన విడుదల చేశారు.



పకోడి విక్రయిస్తూ వినూత్న నిరసన

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం వినూత్న కార్యక్రమం జరిగింది. పలువురు యువకులు పకోడిని విక్రయించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక లెనిన్‌సెంటరు వద్ద సమాఖ్య కృష్ణాజిల్లా సమితి, విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో పకోడీని విక్రయించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ మాట్లాడుతూ ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో మోడీ హామీ ఇచ్చారన్నారు. అయితే నాలుగేళ్ల గడచినా ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు సరికదా.. ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు రంగానికి అప్పగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నరేష్, నాయకులు పరుచూరి రాజేంద్రబాబు, ప్రభాకర్, మొహినుద్దీన్, ఎస్‌కే సుభానీ, క్రాంతికుమార్, ఆంజనేయులు, చన్నయ్య, చిన్నారావు, శివకుమార్, గరికె బాబు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. గుంటూరు, విశాఖపట్నం, అనంతపురంలలో జరిగిన కార్యక్రమాలలో కూడా యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు హడ్కో డిజైన్ అవార్డు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో మెరుగైన పనితీరు కనబర్చినందుకు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు హడ్కో డిజైన్ అవార్డు-2017 లభించింది. పట్టణ, గ్రామీణ పేదలకు పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో సృజనాత్మకత, విపత్తులను ఎదుర్కొనేలా పటిష్టమైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తున్నందుకు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఈ అవార్డు ఇస్తున్నట్లు హడ్కో ప్రకటించింది. ఢిల్లీలో హడ్కో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారంలో ఈ అవార్డును అందజేయనున్నట్లు హడ్కో తెలిపింది. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట, ఖమ్మం, సూర్యాపేటలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను హడ్కో బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆ ఇళ్ల నిర్మాణంలో మెరుగైన పనితీరు కనబరుస్తున్నందుకు ఈ అవార్డు ప్రకటించింది. అవార్డుపై గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కృషికి సరైన గుర్తింపు లభించిందన్నారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలనే సదుద్దేశంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకానికి రూపకల్పన చేశామని, దీనికి దేశవ్యాప్త గుర్తింపు లభిస్తోందనడానికి హడ్కో అవార్డే నిదర్శమన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ...పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తుండటంతో హడ్కో అవార్డు లభించిందని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ తెలిపారు. కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లిస్తుండటాన్ని హడ్కో ప్రశంసించిందన్నారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే టన్నుకు రూ.9440 డబుల్ ఇళ్లకు ఇనుమును విక్రయించేలా స్టీల్ కంపెనీలను ఒప్పించినందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అభినందనలు వచ్చాయన్నారు.

విశాలాంధ్ర

క్రీడలు

కెప్టెన్ ఎవరో లైవ్‌లో ప్రకటిస్తారట!



ఢిల్లీ: రెండేళ్ల నిషేధం తర్వాత ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో అడుగు పెడుతోన్న రెండు జట్లలో ఒకటి రాజస్థాన్ రాయల్స్. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ ఏడాది కోసం రాజస్థాన్ ఇప్పటి వరకు తన జట్టుకు ఎవరు నాయకత్వం వహిస్తారో వెల్లడించలేదు. అయితే తాజాగా ఆ ఫ్రాంఛైజీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రోజు అంటే శనివారం(ఫిబ్రవరి 24) నాడు స్టార్ స్పోర్ట్స్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. కెప్టెన్ పదవి కోసం ప్రధానంగా వినిపిస్తోన్న పేర్లు ఏవంటే.. ఆస్ట్రేలియా జట్టును ఎంతో సమర్థవంతంగా ముందుకు నడుపిస్తోన్న స్టీవ్ స్మిత్. ఆ తర్వాత రహానె, బెన్ స్టోక్స్, జోస్ బట్లర్ పేర్లు చర్చకు వచ్చాయి. స్టోక్స్ గత ఏడాది రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌కు నాయకత్వం వహించాడు. జట్టును ఫైనల్స్‌కు తీసుకు రావడంలో కీలకపాత్ర పోషించాడు. అందుకే స్టోక్స్‌కే సారథ్య బాధ్యతలు వహించాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నలుగురిలో ఎవరకి నాయకత్వం దక్కుతుందో ఇంకొద్ది గంటలు మాత్రమే వేచి ఉండాలి. ఈ మేరకు రాజస్థాన్ రాయల్స్ స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా కెప్టెన్ ఎవరో వెల్లడించనుంది.

చరిత్ర సృష్టించిన అరుణ

- జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్ టోర్నీలో కాంస్య పతకం కైవసం
- మెగా టోర్నీలో పతకం గెలిచిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా రికార్డు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న ప్రపంచ జిమ్నాస్టిక్స్ టోర్నీ లో తెలుగు తేజం అరుణ బి. రెడ్డి కాంస్య పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ప్రపంచకప్ టోర్నీలో పతకం గెలుచుకున్న మొదటి భారతీయ జిమ్నాస్ట్‌గా రికార్డుల్లో కెక్కింది. మహిళల వాల్ట్ విభాగంలో నిర్వహించిన పోటీలో అరుణ రెండుసార్లు పోటీపడి 13.649 సగటుతో మూడో స్థానంలో నిలిచింది. కాగా స్లోవేనియాకు చెందిన జన కిస్లెఫ్ (13.800) స్వర్ణ పతకం గెలుచుకోగా, ఆస్ట్రేలియాకు చెందిన ఎమిలి వైట్‌హెడ్(13.699) రజత పతకం దక్కించుకుంది. ఇదే ఈవెంట్లో మరో భారత అమ్మాయి ప్రణతి నాయక్(13.416) ఆరో స్థానంలో నిలవడం విశేషం. జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో భారత్ తరఫున పతకం గెలిచిన తొలి మహిళగా 22 ఏళ్ల అరుణ చరిత్ర సృష్టించింది. అరుణ హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి. కరాటేలో ఆమె బ్లాక్ బెల్ట్ సాధించారు. గతంలో కరాటే శిక్షకురాలిగా కూడా పనిచేశారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో అరుణ జిమ్నాస్టిక్స్ క్వాలిఫయింగ్ రౌండ్స్‌లో 14వ స్థానంలో నిలవగా, ఆసియా గేమ్స్‌లో తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. కాగా 2010లో న్యూఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తొలి భారతీయుడిగా అశిష్‌కుమార్ నిలిచారు. 2014 కామన్‌వెల్త్ గేమ్స్‌లో మహిళల విభాగంలో దీపా కర్మాకర్ కాంస్య పతకం దక్కించుకుంది. 2016లో జరిగిన రియో ఒలింపిక్స్‌లో కర్మాకర్. ఫైనల్లో త్రుటిలో పతకాన్ని కోల్పోయినప్పటికీ 52 ఏళ్ల తర్వాత జిమ్నాస్టిక్స్ విభాగంలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన మహిళగా రికార్డు సృష్టించిన సంగతి విదితమే. ఆ తర్వాత జిమ్నాస్టిక్స్‌లో ప్రపంచస్థాయిలో గుర్తింపు చెందిన క్రీడాకారిణిగా అరుణ నిలిచింది.





ఇదే రోజు సచిన్ ప్రపంచ రికార్డు!

న్యూఢిల్లీ: సరిగ్గా ఎనిమిదేళ్ల క్రితం.. ఇదే రోజున క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని అరుదైన రికార్డును సృష్టించి ప్రపంచం మొత్తాన్ని తనవైపు తిప్పుకున్నాడు. ఫిబ్రవరి 24, 2010 ఇండోర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో సచిన్ శివమెత్తి పోయాడు. ఏకంగా డబుల్ సెంచరీ బాది ఆ రికార్డు నెలకొల్పిన తొలి క్రికెటర్‌గా చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నాడు. మొత్తం 147 బంతులను ఎదుర్కొన్న సచిన్ 25 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 200 పరుగులు చేశాడు. 90 బంతుల్లోనే తొలి సెంచరీ నమోదు చేసిన మాస్టర్ బ్లాస్టర్ తర్వాత వంద పరుగులు చేయడానికి కేవలం 57 బంతులే తీసుకున్నాడు. సచిన్ మొత్తం స్కోరులో వందకుపైగా పరుగులు బౌండరీల ద్వారా వచ్చినవే. సచిన్ సెంచరీ చేసిన నాటికి వన్డేల్లో అదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. సచిన్ సెంచరీ చేసిన ఏడాది తర్వాత టీమిండియా విధ్వంసకర ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ విండీస్‌పై 219 పరుగులు చేసి డబుల్ సెంచరీ సాధించిన రెండో భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఆ తర్వాత కూడా డబుల్ సెంచరీల వరద కొనసాగింది. టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ ఏకంగా మూడుసార్లు డబుల్ సెంచరీలు సాధించి ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. విండీస్ విధ్వంసకర ఆటగాడు క్రిస్‌గేల్ కూడా ఫిబ్రవరి 24, 2015లో జింబాబ్వేపై చెలరేగి ఆడి 215 పరుగులు చేశాడు. ఇందులో పది ఫోర్లు, 16 సిక్సర్లు ఉన్నాయి.

ఒంటి చేతి వీరుడు



హెడింగ్లీ: హెల్మెట్ పెట్టుకుని.. ఒంటి నిండా రక్షణ కవచాలు ధరించినా.. బంతి ఏ మూల వచ్చి తాకుతుందోనన్న భయం ఈ తరం క్రికెటర్లది. అలాంటిది హెల్మెట్ లేకుండా.. ఒకవైపు చేతికి గాయమై.. నిఖార్సైన పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొంటూ ఒంటి చేత్తో బ్యాటింగ్ చేస్తే..? అలా ఎవరు చేస్తారు అనేయకండి! వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ మల్కం మార్షల్ ఈ సాహసం చేశాడు. 1984 ఇంగ్లాండ్-వెస్టిండీస్ నాలుగో టెస్టులో జరిగిందీ సంఘటన. హెడింగ్లీలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌటైంది. విండీస్ ఒక దశలో 201/4తో మెరుగైన స్థితిలో ఉంది. అయితే ఇంగ్లాండ్ బౌలర్లు విజృంభించడంతో ఆ జట్టు 206 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. గోమ్స్ (104 నాటౌట్)కు మద్దతుగా నిలిచే వాళ్లే కరవయ్యారు. గాయపడిన మాల్కం మార్షల్ క్రీజులోకి రావడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. పాల్ అలాట్ వేసిన బంతిని ఒంటి చేత్తో ధైర్యంగా ఎదుర్కొంటూ అతను ఫోర్ కొట్టడంతో స్టేడియం హోరెత్తింది. ఆ తర్వాత మార్షల్ ఔటైనా.. అతని స్ఫూర్తికి, సాహసానికి అభిమానులు నిలబడి చప్పట్లతో అభినందించారు. ఆ తర్వాత ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో మార్షల్ (7/53) బౌలింగ్‌లోనూ విజృంభించి విండీస్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

బెన్‌స్టోక్స్ పునరాగమనం



లండన్: ఓ వ్యక్తిపై దాడి కేసులో విచారణ కారణంగా దాదాపు ఆరు నెలల పాటు జట్టుకు దూరమైన ఇంగ్లండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ పునరాగమనం ఖాయమైంది. ఆదివారం నుంచి న్యూజిలాండ్‌తో ఆరంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌కు స్టోక్స్ సిద్ధమయ్యాడు. దీనిలో భాగంగా హామిల్టన్‌లో జరిగే తొలి వన్డేలో స్టోక్స్ ఆడే విషయాన్ని ఈసీబీ మేనేజ్‌మెంట్ ఖరారు చేసింది. ముందుగా ప్రకటించిన ఇంగ్లండ్ జాబితా ప్రకారం తొలి వన్డేకు స్టోక్స్‌ను ఎంపిక చేయలేదు. కేవలం స్వల్ప ప్రాక్టీస్‌కు మాత్రమే పరిమితమైన కారణంగా స్టోక్స్‌ను తొలి వన్డేకు ఎంపిక చేయలేదు. అయితే ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ సూచన మేరకు స్టోక్స్‌ను తొలి వన్డేలో ఆడించాలని నిర్ణయించారు. దాంతో ఇంగ్లండ్ స్క్వాడ్‌లో స్టోక్స్ పేరును చేర్చారు.

సఫారీ గడ్డపై అమ్మాయిల విజయదుందుభి

- దక్షిణాఫ్రికాపై టీ20 సిరీస్ కైవసం
- అర్ధసెంచరీతో చెలరేగిన మిథాలీరాజ్
- భారత బౌలింగ్‌కు సఫారీల విలవిల
- సఫారీ గడ్డపై సిరీస్ గెలిచిన తొలి మహిళా జట్టు

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో గెలిచి భారత మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికా గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సొంతం చేసుకున్న మహిళల తొలి జట్టుగా భారత్ నిలిచింది. చివరి మ్యాచ్‌లో సఫారీ జట్టుపై 54 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించడంతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-1 తేడాతో కైవసం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. మిథాలీరాజ్ 62(64), రోడ్రిగ్స్ 44(48) రాణించడంతో పాటు, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 27(19) మెరుపులు మెరిపించిన వేళ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి.. 166 పరుగులు చేసింది. 167 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన సఫారీ జట్టుకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. 50 పరుగులకే కీలకమైన ఐదు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన ట్రయాన్ 25(28), కాప్ 27(34)లు కొద్దిసేపు భారత్ బౌలర్లను ప్రతిఘటించారు. అయితే ఎక్కువ సేపు క్రీజులో నిలదొక్కుకోలేక పోయారు. చివరకు 18 ఓవర్లలో 112 పరుగులకు దక్షిణాఫ్రికా జట్టు ఆలౌటైంది. భారత్ బౌలర్లలో షిఖా పాండే, రుమేలి ధర్, రాజేశ్వరి గైక్వాడ్‌లు తలో మూడు వికెట్లు తీయగా, పూనమ్‌యాదవ్‌కు ఒక వికెట్ దక్కింది. చివరి మ్యాచ్‌లోనే కాకుండా సిరీస్ ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన మిథాలీరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్', 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు దక్కాయి.







అఫ్రిది సూపర్ క్యాచ్ చూశారా?

కరాచీ: పాకిస్థాన్ ఆటగాడు షాహిద్ అఫ్రిది ఏది చేసినా సంచలనమే. ఒక్కోసారి ఆకాశమే హద్దుగా బ్యాటింగ్‌తో ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపిస్తాడు. మరోసారి ఆఫ్ లెగ్ బ్రేక్ బౌలింగ్‌తో బ్యాట్స్‌మెన్‌ను ఇట్టే మాయ చేస్తుంటాడు. ఆఖరికి ఫీల్డర్‌గా మైదానంలో చురుగ్గా కదులుతూ ఎవరికీ సాధ్యం కాని రీతిలో క్యాచ్‌లు అందుకుంటుంటాడు. ఒక్కోసారి ఎవరికీ అర్థం కాని విధంగా క్రికెట్ నుంచి తప్పుకొంటానంటూ అందర్నీ ఆశ్చర్యపరుస్తుంటాడు. మళ్లీ కొంతకాలం గడిచాక 'నా నిర్ణయం సరైంది కాదు ఇలాంటి కీలక సమయంలో జట్టుకు నా సేవలు ఎంతో అవసరం' అంటూ రిటైర్మెంట్ ప్రకటనను వెనక్కి తీసుకుంటాడు. ఇలా ఏదో ఒక విధంగా వార్తల్లో నిలవడం ఈ పాకిస్థాన్ ఆటగాడికి షరామామూలే. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అసాధారణమైన క్యాచ్ అందుకొని మరోసారి వార్తల్లో నిలిచాడు అఫ్రిది. లీగ్‌లో కరాచీ కింగ్స్ తరుపున ఆడుతున్న ఈ వెటరన్ ఆటగాడు, క్వెట్టా గ్లాడియేటర్స్ బ్యాట్స్‌మెన్ ఉమర్ అమిన్ కొట్టిన భారీ షాట్‌ను అద్భుతంగా ఒడిసిపట్టుకున్నాడు. లాంగాన్ బౌండరీ మీదుగా అమిన్ కొట్టిన బంతిని అఫ్రిది ఒక్క చేత్తో ఎగిరి అందుకున్నాడు. ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్ హల్‌చల్ చేస్తోంది. ఆటకు వయస్సుతో సంబంధం లేదంటూ యువ ఆటగాళ్లకు అఫ్రిది ఎప్పటికీ ఆదర్శమంటూ అభిమానులు ట్వీటర్ వేదికగా అతణ్ని తెగ పొగిడేస్తున్నారు. మరికొందరైతే అఫ్రిది అందుకున్న ఈ క్యాచ్ 2009 నాటి క్యాచ్‌ను గుర్తు చేస్తోందంటూ పోస్ట్ చేశారు. ఇంకొందరు ఇలాంటి అసాధారణ ప్రతిభ లాలాకు మాత్రమే సొంతం అంటున్నారు. ఏది ఏమైనా 38ఏళ్ల వయస్సులోనూ అఫ్రిది ఆటలో జోష్ తగ్గలేదంటూ మరోసారి నిరూపించాడు. లీగ్‌లో జరిగిన ఈ రెండో మ్యాచ్‌లో కరాచీ కింగ్స్ 19 పరుగుల తేడాతో గ్లాడియేటర్స్‌ను ఓడించింది. 16 ఏళ్ల వయస్సులో పాక్ జట్టులోకి అడుగుపెట్టిన అఫ్రిది తాను ఆడిన రెండో మ్యాచ్‌లోనే 37బంతుల్లో సెంచరీ సాధించి వన్డేల్లో ఫాస్టెస్ట్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

సిగ్గుతో తల దించుకుంటున్నా: సెహ్వాగ్



హైదరాబాద్: కేరళలో సంచలనం కలిగించిన ఆదివాసి మధు హత్య కేసుపై భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందించాడు. కేజీ బియ్యం దొంగతనం చేశాడని దాడిచేసిన ఉబైద్, అబ్దుల్ కరీం, హుస్సేన్‌లు మధు మరణానికి కారణం అయ్యారంటూ తన ట్వీటర్ అకౌంట్‌లో రాసుకొచ్చాడు. ఇది ఆధునిక సమాజంలో జరిగిన అవమానకర మైన సంఘటనగా అభిప్రాయపడ్డాడు. ఈ ఘటనపై సిగ్గుతో తలదించుకుంటున్నానని సెహ్వాగ్ అన్నాడు. కేరళలో తినుబండా రాలు దొంగిలించాడని ఒక 27 ఏళ్ల మతిస్థిమితం లేని ఆదివాసిని స్థానికులు దారుణంగా కొట్టి చంపిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై పలు మానవహక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

సచివాలయం దగ్గర స్వల్ప ఉద్రిక్తత

రహదారి నిర్మాణంపై వివాదం



విశాలాంధ్ర-అమరావతి: వెలగపూడి సచివాలయం దగ్గర స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. సీఆర్డీఏకి ఇవ్వకుండానే తన భూమిలో రోడ్డు వేసే ప్రయత్నం చేస్తున్నారంటూ స్థల యజమాని అభ్యంతరం తెలపడంతో రోడ్డు నిర్మాణం నిలిపి వేశారు. శనివారం చోటు చేసుకున్న ఈ సంఘటనపై వివరాల్లోకి వెళితే రాజధాని రహదారుల నిర్మాణంలో భాగంగా ఆర్టిరియల్ రహదారి నిర్మాణం జరుపుతూ అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులు పనులు వేగవంతం చేస్తున్నారు. కాగా సచివాలయం వెనక నుంచి ఎన్‌హెచ్-9 రహదారి పేరిట నిర్మిస్తున్న రోడ్డు గద్దె రామ్ మీరా ప్రసాద్ అనే విజయవాడకి చెందిన వ్యక్తి పొలం గుండా నిర్మాణం చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే సదరు ప్రసాద్ తనకి చెందిన ఎకరం 40 సెంట్ల భూమిని సీఆర్డీఏకి ఇవ్వలేదు. దీంతో తన పొలం ల్యాండ్ పూలింగ్‌కి ఇవ్వలేదని, అయినప్పటికీ బలవంతంగా రహదారి నిర్మించేందుకు ప్రయత్నించటం అమానుషమని రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. తాను కోర్టు నుంచి భూమిలో ఏ విధమైన నిర్మాణాలు చేయరాదని ఇచ్చిన కాపీని చూపించారు. ఈ క్రమంలో అధికారులు రహదారి నిర్మాణం నిలిపేసి వెళ్లిపోయారు. అయితే స్థానిక డిప్యూటి కలెక్టర్ విజయలక్ష్మి మాత్రం వివాదాల్లో ఉన్న భూమి అయినప్పటికీ సీఆర్డీఏకి ఇచ్చేందుకు తొంభై శాతం పని పూర్తయిందని అన్నారు. అందుకే రహదారి నిర్మాణం చేపట్టామని వివరించారు. కాగా ఈ ఆర్టిరియల్ రోడ్డు కరకట్ట పక్కగా రాజధాని గ్రామాలను కలుపుతూ నిర్మితం కానుంది. అయితే భూమి యజమాని అభ్యంతరం తెలపటంతో తాత్కాలికకంగా రహదారి నిర్మాణం నిలిపి వేశారు. ఈ నేపథ్యంలో అధికారులకు, బాధితుడికి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది.

వ్యవసాయం నిల్

- శ్రద్ధచూపని పాలకులు
- సలహాలు, సూచనలిచ్చే అధికారులు కొరత
- కనీస ఆదాయం కూడా లభించక రైతుల అవస్థలు



విశాలాంధ్ర-చింతలపూడి: దేశంలో 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నా వ్యవసాయానికి సరైన గుర్తింపుగాని, ఆదరణగాని లేదు. ప్రపంచంలో ప్రతి జీవి మనుగడకు ముఖ్యమైనది, ప్రధానమైనది ఆహారం. వ్యవసాయంపై మన దేశంలో ప్రభుత్వాలు సరైన శ్రద్ధ చూపడం లేదు. రాజకీయ నాయకులుగాని, ఉన్నత స్థాయిలోని అధికారులు గాని దేశంలో రైతులకు కావాల్సిన అవసరాలు, వారికి ఉన్న ఇబ్బందులు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దేశంలో ప్రజలకు ఆహారం అందించే వ్యవసాయరంగంపై ఆధారపడిన వారికి అవసరమైన సలహాలు ఇవ్వడానికి, సంప్రదించడానికి అవసరమైన వ్యవసాయాధికారులు లేకపోవడం విచారకరం. మన దేశంలో ఇంజనీరింగ్ కాలేజీలు 3500కు పైగా ఉండగా వ్యవసాయ కళాశాలలు మాత్రం 300 లోపే ఉన్నాయి. మన పాలకులకు వ్యవసాయంపై ఉన్న నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం. 70 శాతం మందికి అవసరమైన వ్యవసాయ శాఖకు మండలానికి కేవలం నలుగురైదుగురు సిబ్బంది ఉంటారు. వీరు ఏమాత్రం సరిపోరు. పాలకులు, రాజకీయ నాయకులు, అధికారులు అందరూ వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే. రాజకీయ నాయకులకు, పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు, ఉద్యోగస్తులకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. వ్యవసాయదారులకు, వ్యవసాయ కూలీలకు మాత్రం స్థిరమైన ఆదాయం ఉండడం లేదు. వ్యవసాయాధారిత కుటుంబాల వారందరూ పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ కుటుంబాల నుంచి విద్యావంతులైన వారు కూడా ఉద్యోగాల వైపు ఆకర్షితులవుతున్నారు తప్ప వ్యవసాయం చేయాలనే ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయదారులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వాల నుండి అండదండలు లేనిపక్షంలో వ్యవసాయరంగం నిరాధారణకు గురై రాబోయే రోజుల్లో ప్రజలకు ఆహారం దొరకని పరిస్థితి ఏర్పడకముందే మేల్కొని రైతులకు, రైతు కూలీలకు అండదండలు అందించి వ్యవసాయంపై వారికి ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా ప్రతి పంచాయతీకి వ్యవసాయాధికారిని, సిబ్బందిని కేటాయించాలి. వర్షాధారంపై కాకుండా స్థిరమైన నీటి వనరులు ఏర్పాటు చేయాలి. పంటల బీమాను మండల యూనిట్‌గా కాకుండా, రైతు యూనిట్‌గా ఏర్పాటు చేయాలి. దేశంలో వ్యవసాయ కళాశాలలు కనీసం 5000 ఏర్పాటు చేయాలి. దేశ వ్యాప్తంగా పంటల నియంత్రణ చట్టం తేవాలి. దీని వల్ల ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో ముందే నిర్ణయించాలి. ఏఏ పంటలు ఎంత మేరకు అవసరం ఉందో ముందే నిర్ణయించాలి. దాని ప్రకారమే రైతులు ఏ పంటలు వేయాలో వారికి ముందే తెలిపి ఆయా పంటలు పండించేలా చర్యలు తీసుకోవాలి. చిన్న, సన్నకారు రైతులకు, రైతు కూలీలకు ప్రతి నెల కనీస వేతనం నిర్ణయించి స్థిరమైన ఆదాయం వారికి అందేలా చూడాలి. సమాజంలో పరిస్థితి ఎంతదారుణంగా ఉందంటే నెలకు 10 వేలు జీతం వచ్చే ఉద్యోగికి తమ కుమార్తెను ఇచ్చి వివాహం చేయడానికైనా ఆడపిల్ల తల్లిదండ్రులు ఇష్టపడుతున్నారు గానీ 25 ఎకరాలు పొలం ఉన్న యువకులకు మాత్రం ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితి మారి వ్యవసాయం కూడా మంచి ఆదాయ వనరుగా మారిన రోజున గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ చేసిన యువకులు కూడా వ్యవసాయం వైపు దృష్టి సారిస్తారు. విద్యావంతులు వ్యవసాయంపై ఆసక్తి పెంచుకున్నప్పుడే వ్యవసాయం అభివృద్ధి చెంది మంచి ఆర్థిక వనరుగా సమకూరుతుంది. మరి పాలకులు, విద్యావంతులు ఈ విషయంపై దృష్టి సారించి వ్యవసాయ రంగాన్ని పరుగులు తీయిస్తారని ఆశిద్దాం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.